10-10Pg1exHMNWJQE 1 GNT_10-10Pg1exHMNWJQE.qxd 10/10/2025 12:03 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

10-10-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 249 పేజీలు: 12 వెల: 6.50

వస్తుందో.. రాదో!
నోబెల్ శాంతిపై ట్రంప్ నిర్వేదం 9లో

శాంతి ప్రణాళికపై ఇజ్రాయెల్-హమాస్ సంతకాలు

## వైద్య కళాశాలలకు 'పిపిపి'లో తప్పేముంది?




### టెండర్ల ఖరారుపై స్టేకు నిరాకరించిన హైకోర్టు

### తదుపరి విచారణ 29కి వాయిదా

**విజయవాడ, అక్టోబరు9, ప్రభాతవార్తప్రతినిధి:** వైద్య కళాశాలలను ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మిస్తే తప్పేంటని రాష్ట్ర హైకోర్టు ప్రశ్నించింది. నిధుల కొరతతో కోర్టు భవన నిర్మాణాలే నిలిచిపోయాయని గుర్తుచేసిన ధర్మాసనం, నిధుల కొరత వల్లే పిపిపి నిర్ణయం తీసుకొని ఉండొచ్చని వ్యాఖ్యానించింది. టెండర్ల ఖరారుపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. రాష్ట్రంలో 10 వైద్య కళాశాలలను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో నిర్మించి నిర్వహించేందుకు రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. రాష్ట్రంలో ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల, పెనుకొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం వైద్య కళాశాలను పిపిపి విధానంలో అభివృద్ధి చేసేందుకు సెప్టెంబరు 9న ప్రభుత్వం ఇచ్చిన జీవోను సవాలు చేస్తూ గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన వసుంధర దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. ప్రజాప్రయోజనాలను పణంగా పెట్టివైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తున్నారని వసుంధర తరఫు న్యాయవాది శ్రీరామ్ వాదించారు. బిడ్‌లో విజేతగా నిలిచిన సంస్థ 33యేళ్ల వరకూ ఆ కళాశాలను నిర్వహిస్తుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 12 వైద్య కళాశాలలకు 5వేల 800 కోట్ల రూపాయల అంచనాతో పాలనపరమైన అనుమతులు ఇచ్చారని వివరించారు. ఈ దశలో స్పందించిన ధర్మాసనం పాలనపరమైన అనుమతులిస్తే సరిపోతుందా? నిధులు విడుదల చేయాలి కదా అని ప్రశ్నించింది. అంత పెద్ద మొత్తంలో సొమ్మును రాష్ట్రప్రభుత్వం ఖర్చుచేసే స్థితిలో ఉండాలి కదా? >>2

# రబీ సీజన్‌కు పక్కా ప్రణాళిక

### ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం
### రైతు సేవా కేంద్రాల పునర్వ్యవస్థీకరణ
### రైతు బజార్ల ఆధునీకరణ చర్యలు
### వ్యవసాయ సమీక్షలో సిఎం చంద్రబాబు



గురువారం సచివాలయంలో ఎరువుల ధరలపై పోస్టరును ఆవిష్కరిస్తున్న సిఎంచంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, అక్టోబరు 9, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్రంలో ఉన్న 218 మార్కెట్ కమిటీల స్థలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గురువారం సచివాలయంలో వ్యవసాయశాఖ, అనుబంధ రంగాలపై సిఎం చంద్రబాబు సమీక్షించారు. ఖరీఫ్ సాగు, రబీ ప్రణాళిక, ధాన్యం కొనుగోళ్ల తదితర అంశాలపై సమీక్షలో చర్చించారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో గ్రాస్ వాల్యూ అడిషన్‌పై సిఎం దిశా నిర్దేశం చేశారు. అలాగే ఈ నెల 11వ తేదీన ప్రధాని మోడీ ప్రారంభించనున్న పిఎం ధన్ ధాన్య కృషి యోజనపైకూడా సమీక్షలో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రైతులకు లాభం రావాలి... వినియోగదారునికి ప్రయోజనం కలగాలి. ఈ విషయంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పని చేయాలి. రైతు బజార్లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి. పత్తికొండలో ఇటీవల కాలంలో టమాటో పంటకు ధర తగ్గింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆ పంటను రైతు బజార్లకు తరలించి.. వినియోగదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలి. కోల్డ్ చైన్ లాంటి వ్యవస్థలను ఉపయోగించుకుని టమాటో పంటలకు ధర తగ్గకుండా చూసుకోవాలి. అర్బన్ ప్రాంతాల్లో రైతు బజార్ల ఆధునీకీకరణకు భూమి ఎంత వరకు అవసరమవుతుందో అంచనా వేయాలి. రైతు బజార్లకు అనుసంధానంగా మొబైల్ రైతు బజార్లను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించండి. మార్కెట్ కమిటీలను, రైతు బజార్లను అనుసంధానం చేసి కార్పొరేషన్‌ఏర్పాటుచేయాలి. వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను సద్వినియోగం చేసు కుంటూ కోల్డ్‌చైన్, అగ్రి ప్రాసెసింగ్ వంటి మౌలిక సదుపాయా >>2

## మత్స్యకారుల సమస్యలు 3 నెలల్లో పరిష్కారం



గురువారం ఉప్పాడలో మత్స్యకారులతో మాటామంతిలో మాట్లాడుతున్న డి.సిఎం పవన్ కల్యాణ్

### రూ. 90 లక్షల బీమా చెక్కులను పంపిణి చేసిన డి సిఎం పవన్
### పారిశ్రామిక కాలుష్యంపై ఆడిట్ చేపట్టండి: అధికారులకు ఆదేశం
### ఉప్పాడలో మత్స్యకారులతో మాటామంతిలో పాల్గొన్న డి.సిఎం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబర్ 9 (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా పర్యటనకు విచ్చేసిన డి.సిఎం పవన్‌కల్యాణ్ గురువారం కలెక్టరేట్ సమావేశ హాలులో ఉప్పాడ మత్స్యకార సోదరులతో మాటా మంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్స్యకార గ్రామాల పెద్దలు, యువత, మహిళలు, స్వచ్ఛంధ సంస్థలతో ముఖాముఖిలో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ బిందు మాధవ్, ప్రభుత్వ విప్‌లు దాట్ల సుబ్బరాజు, యనమల దివ్య, ఎమ్మెల్సీలు పిడుగు హరి ప్రసాద్, కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖర్, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, పంతం నానాజీ, వనమాడి కొండబాబు, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి, పౌర సరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెండెం దొరబాబు, పిఠాపురం జనసేన ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనివాసు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర స్థాయి అధికారులు పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ది శాఖ డైరక్టర్ మైలవరపు కృష్ణ తేజ, కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ ఎస్.శరవరణ్, మత్స్యశాఖ కమీషనర్ రామ్ శంకర్ నాయక్, రాష్ట్ర విపత్తుల నియంత్రణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.
కార్యక్రమంలో తొలుత సముద్ర వేటలో ప్రమాదవశాత్తు మరణించిన 18 మంది మత్స్యకారులకు కుటుంబాలకు గ్రూప్‌ఏక్సిడెంట్ ఇన్స్యూరెన్స్ క్రింద తొలివిడతగా ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినరూ 90 లక్షల ఎక్స్ గ్రేషియా మొత్తాల చెక్కులను ఉప ముఖ్యమంత్రి పవన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.
అనంతరం నిర్వహించిన మాటా మంతి కార్యక్రమంలో ఉప్పాడ, కోనపాపపేట, అమీనాబాద్, మూలపేట తదితర మత్స్యకార గ్రామాల ప్రతినిధులు పాల్గొని పారిశ్రామిక వ్యర్థాల వల్ల, ప్రకృతి వైపరీత్యాల వల్ల మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉపముఖ్యమంత్రికి వివరించి పరిష్కరించాలని వినతి చేశారు. సమస్యల పట్ల ఆవేదనతో తొందరపాటుగా ఆందోళనకు దిగినందుకు చింతిస్తున్నామని, ఉపముఖ్యమంత్రి పెద్ద మనసుతో తమ సమస్యలకు పరిష్కారం కల్పించాలని కోరారు. ఉప్పాడ తీరంలోని ఎస్ఇజడ్‌లో నెలకొల్పిన పరిశ్రమలు శుద్ది చేయకుండా తమ వ్యర్థాలను సముద్ర జలాల్లో విడిచి పెడుతున్నందున గడచిన 4,5 సంవత్స >>2



గురువారం ముంబయిలో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో ప్రధాని మోడీ భేటీ అయిన దృశ్యం

## ద్వైపాక్షికం పటిష్టం

### భారత్, యుకె సహజ భాగస్వాములు
### ఒప్పందంతో ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహం
### 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపు లక్ష్యం
### ముంబయిలో బ్రిటన్ ప్రధాని కీర్‌తో ప్రధాని మోడీ భేటీ
### ఇండో-పసిఫిక్ సముద్ర భద్రతపై కలిసి పనిచేయాలని నిర్ణయం

**ముంబయి, అక్టోబరు 9:** ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి పరిస్థితుల్లో భారత్, యుకె మధ్య భాగస్వామ్యం ప్రపంచ స్థిరత్వానికి, ఆర్థిక ప్రగతికి ఒక ముఖ్యమైన స్తంభంలా నిలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. "భారత్- యుకె భాగస్వామ్యం విశ్వసనీయమైనది. ప్రతిభ, సాంకేతికతఆధారితమైనది. యుకె ప్రధాని స్టార్మర్ నాయకత్వంలో భారత్, యుకె సంబంధాలు గణనీయమైన పురోగతిని సాధించాయి. భారత్, యుకె సహజ భాగస్వాములు. ప్రస్తుత ప్రపంచ అస్థిరత యుగంలో ఇరుదేశాల మధ్య పెరుగుతున్న ఈ భాగస్వామ్యం ప్రపంచ స్థిరత్వం, ఆర్థికపురోగతికి ఒక ముఖ్యమైన పునాది" అని మోడీ పేర్కొన్నారు.ఇరుదేశాల భాగ >>2



గురువారం బార్బడోస్‌లో 'హౌస్ ఆఫ్ అసెంబ్లీ స్పీకర్' స్థానంలో అయ్యన్నపాత్రుడు

## స్పీకర్ అయ్యన్నకు అరుదైన గౌరవం

### బార్బడోస్ పార్లమెంటు స్పీకర్ స్థానంలో ఆశీనులైన అయ్యన్న

**విజయవాడ,అక్టోబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు బార్బడోస్‌లో పర్యటించారు. గురువారం ఆయన బార్బడోస్ పార్లమెంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా, ప్రత్యేక ఆహ్వానం మేరకు బార్బడోస్ పార్లమెంట్ దిగువ సభ అయిన హౌస్ ఆఫ్ అసెంబ్లీ స్పీకర్ స్థానంలో అయ్యన్నపాత్రుడు ఆసీనులయ్యారు. ఈ స్పీకర్ కుర్చీకి భారత దేశంతో ఒక ప్రత్యేక అనుబంధం ఉంది. 1966లో బార్బడోస్ స్వాతంత్రం పొందినప్పుడు, అప్పటి భారత ప్రభుత్వం బహుమతిగా, అందంగా చెక్కిన ఈ >>2

# లక్ష బ్లూకాలర్ ఉద్యోగాలు లక్ష్యం



గురువారం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో సమీక్షలో మంత్రి లోకేష్

### ఓంక్యాప్ ద్వారా వచ్చే ఐదేళ్లలో కల్పిస్తాం
### స్కిల్ డెవలప్‌మెంట్ సమీక్షలో మంత్రి లోకేష్

**అమరావతి, అక్టోబరు 9, ప్రభాతవార్త:** ఓం క్యాప్ ద్వారా రాబోయే అయిదేళ్లలో లక్ష బ్లూకాలర్ ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు అనుగుణంగా స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ అధికారులు రూట్ మ్యాప్ రూపొందించి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో మంత్రి నారా లోకేష్ గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... నర్సింగ్, వెల్డర్స్, ట్రక్కర్స్, బిల్డింగ్ వర్కర్లకు యూరప్ తోపాటు జర్మనీ, ఇటలీల్లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. నర్సింగ్, ఐటిఐ, పాలిటెక్నిక్ విద్యనభ్యసించిన యువతీయువకులకు ఆయా భాషల్లో శిక్షణ ఇచ్చి, విదేశాల్లో ఉద్యోగాలు లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నర్సింగ్ ఉద్యోగాలకు సంబంధించి కేరళ మోడల్‌ను అధ్యయనం చేయాలని అన్నారు. యూరప్ జిసిసిలలో డిమాండ్ ఉన్న ఉద్యోగాలపై దృష్టిసారించండి, అందుకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం ఓంక్యాప్ ద్వారారాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 2,774 మంది నర్సింగ్ అభ్యర్థులు విదేశీభాషల్లో శిక్షణ పొందుతున్నారని అధికారులు తెలిపారు. నైపుణ్యం పోర్టల్ పై మంత్రి లోకేష్ సమీక్షించారు. ఇందులో 23 విభాగాల డాటా బేస్ ను ఇంటిగ్రేట్ చేసినట్లు మంత్రి చెప్పారు. రాష్ట్రంలో నెలకొని ఉన్న 4,639 భారీ, మధ్యతరహా పరిశ్రమలతో సంబంధించి వారికి అవసరమైన విధంగా వర్క్ ఫోర్స్‌ను సిద్ధం చేయాలని అన్నారు. వచ్చేనెలలో >>2



లాస్లో క్రాస్నహోర్కై

## హంగేరి రచయితకు సాహిత్యంలో నోబెల్

### లాస్లో క్రాస్నహోర్కైకి అత్యున్నత పురస్కారం
### దార్శనిక రచనలకు దక్కిన అరుదైన గౌరవం

**న్యూఢిల్లీ, అక్టోబరు 9:** హంగేరియన్ రచయిత లాస్లో క్రాస్నా హోర్కై రాసిన 'హెర్ష్ 07769' నవలకు 2025 నోబెల్ సాహిత్య పురస్కారం లభించింది. ఆ నవల సామాజిక అశాంతి, హింస, దహనాలతో చుట్టుముట్టిన ఒక చిన్న తురింగియన్ పట్టణ ప్రజల మానవ అస్తిత్వ వేదనను ప్రతిబింబించేలా ఉండటంతో 'గొప్ప సమకాలీన జర్మన్ నవల' గా పేరుగాంచింది. తన రచనలతో ఆ నవలను అద్భుతంగా రచించారు. ఆయన విలక్షణమైన, దార్శనిక రచనలకు ఈ అత్యున్నత పురస్కారం దక్కినట్లు స్వీడిష్ అకాడమీ గురువారం అధికారికంగా ప్రకటించింది. ప్రపంచ వినాశనం వంటి తీవ్ర భయానక పరిస్థితుల మధ్య కూడా కళకు ఉన్న అపారమైన శక్తిని తన రచనల ద్వారా బలంగా చాటి చెప్పినందుకుగాను లాస్లోకు ఈ గౌరవం అందిస్తున్నట్లు నోబెల్ కమిటీ తన ప్రకటనలో పేర్కొంది. ఆయన సాహిత్యం సమకాలీన ప్రపంచంలోని సంక్లిష్టతలను, మానవ అస్తిత్వ వేదనను వినూత్న శైలిలో ఆవిష్కరిస్తుందని ప్రశంసించింది. లాస్లో క్రాస్నహోర్కై తన రచనలతో ఆధునిక సాహిత్యంలో >>2

## నేటి నుంచి ఎన్టీఆర్ వైద్య సేవలు బంద్

**విజయవాడ, అక్టోబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఎన్టీఆర్ వైద్య సేవలు ఈ నెల 10వ తేదీ నుంచి బంద్ కానున్నట్లు సమాచారం! ఎన్టీఆర్ వైద్యసేవలు (ఆరోగ్యశ్రీ)నెట్వర్క్ ఆసుపత్రులకు ఎన్టీఆర్ ట్రస్ట్‌నుంచి బకాయిలు చెల్లించక పోవడంతో ఈనిర్ణయం తీసుకున్నట్లు ఎపి స్పెషాలిటీ ఆసుపత్రుల >>2

## 31 మంది ఐఎఎస్‌ల బదలీ

### పలు కీలక శాఖల్లో భారీగా మార్పులు

**విజయవాడ,అక్టోబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో భారీగా ఐఎఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 31 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వంలో ఇటీవల పలు ఐఎఎస్ అధికారులును బదిలీ చేసినా, పర్యాయం భారీగా ట్రాన్స్ఫర్లు చేసారు.సుదీర్ఘకాలం చూస్తున్న కొందరికి పోస్టింగ్,అదనపు బాధ్యతులు ఇచ్చారు. పౌరసరఫరాలశాఖ వైస్ ఛైర్మన్‌గా ఎస్.ఢిల్లీరావు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా పి. రంజిత్ బాషా, హౌసింగ్ కార్పొరేషన్ వైస్ సిఎండిగా అరుణ్‌బాబు, వ్యవసాయశాఖ డైరెక్టర్‌గా మనజీర్ జిలానీ సామున్, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్‌గా చక్రధర్‌బాబు, ఏపీపీఎస్సీ సెక్రెటరీగా రవి సుభాష్, ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీగా శివశంకర్ లోతేటి, నియమితులయ్యారు.
సిసిఎల్ఎ సెక్రటరీగా జె.వి. మురళి, సిసిఎల్ఎ జాయింట్ సెక్రటరీగా టి.ఎస్. చేతన్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ వైస్‌ఛైర్మన్‌గా బి. నవ్య, ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా ప్రవీణ్ ఆదిత్య, ఐ అండ్ పిఆర్ డైరెక్టర్‌గా కె.ఎస్. విశ్వనాథన్, పౌరసరఫరాలశాఖ డైరెక్టర్ గోవిందరావు, ఎపి ఎస్సీ కమిషన్ సెక్రటరీగా ఎస్.చిన్న రాముడు, ఎపి ట్రాన్స్‌కో జెఎండిగా జి. >>2

# మెడికల్ కాలేజీలు నిర్వీర్యం



గురువారం అనకాపల్లి జిల్లాలో వర్షంలోనే పర్యటించిన మాజీ సిఎం జగన్

### వాటిని ప్రైవేటు పరం చేస్తే అంతా దగాయే: మాజీ సిఎం జగన్

**విశాఖపట్నం, అక్టోబరు 9 ప్రభాతవార్త:** కోట్లాది మందికి వైద్యం, విద్య అందించే ఆధునిక దేవాలయాల వంటి మెడికల్ కాలేజీలను చంద్రబాబు దగ్గరుండి ప్రైవేటుపరం చేసేందుకు శ్రీకారం చుట్టారని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీ అధ్యక్షుడు వైయస్.జగన్ మోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం భీమ బోయినపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలను గురువారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలు ఉంటే ప్రతీ జిల్లాలోని ఏడెనిమిది నియోజకవర్గాల్లో సూపర్ స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ వైద్యం పేదలకు అందుబాటులో వస్తాయన్నారు. ఈ మెడికల్ కళాశాలలవల్ల ప్రైవేటు ఆసుపత్రుల దోపిడి,దగా అడ్డుకోవడం జరుగుతుందన్నారు. ఇటువంటి ఆధునిక దేవాలయాలను >>2

10-10Pg2exHMNWJQE 2_10-10Pg2exHMNWJQE.qxd 10/10/2025 12:00 AM Page 1





గురువారం ముంబయిలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్‌ను సందర్శించిన ప్రధాని మోడీ

# 3 నెలల్లో పరిష్కారం

>> రాలుగా మత్స్యసంపద క్రమేపి తరిగి పోయి మత్స్యకారులు జీవనోపాధికి ముప్పుగా పరిణమిస్తోందని, మత్స్యకారులకు వేట నిషేధ కాలం విధించిన సమయంలోనే పరిశ్రమలకు కూడా వ్యర్థాల విడుదలపై నిషేధం విధిస్తే మత్స్య సంపదకు ముప్పు ఉండదని మత్స్యకారులు విన్నవించారు. ఉప్పాడ, కోనపాప పేట వద్ద తీరం కోతకు గురి కావడం వల్ల ఇల్లు కోల్పోయిన మత్స్యకారులందరికి ఇళ్ల మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.
డి.సిఎం పవన్ కళ్యాణ్ మత్స్యకారుల సమస్యలను సావధానంగా ఆలకించి పరిష్కారంపై రాష్ట్ర, జిల్లా అధికారులతో చర్చించారు. ఉప్పాడ తీరంలో పరిశ్రమల వ్యర్థాలు సముద్ర జలాల్లో కలుస్తున్న అంశంపై ఎన్విరాన్మెంటల్ ఆడిట్ చేయిస్తామన్నారు. ఈ లోగా మూడు రోజుల్లోపు కాలుష్య స్థాయిపై ప్రాథమిక నివేదిక అందజేయాలని రాష్ట్ర పిసిబి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రెండు,మూడు రోజుల్లో మరో మారు వచ్చి సముద్రంలో వ్యర్థాలను వదులుతున్న ప్రదేశాలలో కాలుష్య పరిస్థితిని పరిశీలిస్తానన్నారు. నిర్మాణంలో ఉన్న హార్బరు డిజైన్ లోపాలపై ఐఐటి చెన్నై నిపుణల కమిటీ నివేదిక ప్రకారం మత్స్యకార బోట్లకు ముప్పు లేకుండా డిజైన్ కరెక్షన్ చేయిస్తామన్నారు. రాష్ట్ర, దేశాభివృద్ధికి పరిశ్రమలు అవసరమేనని, అయితే ప్రజల జీవనోపాధికి విఘాతం, లోటులేకుండా సమతౌల్యం పాటిస్తూ ముందుకు సాగాల్సి ఉందన్నారు. సాంప్ర దాయ వృత్తులను కాపాడుతూనే మత్స్యకార యువతకు స్కిల్ డవలెప్మెంట్ ద్వారా ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.
ఉప్పాడ బోట్ల లాండింగ్ అంశంలో అంతర్వేది, మచిలీపట్నం ప్రాంత మత్స్యకారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఓఎన్జీసి తరహాలో పరిహారం అందించే అంశం పరిశ్రమలు, మత్స్య, కాలుష్య నియంత్రణ తదితర శాఖలతో ముడిపడిన మల్టీ డిపార్టమెంటల్ అంశమని ఆయా శాఖలను సమన్వయపరచి నిర్ణయించాల్సి ఉందన్నారు. అలల కోత నుండి ఉప్పాడ తీరరక్షణకు అవసరమైన సుమారురూ 320 కోట్లు నిధులు కేంద్ర హోంశాఖ నుండి విడుదల కావాల్సి ఉందని, ఇందుకు తాను స్వయంగా డిల్లీవెళ్లి హోం మంత్రి అమిత్ షాను కలుస్తాని, వచ్చే రెండు, మూడు సంవత్సరాల్లో ఈ పనులు పూర్తి చేసేలా కృషి చేస్తానని ఉపముఖ్యమంత్రి తెలిపారు. నాలుగైదేళ్లుగా సమస్యలతో సతమతమౌతున్నా అప్పుడు గళంవిప్పని మత్స్యకారులు ఇపుడు ఆందోళనకు దిగడం శోచనీయ మన్నారు. మత్స్యకారుల సమస్యలకు కూటమి ప్రభుత్వం అంకితభావంతో చేస్తున్న కృషిని గుర్తించాలని కోరారు. మాటా మంతి కార్యక్రమంలో ప్రస్తావించిన సమస్యలను వచ్చే మూడు నెలలలోపు పరిష్కరిస్తామని హామీ ఇస్తూ, అందుకు సహకరించాలని ఉపముఖ్యమంత్రి మత్స్యకార ప్రతినిధులను కోరారు.

# లక్ష బ్లూకాలర్ ఉద్యోగాలు లక్ష్యం

>> పోర్టల్ ప్రారంభించే సమయానికి ఉద్యోగాలకు సంబంధించి సంపూర్ణ సమాచారాన్ని యువతకు అందుబాటులోకి తేవాలని చెప్పారు.రాష్ట్రంలోని 83 ప్రభుత్వ ఐటిఐలను మిషన్ మోడ్‌లో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఐటిఐలలో మౌలిక సదుపాయాలు, ఆధునీకరణ పనుల కోసం రూ.322 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఐటిఐలల్లో ప్రస్తుతం అడ్మిషన్లు పెరిగాయని, అయితే సిబ్బంది కొరత ఉన్నట్లు అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. పిఎం వికసిత్ భారత్ రోజ్ గార్ యోజన, పిఎం ఇంటర్న్ షిప్ లలో ఎపిని నెం.1గా నిలపాలని మంత్రి అన్నారు. ఐటిఐలలో కరిక్యులమ్, టెస్టింగ్, ఇంటర్న్ షిప్, సర్టిఫికేషన్, ప్లేస్ మెంట్స్ మెరుగుదలకు చర్యలు చేపట్టాలని సూచించారు.
పిఎం సేతు పథకం కింద ఐటిఐల అప్ గ్రేడేషన్ కు గల అవకాశాలపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలో 87 పాలిటెక్నిక్ లకు సంబంధించి 646 టీచింగ్, 2183 నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. పాలిటెక్నిక్ కళాశాలలను మెరుగ్గా తీర్చిదిద్దేందుకు దేశంలోని సక్సెస్ మోడల్ ను అధ్యయనం చేయాలని మంత్రి ఆదేశించారు. హబ్ అండ్ స్పోక్ మోడల్ లో విశాఖపట్నం, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో 3 హబ్ లు, వాటిని అనుబంధంగా 13స్పోక్స్ లలో ఐటిఐలను అభివృద్ధి చేయడానికి త్వరగా ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి లోకేష్ చెప్పారు. ఆర్సెలర్ మిట్టల్ అండ్ నిప్పాన్ స్టీల్స్ అనుబంధ సంస్థ నామ్ టెక్ రాష్ట్రంలో నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చినట్లు చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర మానవవనరుల శాఖ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్ కార్పొరేషన్ సిఇఒ గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ద్వైపాక్షికం పటిష్టం

>> స్వామ్యం ప్రపంచ స్థిరత్వం, ఆర్థిక పురోగతికి పునాదిగా మారుతోందని అభిప్రాయపడ్డారు. భారత్-బ్రిటన్ సంబంధాలకు పునాది ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, చట్టబద్ధమైన పాలన వంటి విలువలపై ఉన్న ఉమ్మడి నమ్మకమేనని తెలిపారు. ముంబయిలో బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌తో ఉన్నత స్థాయి చర్చల అనంతరం సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రధాని మోడీ ఈ వ్యాఖ్యలుచేశారు. ఈ సమావేశంలో ఇరు దేశాల మధ్య రక్షణ, విద్య, వాణిజ్యం వంటి కీలక రంగాల్లో సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు. భారత్, యుకె మధ్య అతిపెద్ద బిజినెస్ లీడర్స్ శిఖరాగ్ర సమావేశం జరిగింది. వీటన్నింటితో పాటు ఇరుదేశాల సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి సూచనలు, అవకాశాలను పంచుకున్నామని వివరించారు. "ఇటీవల యుకె పర్యటన సందర్భంగా చరిత్రాత్మక సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాం. భారత్- బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో, రెండు దేశాలకు దిగుమతి ఖర్చు తగ్గుతుంది. యువతకు కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వాణిజ్యం పెరుగుతుంది. ఈ ఒప్పందం భారత్‌లోని పరిశ్రమలు, వినియోగదారులకు ప్రయోజనం చేకూరుస్తుంది. ఒప్పందంపై సంతకం చేసిన కొద్ది నెలల్లోనే, ఇప్పటివరకు అతిపెద్ద వ్యాపార ప్రతినిధి బృందం యుకె ప్రధాని స్టార్మర్‌తో పాటు భారత్‌కు రావడం ఇరుదేశాల భాగస్వామ్యానికి నాందిగా నిలిచింది" అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. యుకెకు చెందిన తొమ్మిది విశ్వవిద్యాలయాలు భారత్‌లో క్యాంపస్‌లను ప్రారంభిస్తాయని ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. సౌతాంప్టన్ విశ్వవిద్యాలయం తాలుకు గురుగ్రామ్ క్యాంపస్ ఇప్పటికే ప్రారంభమైందని, అక్కడ ఇప్పటికే మొదటిసంవత్సరం విద్యార్థులు చేరారని పేర్కొన్నారు.

**భారత్‌పై బ్రిటన్ ప్రధాని ప్రశంసలు**

భారతదేశ వృద్ధి కథ చాలా అద్భుతమైనదని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కొనియాడారు. 2028 నాటికి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్న భారత్, ప్రధాని మోడీ నాయకత్వాన్ని తాను అభినందిస్తున్నానని తెలిపారు. 2047 నాటికి భారత్‌ను పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే ప్రధాని మోడీ లక్ష్యమన్నారు. "భారత్ అభివృద్ధి ప్రయాణంలో యుకె భాగస్వామిగా ఉండాలని కోరుకుంటోంది. నా సందర్శన ఇరుదేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం సామర్థ్యాన్ని రెట్టింపు చేయాలనేలక్ష్యంతో రికార్డు స్థాయిలో 126మంది బ్రిటిష్ ప్రతినిధుల బృందంతో భారత్‌కు తీసుకొచ్చాను. మేము భారత్‌తోకలిసి భవిష్యత్తుపై దృష్టి సారించాం. కొత్త ఆధునిక భాగస్వామ్యాన్ని సృష్టిస్తున్నాం. రెండు దేశాలు మరింతగా కలిసి పనిచేస్తాయనే నమ్మకం, విశ్వాసం ఉంది" అని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు.

**ఐరాస భద్రతామండలిలో భారత్ స్థానం పొందాలి**

భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం దక్కాలన్న వాదనకు బ్రిటన్ నుంచి బలమైన మద్దతు లభించింది. ప్రపంచ వేదికపై భారత్ తన 'సరైన స్థానాన్ని' పొందాలని యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ స్పష్టం చేశారు. భారత్ సాధిస్తున్న అద్భుతమైన అభివృద్ధిని, అంతర్జాతీయ వ్యవహారాల్లో కీలక పాత్ర

# స్పీకర్ అయ్యన్నకు అరుదైన గౌరవం

>> స్పీకర్ కుర్చీని బార్బడోస్‌కు అందించింది. ఇకభారత ప్రజాస్వామ్య వ్యవస్థ అత్యంత పటిష్టమైనదని, ప్రజలే ఇక్కడ సార్వభౌములని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. బార్బడోస్‌లోని బ్రిడ్జ్‌టౌన్‌లో జరుగుతున్న 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సులో భాగంగా గురువారం జరిగిన "పార్లమెంటరీ స్క్రుటినీ ఫర్ ఇంప్రూవ్డ్ డెమోక్రసీ" అనే అంశంపై ఆయన కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, 75 సంవత్సరాలుగా భారతదేశం ఒక గణతంత్ర రాజ్యంగా విజయవంతంగా కొనసాగడంలో పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. "ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలేపాలకులు" అనే స్ఫూర్తితో రూపొందించబడిన భారత రాజ్యాంగమే మన ప్రజాస్వామ్యానికి పునాది అని ఆయన పేర్కొన్నారు. భారత ఎన్నికల వ్యవస్థ గొప్పతనాన్ని వివరిస్తూ, "దేశంలో జరిగిన 18వ లోక్‌సభ ఎన్నికల్లో సుమారు 97 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత 18 సార్వత్రిక ఎన్నికలలో దేశ ప్రజలు 8 సార్లు ప్రభుత్వాలను శాంతియుతంగా మార్చారు. ఇది భారత ఓటరుకున్న శక్తికి, ప్రజాస్వామ్య వ్యవస్థపై వారికున్న నమ్మకానికి నిదర్శనం" అని స్పీకర్‌అన్నారు.భారత రాజ్యాంగం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మార్పులకు లోనవుతూ, వందకు పైగా సవరణలతో మరింత పరిణతి చెందిందని తెలిపారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు తమ పరిధిలో పనిచేస్తూ రాజ్యాంగ ఆధిక్యతను గౌరవిస్తాయని, ప్రజలే నిజమైన యజమానులని స్పష్టం చేశారు. తన ప్రసంగంలో దివంగత నేత నందమూరి తారక రామారావు చెప్పిన "ప్రజలే దేవుళ్లు, సమాజమే దేవాలయం" అనేమాటలను, మహాత్మా గాంధీ చెప్పిన ప్రజాస్వామ్య సూక్తులను స్పీకర్ ఉటంకించారు. ప్రజాప్రతినిధులు తమఆస్తులు, అప్పులను స్వచ్ఛందంగా ప్రకటించే పద్ధతిని తప్పని సరి చేయాలని ఆయన సూచించారు. ఈ సదస్సులో వివిధ దేశాల ప్రతినిధులు, స్పీకర్లు పాల్గొన్నారు.

# హంగేరి రచయితకు సాహిత్యంలో నోబెల్

>> తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇప్పుడు నోబెల్ బహుమతితో ఆయన కీర్తి విశ్వవ్యాప్తమైంది. 1954లో హంగేరి సరిహద్దులోని రొమేనియాకు సమీపంలో ఉన్న గ్యులా అనే చిన్న పట్టణంలో జన్మించిన క్రాస్నా హోర్కై తన సుదీర్ఘమైన, సంక్లిష్టమైన వాక్యాలు, తాత్విక లోతుకు ప్రసిద్ధి చెందాయి. ఫ్రాంజ్ కాఫ్కా, థామస్ బెర్న్ హార్డ్‌లతో పోలిస్తే అతని రచనలు అసంబద్ధత, వింతైన చిత్రాలు, ఆధ్యాత్మిక ఆత్మపరిశీలనను మిళితం చేస్తాయి. క్రాస్జ్నా హోర్కై 1985లో తొలిసారిగా రాసిన స్టంటాంగో(సాటాంటాంగో)తో అంతర్జాతీయ ప్రశంసలు అందుకున్నారు. అలాగే 'ఎ మౌంటైన్ టు ది నార్త్'(2003), ఎ లేక్ టు ది సౌత్, పాత్స్ టు ది వెస్ట్, ఎ రివర్ టు ది ఈస్ట్ నవలలు సాహితీ ప్రియులను మంత్రముగ్దులను చేశాయి. ఆ తర్వాత సీయోబో దేర్ బిలో (2008) నవల కూడా ప్రశంసలందుకుంది.



గురువారం ఆస్ట్రేలియాలోని కాన్‌బెర్రాలో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌కు ఘనంగా స్వాగతం పలికిన దృశ్యం

# 'పిపిపి'లో తప్పేముంది?

>> అని వ్యాఖ్యానించింది. నిధుల కొరత కారణంగా పిపిపి విధానంలో నిర్మించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకొని ఉండొచ్చని, అది తప్పెలా అవుతుందని ధర్మాసనం ప్రశ్నించింది. ఇటువంటి విషయాల్లో అందరం నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని, లేకపోతే ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులు ఎప్పటికీ అభివృద్ధి చెందవని ఘాటుగా వ్యాఖ్యానించింది. వైద్య కళాశాలల నిర్మాణం పూర్తిగా ప్రైవేటుకు అప్పగించ కుండా ప్రభుత్వ భాగస్వామ్యం ఉండడం మంచిదేకదా? అని వ్యాఖ్యానించింది. పిపిపి విధానంలో ఆసుపత్రులను నిర్మించాలనేది ప్రభుత్వవిధానపర నిర్ణయమని, రాజ్యాంగ, చట్టవిరుద్ధ నిర్ణయాల్లోతప్ప ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవని ధర్మాసనం తేల్చిచెప్పింది.పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని దినితోపాటు వైద్యారోగ్య ముఖ్య కార్యదర్శి, ఎపి వైద్యసేవలు, మౌలికాభివృద్ధి సంస్థ ఎండి, ఎపి వైద్య విద్య, పరిశోధన సంస్థ ఎండికి నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది.

# నేటి నుంచి ఎన్టీఆర్ వైద్య సేవలు బంద్

>> అసోసి యేషన్ (ఆషా) తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆసుపత్రులకు రూ.2,700 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని, అందుకే ఈ సేవలను నిలిపివేస్తున్నామని వారు ప్రకటించారు. పూర్తి స్థాయిలో బిల్లు చెల్లిస్తే సేవలు తిరిగి ప్రారంభిస్తామని ఆషా స్పష్టం చేసింది.ఈ క్రమంలో నెట్వర్క్ ఆసుపత్రులకు బిల్లులు గత ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత క్రమంగా చెల్లిస్తూ వస్తున్నామని ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆశా నిర్ణయాన్ని సిఎం చంద్రబాబు దృష్టిలో పెట్టి సమస్యను పరిష్కరింప చేస్తామని గురువారం మంత్రి తెలిపారు.ఈ రాత్రికే సమస్య పరిష్కరించే దిశలో ఆశాతో చర్చలు చేపడతామన్నారు.

# 31 మంది ఐఎఎస్‌ల బదలీ

>> సూర్య సాయి ప్రవీణ్‌చంద్, బాపట్ల జాయింట్ కలెక్టర్‌గా ఎస్.ఎస్. భావన, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ సెక్రటరీగా సి. విష్ణుచరణ్, వైద్యారోగ్యశాఖ డిప్యూటీ సెక్రటరీగా ఎస్.ఎస్. శోభిక, ఎపి మారిటైం బోర్డు సిఇఒగా అభిషేక్‌కుమార్, నంద్యాల జాయింట్ కలెక్టర్‌గా కొల్లాబత్తుల కార్తీక్, పరిశ్రమలశాఖ డైరెక్టర్‌గా శుభమ్ బన్సల్. ఏలూరు జాయింట్ కలెక్టర్‌గా అభిషేక్ గౌడ, కర్నూలు జాయింట్ కలెక్టర్‌గా నూరుల్, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్‌గా రాహుల్‌మీనా, కాకినాడ జాయింట్ కలెక్టర్‌గా అపూర్వ భరత్ అవకాశం దక్కింది.ఇక బదిలీ అయిన ఐఎఎస్ అధికారుల వివరాలను పరిశీలిస్తే అనూహ్యంగా 31 మందిని ఏక కాలంలో వేరే శాఖ, ప్రాంతానికి పంపడం, అదనపు బాధ్యతలు అప్పగించడం చేసింది. రాష్ట్ర సమాచారశాఖ డైరెక్టర్ గా కేఎస్ విశ్వనాథన్‌ను ప్రభుత్వం నియమించింది. గతంలో ఈ పోస్టులో పనిచేసిన హిమాన్షుశుక్లాను నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేయడంతో.. ఆయన స్థానంలో తాత్కాలికంగా ప్రఖర్‌జైన్‌కు బాధ్యతలు అప్పగించింది.

# నాలా చట్టం స్థానే లెవీ చట్టం తెస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ విడుదల

## భూమి విలువలో నాలుగు శాతం వసూలు

## డెవలప్‌మెంట్, ఇతర ఛార్జీలు అదనం

**విజయవాడ,అక్టోబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ప్రభుత్వం తాజాగా లేవి చట్టాన్ని తీసుకుని వచ్చింది. ఇటీవల నాలా చట్టాన్ని రద్దు చేసిన ప్రభుత్వం ఆ స్థానంలో లెవీని తీసుకొచ్చింది. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఆర్డినెన్స్ జారీచేశారు. ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రణాళికా చట్టం 1920లోని సెక్షన్ 44(1), సెక్షన్ 18(ఏ) ప్రకారం లెవీ వసూలు చట్టాన్ని తీసుకొస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. గతంలో నాలా కింద అనుమతులు పొందిన భూములను ఈ చట్టం కింద మినహాయించారు. ఈ చట్టాన్ని ఆంధ్రప్రదేశ్ లెవీ వసూలు, ఇతర అభివృద్ధి ఛార్జీల వసూలు చట్టం 2025గా పేర్కొన్నారు. రాజధాని నగరంమినహా ఎపిసిఆర్‌డిఏ, పట్టణాభివృద్ధి సంస్థలు, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, 1920 పట్టణ ప్రణాళికా చట్టం కింద నోటిఫై చేసిన అన్ని ప్రాంతాలకూ ఇది వరిస్తుందని తెలిపారు.
వైస్‌ఛైర్‌పర్సన్లు, కమిషనర్లు దీనికి బాధ్యత వహిస్తారని తెలిపారు. వసూలు చేస్తున్న లెవీని రోడ్లు, ఫ్లైఓవర్లు, ఉద్యానవనాలు, ఇతర సౌకర్యాల కోసం ఉపయోగిస్తామని జిఓలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో నిర్ణీతఛార్జీలు చెల్లించి అనుమతి పొందొచ్చని వివరించారు. సబ్ డివిజన్ జరగని భూముల్లో అభివృద్ధికి అనుమతులు కోరితే రెవెన్యూ నుండి ఎన్ఓసి తీసుకోవాలని చట్టంలో పేర్కొన్నారు. నాలా కింద దరఖాస్తు చేసుకున్న వాటిని ఈ చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిపాటు పరిష్కరిస్తారని వివరించారు. కొత్త చట్టం ప్రకారం ఎస్ఆర్ఓ విలువపై నాలుగుశాతం ఛార్జీలు వసూలు చేస్తారు. లేఅవుట్, అభివృద్ధి ఛార్జీలు అదనంగా ఉంటాయని వివరించారు. ఈ నెల మూడోతేదీ నుండి వసూలు చేసిన మొత్తాన్ని రెవెన్యూశాఖ 85:15 నిష్పత్తిలో సంబంధిత పట్టణాభివృద్ధి సంస్థలకు బదిలీ చేస్తుందని తెలిపారు. అలాగే వసూలు చేసిన లెవీకి ప్రత్యేక ఖాతా ఏర్పాటు చేయాలని తెలిపారు.

# నేడు కేబినెట్ సమావేశం

**విజయవాడ,అక్టోబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం సమావేశం ఈ నెల 10 శుక్రవారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభంకానుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుఅధ్యక్షతన జరుగనున్న ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. దేశ చరిత్రలోనే ఏపీలో అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి కేబినెట్ ఆమోదం తెలుపనుంది. రూ.87,520 కోట్లతో విశాఖలో రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్ ఏర్పాటుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. కేబినెట్ సమావేశంలో రూ.1,14,824 కోట్ల పెట్టుబడులకు ఆమోద ముద్ర పడనుంది. 26 ప్రాజెక్టుల ద్వారా 67,218 మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశం ఉంది.
అమరావతిలో రూ.212 కోట్లతో నిర్మించనున్న గవర్నర్ నివాసం రాజ్‌భవన్ నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం తెలుపనుంది. కృష్ణా నదీ ఒడ్డున అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ నిర్మాణంలో భాగంగా రాజ్ భవన్ నిర్మాణం జరుగనుంది. మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి 25 శాతం నిధులను సీఆర్డీఏ ఇచ్చేందుకు ఆమోదించనుంది కేబినెట్. రాజధాని ప్రాంతంలో నాలుగు కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి.. రాజధాని నగర జోనింగ్ నిబంధనల్లో గ్రీన్ సర్టిఫైడ్ భవనాలు ఉండేలా అవసరమైన మార్పులు చేర్పులకు కేబినెట్ ఓకే చెప్పనుంది. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణానికి ఎగ్జిక్యూటీవ్ ఏజెన్సీగా సీఆర్డీఏ వ్యవహరించేలా ఏపీ కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలిపే అవకాశం ఉంది. హ్యాపీ నెస్ట్, ఏపీ ఎన్నార్టీ ప్రాజెక్టులకు చెందిన బిల్డింగ్ పర్మిషన్ ఫీజును మాఫీ చేసేందుకు కేబినెట్ ఆమోదించే ఛాన్స్ ఉంది. కొండవీడు వాగు సమీపంలో నీటి ప్రవా హాల కోసం 8400క్యూసెక్కుల సామర్థంతో మరో పంపింగ్ స్టేషన్ నిర్మాణానికి ఆమోదం తెలపనుంది కేబినెట్. పలు సంస్థలకు భూ కేటాయింపులకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలియజేయనుంది.

# 15 నుంచి విద్యుత్ ఉద్యోగుల నిరవధిక సమ్మె

## యాజమాన్యంతో ఐకాస చర్చలు విఫలం

**విజయవాడ,అక్టోబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 15 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు విద్యుత్ ఉద్యోగుల ఐకాస ప్రకటించింది. విద్యుత్ సంస్థల యాజమాన్యంతో విజయవాడలోని విద్యుత్ సౌధలో బుధవారం జరిగిన చర్చలు విఫలం కావడంతో సమ్మె అనివార్యమని స్పష్టం చేసింది. 29 ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత నెల 30న ఐకాస సమ్మె నోటీసు ఇచ్చింది. దీంతో యాజమాన్యం ఆహ్వానం మేరకు బుధవారం వివిధ డిమాండ్లపై ఐకాస ప్రతినిధులు చర్చించారు. విద్యుత్ ఉద్యోగుల స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ నాగలక్ష్మి,సభ్యులు పృథ్వీతేజ్,సంతోషరావు,డైరెక్టర్ల నుంచి ఈ సమస్యలు పరిష్కారం దిశగా హామీ ఇవ్వకపోవడంతో నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు ఐకాస ప్రకటించింది. తప్పని పరిస్థితుల్లో సమ్మెకు వెళ్లాలని నిర్ణయించినట్లు నేతలు పేర్కొన్నారు. దశల వారీ ఆందోళనల్లో భాగంగా ఈ నెల 13న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపింది.

# రబీ సీజన్‌కు పక్కా ప్రణాళిక

>> లను కల్పించాలి." అని సిఎం ఆదేశించారు.

**ఎరువుల వినియోగం తగ్గించేలా రైతుల్లో అవగాహన..**

"రైతు సేవా కేంద్రాలను పునర్ వ్యవస్థీకరించేలా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకోవాలి. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడిన రైతులకు సేవలందించేలా రైతుసేవా కేంద్రాలను తీర్చిదిద్దాలి. రైతులకు వివిధ రకాల ప్రభుత్వ సేవలు అందించే విషయంలో రైతుసేవా కేంద్రాలే కీలక పాత్ర పోషించాలి. ఎక్కువ యూరియా వేస్తే ఎక్కువ పంట వస్తుందని.. ఆదాయం వస్తుందని రసాయన ఎరువులు, పురుగు మందులు ఎక్కువ వాడేస్తున్నారు. తద్వారా భూసారం క్షీణించడంతో పాటు వ్యాధులు వస్తున్నాయి. రసాయన ఎరువులు అధికంగా ఉపయోగించిన ఉత్పత్తుల వినియోగం కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. మంచి పోషక విలువలు అందించటం ద్వారా భూసారం పెంచాలి... దాని ద్వారా ఉత్పాదకత పెంచాలి. 2026 ఖరీఫ్ సీజన్లో సేంద్రీయ సాగు పెంచేలా, ఎరువుల వినియోగం తగ్గించేలా రైతుల్లో అవగాహన పెంచాలి.ఎలాంటి మార్పులు జరగాలన్నా... క్షేత్రస్థాయిలో ఉండేవారికి పూర్తి స్థాయి అవగాహన ఉండేలా చూడాలి. భూసారం పెంచే పోషకాల విషయంలో లోపాలను సవరించి తదుపరి ప్రణాళికలు చేసుకోవాలి. దశలవారీగా రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి." అని సీఎం అన్నారు.
రబీ సీజన్ కోసం 23 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని సమీక్షలో అధికారులు వివరించారు. ఇప్పటికే జిల్లాలకు 41 వేల మెట్రిక్ టన్నుల యూరియాను జిల్లాలకు సరఫరా చేశామని అధికారులు చెప్పారు. పోర్టుల్లో 79,527 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలున్నాయని వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "రబీ సాగు కోసం భూసార పరీక్షలు చేసి... ఆ డేటా ప్రకారం మైక్రో న్యూట్రియంట్స్ వేసుకునేలా రైతును ప్రోత్సహించండి. వచ్చే సీజన్‌కు భూసార పరీక్షలపై ఓ ప్రామాణిక విధానాన్ని రూపొందించండి. దుకాణాల వారీగా, రైతుసేవా కేంద్రాల వారీగా రికార్డులు నవీకరణ చేయాలి. రైతులు, కౌలు రైతులకు ఎంత యూరియా సరఫరా చేశారన్న అంశంపై రికార్డులు పక్కాగా ఉండాలి. సాగు విస్తీర్ణం ప్రకారం ఎరువుల సరఫరా జరగాలి. ఈ ఏడాది 90.91 లక్షల మెట్రిక్ టన్నుల మేర పంట ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. 51 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం. ఇది గత ఏడాదితో పోలిస్తే 44 శాతం అధికం. టార్పాలిన్లు రైతులకు అందుబాటులో ఉంచాలి." అని చంద్రబాబు చెప్పారు.

**ధనధాన్య కృషీ యోజన కింద రైతులకు కలిగే లాభాలపై అధ్యయనం..**

"హెడ్డీ బర్లీ పొగాకును రైతులు తక్కువ ధరకే అమ్ముకోకుండా చూడాలి.దీని కోసం పంటను కూడా అవసరమైన మేరకు నియంత్రించుకోవాల్సిన అవసరం ఉంది. నాలుగు జిల్లాల్లో పొగాకుకు క్రాప్ హాలిడే ప్రకటించండి. సెరీ కల్చర్ విషయంలో బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారం తీసుకోండి. పట్టు పురుగుల సాగు ఉండే చోట ఇతర పంటల సాగులో ఎరువుల వినియోగం తక్కువగా ఉండేలా చూడండి. వ్యవసాయ సెరీకల్చర్ శాఖలు సమన్వయంతో పని చేయాలి. రైతులకు వచ్చే పంట ఆదాయం, ఇతర ప్రత్యామ్నాయాలపై రీఓరియంటేషన్ జరగాలి." అని ముఖ్యమంత్రి సూచించారు. "ఉల్లి, టొమాటో, మిర్చి, మామిడి పంటల విషయంలో సాగు ఖర్చులు ఎంత వరకు ఉన్నాయో ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాలి. అరటి పంటకు దేశీయంగానూ, విదేశాల్లోనూ పెద్ద ఎత్తున వినియోగం ఉంది. ఉద్యాన పంటలను దేశీయ మార్కెట్లుతో పాటు ఎగుమతులు చేసేందుకు, లాజిస్టిక్స్ సవాళ్లు లేకుండా చూసుకోవాలి. రాష్ట్రంలో ఉన్న ఆవుల విసర్జితాలతో జీవామృతంతయారుచేసి ప్రకృతి వ్యవసాయానికి అనుసంధానించాలి. ప్రకృతి వ్యవసాయంలో కూలీల వ్యయం తగ్గేందుకు ఉన్న అవకాశాలు పరిశీలించాలి. ప్లాంటేషన్, హార్వెస్టింగ్ మేనేజ్మెంట్ అనేదే పకృతి సేద్యంలో కీలకం. కాఫీ గింజలకు సోకిన బెరిబోరర్ తెగులు నివారణకు జీవామృతం వినియోగించాలి." అని సిఎం చెప్పారు. ఈసమీక్షకు మంత్రి కె.అచ్చెన్నాయుడు, వ్యవసాయ అనుబంధ కార్పొరేషన్ ఛైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# మెడికల్ కాలేజీలు నిర్వీర్యం

>> ప్రైవేటుపరం చేస్తే అంతా ప్రైవేటువాళ్లే దగా చేస్తారని, ఇక పేదవాడికి ఏ రకంగా భరోసా అందుతుందని ప్రశ్నించారు. 2022లో డిసెంబరు 30న నర్సీపట్నం మెడికల్ కాలేజీకి శంకుస్థాపన చేసామని గుర్తు చేశారు. ఇక్కడ 52 ఎకరాల్లో మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టామన్నారు. కోవిడ్ సంక్షోభంలోనూ రూ.500 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. ఈ మెడికల్ కాలేజీ పూర్తయితే 600 పడకల ఆసుపత్రితో పేదలకు ఉచితంగా వైద్యం అందించడం జరుగుతుందన్నారు. సంవత్సరానికి 150 మెడికల్ సీట్లు అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశం ఉందన్నారు. రోజుకు వందలాది మంది రోగులు విశాఖ కెజిహెచ్‌కు వెళ్లే పరిస్థితి ఉందన్నారు. ఆ పరిస్థితుల్లో ఇక్కడ మెడికల్ కళాశాల ఏర్పాటు అయితే పేదలకు ఇక్కడే మంచి వైద్యం అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతీ జిల్లాకు మెడికల్ కళాశాలలను తీసుకొచ్చామన్నారు. ప్రైవేటు ఆసుపత్రులు ఎక్కువ చార్జీ చేస్తే తట్టుకోవడం పేదవాళ్లకు అసాధ్యమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే వైఎస్సార్సీ ప్రభుత్వం ప్రభుత్వం మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. ఇప్పటికే విజయనగరం, పాడేరు మెడికల్ కాలేజీలు క్లాసులు ప్రారంభమయ్యాయన్నారు. పేదవాళ్లు చదువుకునేదుకు, మెడిసెన్ చదివేందుకు మెడికల్ సీట్లు అందుబాటులోకి వస్తాయన్నారు. మొత్తం మెడికల్ కాలేజీలకు ఐదేళ్లలో ఐదు కోట్లు ఏడాదికి వెయ్యి కోట్లు ఖర్చు చేయలేరా చంద్రబాబు అని ప్రశ్నించారు. ఇక్కడ మెడికల్ కాలేజీకి జిఒ ఉందా అని స్పీకర్ అయ్యన్న అంటున్నారని, ఇదిగో జిఒ 204 అని చూపించారు.
స్పీకర్ పదవిలో ఉండి అబద్ధాలు ఆడకూడదని, చంద్రబాబు నాయుడు కంటే తాను నాలుగు ఆకులు ఎక్కువ చదివినట్లు అబద్ధాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. అమరావతిలో లక్ష ఎకరాలు సేకరించి అక్కడ రోడ్లు వేయడానికి, డ్రైనేజీలు కట్టడానికి, విద్యుత్తు, నీళ్లు ఇవ్వడానికి మొత్తం 50వేల ఎకరాలు. ఎకరాకు రెండు కోట్ల చొప్పున మొత్తం లక్ష కోట్లు కావాలని చెప్పిన చంద్రబాబు రూ.4500 కోట్లు ఖర్చు పెట్టి ఇప్పుడు 50వేల ఎకరాలు సరిపోవన్నారు. మరో 50వేల ఎకరాలు కావాలని తీసుకుంటున్నారని చెప్పారు. ఇలా అమరావతి మొత్తంగా లక్ష ఎకరాలు రెండు లక్షలకోట్లు ఖర్చు పెట్టేందుకు సిద్దమవుతూ 70వేల కోట్ల రూపాయల టెండర్లు పిలిచామని చెప్పుకుంటూ కోట్లాది మందికి మేలు చేసే మెడికల్ కాలేజీలకు, ఉచితంగా వైద్యం అందించే మెడికల్ కాలేజీలకు ఏడాదికి వెయ్యి కోట్లు ఐదేళ్లకు ఐదు వేల కోట్లు ఖర్చు పెట్టలేక ప్రైవేటుపరం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

## వారం - వర్జ్యం

10-10-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
చవితి రా.7.42
కృత్తిక సా.5.34
వర్జ్యం : ఉ.8.07-9.34
దు.ఉ.8.22-9.09, 2) మ.12.19-1.06
శుభసమయం : ఉ.5.30-6.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** భూమి స్థిరాస్తుల సంబంధితమైన రాబడి ఉద్యోగ పరముగా ఇబ్బందులకు గురిచేస్తాయి.

**వృషభం:** సంకుచిత మనస్తత్వము గల వ్యక్తులకు దూరంగా ఉండండి.

**మిథునం:** మౌనం శ్రీరామ రక్ష అవుతుంది. ఓర్పు, నేర్పులు మేలు చేస్తాయి.

**కర్కాటకం :** యుక్తితో సమస్యల వలయాల నుండి బయట పడతారు.

**సింహం:** మనోధైర్యంతో మీరు తీసుకునే నిర్ణయాలు నలుగురిలో స్లాఘించబడతాయి.

**కన్య :** నైపుణ్యంతో ప్రతిభతో మెదడుకు పదునుపెట్టి వ్యాపారంలో నష్టం నుండి తప్పుకోంటారు.

**తుల :** ఇతరులకు మీరు ఇచ్చే సలహాలు మీకు ఉపకరించవు. ప్రయాణాలు.

**వృశ్చికం:** అరోగ్యము సూత్రాలు పాటించవలసిన కాలం. ఆర్థిక లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** ఆర్థిక విషయ వ్యవహారాలు, వృత్తి ఉద్యోగ వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి.

**మకరం:** పెదవిదాటడం వలన ఇబ్బందులను కొని తెచ్చుకోవడం అవుతుంది. జాగ్రత్త వహించండి.

**కుంభం:** ఉద్యోగస్తులు తమ తోటి వారితో అప్రమత్తతో మెలగాలి.

**మీనం :** పూర్వపు మిత్రులను కలుసుకొని ఆనందంగా గడుపుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

10-10Pg 3 GNT 3_10-10Pg 3 GNT.qxd 10/10/2025 12:16 AM Page 1



# ఆదివాసీ హక్కులకు విరుద్ధంగా మంజూరు చేసిన పవర్ ప్రాజెక్టుల ఒప్పందాలు రద్దు చేయండి



### సిఎం చంద్రబాబుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ

**విజయవాడ,అక్టోబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆదివాసీ చట్టాలు, హక్కులకు విరుద్ధంగా మంజూరు చేసిన హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఒప్పందాలు రద్దు చేయాలని కోరుతూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రి చంద్రబాబుకి లేఖ రాశారు. లేఖలో "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 5వ షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న అల్లూరి సీతారామరాజు (ఏ.ఎస్.ఆర్.), పార్వతీపురం మన్యం జిల్లాలు, అనకాపల్లి సబ్‌ప్లాన్ ఏరియాలలో పంప్డ్ స్టోరేజీ హైడల్ ప్రాజెక్టుల ప్రతిపాదన ఆదివాసుల్ని తీవ్రమైన ఆందోళనకు గురిచేస్తున్నది. ఆదివాసీల హక్కులు, భూములు, సంస్కృతి, పర్యావరణం దారుణంగా దెబ్బతింటాయి. పైన పేర్కొన్న ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి నవయుగ, మెగా, అదానీ, శ్రీ శిరిడిసాయి మొదలగు కార్పొరేట్ కంపెనీలకు ఆదివాసీ గ్రామ సభ ఆమోదం లేకుండానే జి.ఓ.లు నెం. 51,13,2 (ఇంధన మరియు శక్తి విభాగం) రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఆదివాసీల చట్టాలు, హక్కులకు పూర్తి విరుద్ధంగా కార్పొరేట్ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం అక్రమ ఒప్పందం చేసుకుంది. కనీసం గిరిజన సలహా మండలి అభిప్రాయం కూడ తీసుకోలేదు. ప్రభుత్వ చర్యలు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీల (ఎక్స్‌టెన్షన్) షెడ్యూల్డ్ ఏరియాలకు (పెసా) చట్టం 1996 నిబంధనలు 2011, అడవి హక్కుల చట్టం (ఎఫ్‌ఆర్ఏ) 2006, ఆంధ్రప్రదేశ్ భూమి బదిలీల నియంత్రణ (1/70 నియమం) చట్టాలకు వ్యతిరేకం. సుప్రీం కోర్టు సమతా జడ్జిమెంట్ ఇప్పటికీ విలువ కలిగి ఉంది. అలాగే, ఎఫ్‌ఆర్ఏ చట్టం కింద ఆదివాసీల అటవీ హక్కులు (ఉమ్మడి మరియు వ్యక్తిగత హక్కులు) గుర్తించబడకుండా ప్రాజెక్టులను నిర్మించాలనుకోవడం అన్యాయం. ఈ ప్రాజెక్టుల వల్ల 8 మండలాల్లో 250 గ్రామాలలో 50,000 మంది ఆదివాసీలతోపాటు 20వేల ఎకరాల స్వంత భూమ్ములెన అటవీ, వ్యసాయ భూములు జలసమాధి కానున్నాయి. గుజ్జీలి, పెదకోట, చిట్టం వలస, సీలేరు, ఎర్రవరం వంటి ప్రాజెక్టుల్లో మొత్తం 7,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్ట్ ఆదివాసీల పూర్వీకుల భూములు, అడవులు, నదులు, సంస్కృతిని, జీవనాధారాలను పూర్తిగా ధ్వంసం చేస్తుంది. పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ (పిఎస్‌పి) వల్ల అడవుల నిర్మూలన, జల వనరుల దుర్వినియోగం, భూకంపాల ప్రమాదం, జీవవైవిధ్య నష్టానికి దారితీస్తాయి. ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లాలో అదాని సంస్థలకు సంబంధించిన రెండు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు (జి.ఓ.ఎమ్ఎస్. నెం.55) స్థానిక సమస్యలు మరియు ఆదివాసీల ఆందోళనల కారణంగా జ్యూలై 29, 2025న రద్దు చేయబడ్డాయి. కానీ మిగిలిన ప్రాజెక్టులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి, ఇది ఆదివాసీల అణచివేతతో సమానం. ఆదివాసీల పట్ల ప్రభుత్వం వివక్షపూరిత వైఖరి ప్రదర్శిస్తున్నది. కావున సావధానంగా పై అంశాలను పరిశీలించి ఈ క్రింది చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను." అని పేర్కొన్నారు. జి.ఓ.లు నెం. 51, 13, 2ల ద్వారా మంజూరు చేసిన హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలి. ఆదివాసీల గ్రామసభలతో సంప్రదింపులు నిర్వహించి, వారి అనుమతి లేకుండా ఏ పనులు చేయకూడదు.

## ప్రభుత్వ పనితీరుపై దుష్ప్రచారం - వ్యక్తి అరెస్ట్

**తిరుపతి,అక్టోబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వంపై ,ప్రజాప్రతినిధులపై అసత్య,దూషణ్మాతక సమాచారం సామాజిక మాధ్యమంలో పోస్టుచేసిన వ్యక్తిని తిరుపతి పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సత్యసాయిజిల్లా కదిరిటౌన్ జాకుపాల్యంవీధికి చెందిన కొలేపల్లి అంజాద్‌ఖాన్ (43) సామాజిక మాధ్యమంలో చిరంజీవి, కారణం ఎన్టీఆర్‌ఈరెన్‌చౌదరి అనే ప్రొఫైళ్ళను సృష్టించి ,వాటిద్వారా ఇతర రాజకీయ పార్టీల మధ్య వర్గ విభేధాలు రెచ్చగొట్టే విధంగా మనో భావాలు దెబ్బతీసేలా పోస్టులు చేస్తున్నాడు. తన అక్రమ చర్యల్లో భాగంగా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు,టిడిపి మంత్రి నారాలోకేశ్, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ కుటుంబసభ్యులు గురించి తప్పుడు ప్రచారం చేశాడు, దీనిపై తిరుపతి వెస్టు పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అసత్యప్రచారం, వైషమ్యాలు రెచ్చగొట్టేలా పోస్టులు చేయడం నేరమని పోలీసులు హెచ్చరించారు.

## జగన్‌రెడ్డి నర్సీపట్నం పర్యటన ప్రజలను తప్పదారి పట్టించడమే

### - రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ మంత్రి అనగాని సత్యప్రసాద్

**సచివాలయం,అక్టోబర్ 9,ప్రభాతవార్త :** రాష్ట్రం సుభిక్షంగా ఉంటే ఓర్వలేని సైకో జగన్ పర్యటనల పేరుతో అరాచకం సృష్టిస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ,రిజిస్ట్రేషన్,స్టాంప్స్ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.విశాఖకు పెద్దఎత్తున ప్రాజెక్టులు వస్తుంటే జగన్ సహించలేకపోతున్నారు.జగన్‌రెడ్డి ఐదేళ్ళ కాలంలో పోలవరం కానీ,డిఎస్సీ కానీ ఏది పూర్తి చేయలేదు.జగన్‌రెడ్డి మెడికల్ కాలేజీల నిర్మాణానికి రూ.8,500కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా రూ.1500కోట్లు మాత్రమే ఖర్చుచేశారు.మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తి చేయడానికి జగన్‌రెడ్డికి 17ఏళ్ల సమయం పైనే పట్టేది దీనివల్ల దాదాపు 2వేల పిజీ సీట్లును కోల్పోయేవాళ్ళం.జగన్‌ను ఉత్తరాంధ్రప్రజలంతా గోబ్యాక్ గోబ్యాక్ అంటున్నారు.జగన్ రెడ్డి తన పాలనలో దళితులపై దాడులు చేశారు.దళిత డాక్టర్ సుధాకర్‌ను చంపేశారు.గిరిజన యూనివర్సిటీ రాకుండా అడ్డుకున్నారు.వీటని న్నంటిని గుర్తుచేసుకుంటున్న స్థానికులు జగన్ను రావొద్దని అంటున్నారు.సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని మూడు హబ్‌లు గా అభివృద్ధి చేస్తున్నారు.జగన్‌రెడ్డి ప్రజల్ని రెచ్చగొట్టడం కోసం రోడ్డు షోలు చేస్తున్నారు.కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తుంది.అందుకే జగన్ పర్యటనకు అనుమతులిస్తున్నాం.5కిమీ దూరానికి కూడా హెలికాప్టర్ వెళ్ళే జగన్ విశాఖ పర్యటలో మాత్రం విధ్వంసం చేసేందుకే రోడ్డు పర్యటన చేస్తున్నారు.ప్రశాంత వాతావరణం ఉన్న ప్రాంతంలో చిచ్చు పెట్టాలనే ఆలోచనతోనే జగన్ పర్యటనలు చేస్తున్నారు. ఇప్పటి వరకు జగన్ ఎక్కడ కాలుపెట్టినా



## నకిలీ మద్యం సరఫరాను నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నాం

### - ఎక్సైజ్, భూగర్భ గనుల మంత్రి కొల్లు రవీంద్ర

**సచివాలయం,అక్టోబర్ 9,ప్రభాతవార్త :** రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీని నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఎక్సైజ్ మరియు భూగర్భ గనుల శాఖామంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.ఏపి సచివాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నకిలీ మద్యం నివారణకు ఎక్సైజ్‌శాఖలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సమర్థవంతంగా పనిచేస్తుందని స్పష్టంచేశారు. నవోదయం కింద ఇప్పటికే 21జిల్లాలను సారారహిత జిల్లాలుగా చేయడం జరిగిందన్నారు.అక్రమ మద్యం నియంత్రణపై ఇప్పటికే సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని ఎట్టిపరిస్థితుల్లో రాష్ట్రంలో అక్రమ మద్యం నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి రవీంద్ర పునరుద్ఘాటించారు.రాష్ట్రంలో 5ప్రాంతాల్లో ల్యాబ్‌లను ఏర్పాటుచేసి అవసరమైన తనిఖీలు చేసి నాణ్యమైన మద్యం సరఫరాకు తగిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు.నకిలీ మద్యంపై మాజీ సీఎం తన సొంత మీడియాలో విషప్రచారం చేయిస్తున్నారని తప్పుడు కథకాలనై విచారణ జరిపించి నిజానిజాలు నిగ్గు తేలుస్తామని స్పష్టం చేశారు.సమావేశంలో ఎక్సైజ్ శాఖ కమీషనర్ శ్రీధర్,ఎన్‌పోర్సుమెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ పాల్గొన్నారు.

## మిథున్‌రెడ్డి పాస్‌పోర్టు అందచేతకు అనుమతి

**విజయవాడ,అక్టోబరు9,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కేసులో నిందితునిగా ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డికి యుఎస్‌కు వెళ్ళేందుకు వీసాకు దరఖాస్తు చేసుకునేందుకు కోర్టు అనుమతి లభించింది. అమెరికా వెళ్ళేందుకు వీసాకు ధరఖాస్తు చేసుకోవాలని, సరెండర్ చేసిన పాస్‌పోర్టు ఇప్పించాలన్న ఎంపీ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటీషన్‌పై విజయవాడ ఏసిబీ కోర్టులో విచారణ జరిగింది. పాస్‌పోర్టును అప్పగించేందుకు న్యాయాధికారి అనుమతించారు. ఎంపీ తరపు న్యాయవాది దీన్ని కోర్టు నుంచి తీసుకున్నారు.ఇక లిక్కరుస్కామ్ కేసులో బెయిల్ షరతులను సడలించాలని నిందితుడు గోవిందప్ప బాలాజీ వేసిన పిటీషన్‌పై విచారణను న్యాయస్థానం ఈ నెల 13కు వాయివా వేసింది. దీనిపై కౌంటర్ వేయాలని సిట్‌ను ఆదేశించింది. రాజ్ కెసిరెడ్డి బెయిలు పిటీషన్‌పై విచారణ 13కు వాయిదా పడింది.చాణక్య బెయిల్ పిటీషన్‌పై కౌంటర్ వేయాలని సిట్‌ను న్యాయాధికారి ఆదేశించారు. వెంకటేష్ నాయుడు ఫోన్‌ను తెరిచేందుకు ఆయన బయోమెట్రిక్ తీసుకునేలా అనుమతి ఇవ్వాలని కోరుతూ సిట్ దాఖలు చేసిన పిటీషన్‌పై వాదనలు ముగిసాయి. తీర్పు 13కు వాయిదా పడింది.ఈ కేసులో ముంబయికి చెందిన అనిల్ చోక్రా (ఎ-49) పేరును సిట్ కొత్తగా నిందితుల జాబితాలో చేర్చింది. ఈ మేరకు విజయవాడ ఏసీబీ కోర్టుకు మెమో సమర్పించింది.

## రతన్ టాటాకు చంద్రబాబు నివాళి

**విజయవాడ,అక్టోబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** భారతమాత ముద్దుబిడ్డ, దివంగత భారత పారిశ్రామిక వేత్త రతన్ టాటా వర్ధంతి సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవల్ని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుర్తు చేసుకున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఈ ఉదయం తన సోషల్ మీడియా అకౌంట్ ఖీఎక్స్‌ఖీ ఖాతాలో చేసిన ఒక పోస్టులో రతన్ టాటాను స్మరించుకున్నారు. రతన్ టాటా మృతి చెంది ఏడాదవుతోంది. ఆయన పారిశ్రామిక దిగ్గజం. కరుణామయ మానవతా వాది, ఒక దార్శనికుడు, ఆయన వారసత్వం భవిష్యత్ తరాలకు శాశ్వతంగా స్ఫూర్తినిస్తుంది.. యువతకు మార్గనిర్దేశం చేస్తుంది అని చంద్రబాబు అన్నారు.


## డిసెంబర్‌లో మూడు రోజుల దర్శనాల కోటాకు బ్రేక్!

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** పవిత్రమైన ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి ఘడియలు రానున్న డిసెంబర్ 31వతేదీ రావడంతో ఆనెలలో ఆన్‌లైన్ దర్శనాల కోటా మూడు రోజులు విడుదలను టిటిడి నిలుపుదలచేసింది. డిసెంబర్ 31 వైకుంఠ ఏకాదశి కావడంతో ముందుగానే రెండురోజుల డిసెంబర్ 29,30 తేదీలకు సంబంధించిన ఆన్‌లైన్‌లో ఆర్జిత సేవలు, ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, వర్చువల్ దర్శన టిక్కెట్ల విడుదలను రద్దుచేసింది. తిరిగి ఆ తేదీల్లో దర్శన టిక్కెట్లు విడుదలను వెల్లడిస్తా మని టిటిడి తెలిపింది.

# తిరుమల సమాచారం

## భక్తులకు సౌకర్యాలు బాగున్నాయి

### - శ్రీవారి సేవలో పిఎసి కమిటీ



**తిరుమల,అక్టోబర్ 9ప్రభాత వార్తప్రతినిధి:** తిరుమలలో భక్తులకు చక్కటి సౌకర్యాలు కల్పించారని, దేవుని దర్శనం అద్భుతంగా చేయిస్తున్నారని శాసనసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ పి.రామాంజనేయులు తెలిపారు. కమిటీ సభ్యులు గురువారం తిరుమల ఆలయంలోనికి చేరుకున్నారు. డిప్యూటీ ఇఒ భాస్కర్, ఓఎస్‌డి సత్రానాయక్ వీరికి స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు,. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి అన్నప్రసాదం రీల్స్‌పై దుష్ప్రచారం

### - ఫేస్‌బుక్‌లో తప్పుడు కథనంపై కేసు నమోదు

**తిరుమల,అక్టోబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి భక్తులకు ఆకలి అనేది తెలియకుండా భక్తితో అన్నప్రసాదాలు స్వీకరించడంపై ఓ భక్తురాలు రీల్స్‌ను వక్రీకరిస్తూ ఓ వ్యక్తి తప్పుడుగా ఫేస్‌బుక్‌లో ప్రచారం చేయడంతో అతనిపై కేసు నమోదైంది. దేవుని అన్నప్రసాదంపై ఓ భక్తురాలు రీల్స్ చేసింది. దాన్ని వక్రీకరిస్తూ టిటిడి ఛైర్మన్‌కు, యాజమాన్యంకు అపకీర్తి కలిగించేలా హైదరాబాద్ వాసి మహమ్మద్‌రఫీ అనే వ్యక్తి తప్పుడుగా ప్రచారం చేస్తూ ఫేస్‌బుక్‌లో పెట్టాడు. దీనిపై విజిలెన్స్ వింగ్ ఏవిఎస్ఒ ఫిర్యాదుతో తిరుమల 1టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వైరల్ చేస్తున్న వీడియోలో మాజీ ఛైర్మన్ భూమన పేరు ప్రస్తావించాడు.

దీంతో వైసిపి కుట్రలు మరోసారి బట్టబయలైంది. తిరుమల క్షేత్రం టార్గెట్‌గా, భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వైసిపి పేటిఎం బ్యాచ్ ఇలా అసత్య ఆరోపణలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఇటీవల బోర్డు తీర్మానం చేసిన విషయం విదితమే. నిరంతర నిఘాతో ఎప్పటికప్పుడు చర్యలకు విజిలెన్స్ వింగ్ ఉపక్రమిస్తోంది.


## తిరుమలకొండపై భారీ వర్షం



**తిరుమల,అక్టోబర్ 9ప్రభాత వార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం ప్రభావంతో గురువారం ఉదయం ఉన్నఫళంగా అర్ధగంట భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన వర్షంతో తిరుమల ఆలయం ముందు, మాఢవీధులు వర్షపునీటితో నిండిపోయాయి. ఆలయం మాఢవీధులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షంతో తిరుమల పూర్తిగా వాతావరణం మారిపోయింది. ఉదయం 11గంటల నుండి 11.40గంటల మధ్యజోరువాన కురిసింది. ఆలయంలోనికి వెళ్ళే భక్తులు వర్షానికి తడుస్తూ స్వామివారి దర్శనానికి చేరుకోవాల్సి వచ్చింది. ఆలయం నుండి వెలుపలకు వచ్చిన భక్తులు తడిసి ముద్దయ్యారు. గదులకు చేరుకోవడానికి ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షానికి తిరుమల ఆలయం ముందు వాననీరు మినీచెరువును తలపించింది. వాతావరణం పూర్తిగా మారిపోయి చల్లటిగాలులు వీస్తున్నాయి.

## ఈ యేడాది దాదాపు రూ. 2,500 కోట్లతో రహదారుల అభివృద్ధి

### - ధ్వంసమైన బ్రిడ్జిలకు మరమ్మతు పనులు చేపడతాం: మంత్రి జనార్ధన్‌రెడ్డి



ఆర్ బిశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

**విజయవాడ,అక్టోబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలకు మెరుగైన రహదారుల కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి స్పష్టం చేశారు.. కాబట్టి క్షేత్రస్థాయిలో అధికారులు సైతం అందుకనుగుణంగా ఒక నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు సాగాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నేడు విజయవాడలోని ఈఎన్సీ కార్యాలయంలో ఆర్ బి శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది.. రాష్ట్రంలో ఆర్ బీ శాఖలో జరుగుతున్న అభివృద్ధి పనుల తీరుతెన్నులపై ఆర్ బీ శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ ఎం. టీ కృష్ణబాబుతో కలిసి ఈ సమావేశంలో మంత్రి సమీక్షించారు.. రాష్ట్రంలో ఈ ఏడాది దాదాపు రూ. 2,500 కోట్లతో రహదారులను అభివృద్ధి చేస్తున్నామని, గత 10 ఏళ్లలో ఎప్పుడూ ఈ స్థాయిలో రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించిన పరిస్థితి లేదని మంత్రి వివరించారు.. రాష్ట్రంలో గత 5 ఏళ్ల పాలనలో మెజార్టీ రహదారులకు పట్టించుకోక అధ్వాన్నంగా మారిన క్రమంలో.. క్షేత్రస్థాయిలో రహదారుల పరిస్థితిపై ఒక అంచనాకు వచ్చేందుకు చీఫ్ ఇంజనీర్ స్థాయి అధికారులు ఆధ్వర్యంలో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఆయా రహదారులకు సంబంధించి, పూర్తిగా పాడైన/ధ్వంసమైన రహదారులను ప్రాధాన్యత క్రమంలో 3 గ్రూపులుగా ఎంపిక చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు..

## అత్యాచార బాధితులకు సకాలంలో పరిహారం అందేలా చూడాలి

### - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

**విజయవాడ అక్టోబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్సి,ఎస్టి అత్యాచార బాధితులకు సకాలంలో పరిహారం అందేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలక్టర్లను ఆదేశించారు.అదే విధంగా ఎస్సి,ఎస్టి అత్యాచార నిరోధక చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి నెలా 30వ తేదీన సివిల్ రైట్స్ డేను నిర్వహించాలని,మూడు నెలలకు ఒకసారి తప్పని సరిగా జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలను నిర్వహించి ఇందుకు సంబంధించి నమోదైన కేసులు, బాధితులకు అందిస్తున్న పరిహారం తదితర అంశాలను సమీక్షించాలని ఆదేశించారు.సీజనల్ వ్యాధులు,మందుల పంపిణీ, ఆసుపత్రిల్లో పరిశుభ్రత,ఆసుపత్రిల్లో రోగ నిర్ధారణ సేవలు,ప్రధాన మంత్రి ఆదర్శ్ గ్రామ యోజన, ఎస్సిఎస్టి అత్యాచార బాధితులకు పరిహారం చెల్లింపు,పెన్షన్ల రీ అసెస్మెంట్, పాజిటివ్ పబ్లిక్ పెర్సెప్షన్ తదితర అంశాలపై గురువారం ఎపి సచివాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు.ఎస్సిఎస్టి అత్యాచార బాధితులకు పరిహారం చెల్లించేందుకు 31.54 కోట్ల రూ.లు.విడుదల చేయగా 27.47కోట్ల రూ.లు చెల్లించారని మిగతా నిధులను కూడా సకాలంలో చెల్లించాలని కలక్టర్లను ఆదేశించారు. గ్రామ వార్డు సచివాలయాల త్రీటైర్ స్ట్రక్చర్ లో భాగంగా జిల్లా స్థాయిలో కలెక్టరేట్, డివిజన్ స్థాయిలో ఎంపిడిఓ,మున్సిపల్ కమిషనర్ కార్యాలయల్లో ప్రత్యేకంగా గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది కూర్చునేందుకు వీలుగా తగిన స్థలం ఏర్పాటు చేయాలని సిఎస్ కలక్టర్లను అదేశించారు.పియం ఆదర్శ్ గ్రామ యోజనకు సంబంధించి మొత్తం 1174 గ్రామాలు ఎంపిక కాగా ఇప్పటికే 1017 గ్రామాలకు గ్రామాభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయగా మిగతా 157 గ్రామాలకు కూడా త్వరగా సిద్ధం చేయాలని కలక్టర్లను ఆదేశించారు.గ్రామాభివృద్ధి ప్రణాళికలు సిద్ధమైన వాటిలో ఇప్పటికే 752 ఆమోదం పొందగా వాటిలో 572 గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా ప్రకటించగా ఇంకా 602 ఆదర్శ్ గ్రామాలుగా ప్రకటించాల్సి ఉందన్నారు.గ్యాప్ ఫిల్లింగ్ ఫండ్ గా ఆయా ఆదర్శ్ గ్రామాలకు ఇప్పటి వరకు 60.50 కోట్ల రూ.లు విడుదల అయ్యాయని సకాలంలో యుసిలు పంపితే మరిన్ని నిధులు కేంద్రం నుండి మంజూరు చేయించు కోవచ్చని సిఎస్ విజయానంద్ కలక్టర్లకు స్పష్టం చేశారు.రాష్ట్రంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి 3500 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందని అందుకు సంబంధించిన మిషినరీ, టార్పాలిన్లు,గోనె సంచులు,తగిన సిబ్బందికి సంబంధించిన సన్నాహక ఏర్పాట్లన్నీ ఇప్పటి నుండి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సిఎస్ విజయానంద్ కలక్టర్లను ఆదేశించారు.గత సీజన్లో 35.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా ఈసారి కేంద్ర ప్రభుత్వం మరో 15 లక్షల



ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ యోజన గ్రామాల ప్రణాళికలపై సమీక్షలో సిఎస్ విజయానంద్

మెట్రిక్ టన్నులను అదనంగా కేటాయించిందని అంటే సుమారు 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాల్సి ఉన్నందును ఇప్పటి నుండే తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలక్టర్లకు సూచించారు ఎన్టిఆర్,గుంటూరు, పల్నాడు,ప్రకాశం తదితర జిల్లాల్లో నవంబరు మొదటి వారం నుండి ప్రత్తిపంట కొనుగోలు చేయాల్సి ఉంటుందని అందుకు కూడా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆయా జిల్లాల కలక్టర్లను సిఎస్ ఆదేశించారు.అదే విధంగా ఆక్వా సాగు చెరువుల రిజస్ట్రేషన్ కు సంబంధించి తుర్పు,పశ్చిమ గోదావరి,కోనసీమ,నెల్లూరు తదితర జిల్లాల్లో రిజిస్ట్రేషన్లు పెండింగ్ అధికంగా ఉందని వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

అంతకు ముందు వివిద ప్రభుత్వాసుపత్రుల్లో పరిశుభ్రత,మందులు లభ్యత తదితర అంశాలపై సిఎస్ విజయానంద్ కలక్టర్లతో సమీక్షిస్తూ ఎక్కడా అంటు వ్యాధులు ప్రభలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## టిటిడిలో సింఘాల్ మార్కుపాలన షురూ!

### తొలివిడతగా డిప్యూటీ ఇఒలు బదలీలు

### వారంరోజుల్లో కీలకస్థానాల అధికారులకు స్థానచలనం

**తిరుమల,అక్టోబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానంలో సుదీర్ఘకాలం తిష్టవేసిన...ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు అధికారులు, ఉద్యోగులకు స్థానచలనం కల్పించడానికి టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ శ్రీకారం చుట్టారు. టిటిడిలో సేవాభావంతో విధులు నిర్వహిస్తున్న కొందరు అధికారులు,ఉద్యోగులు ఎజెండాగా రూపొందించే అభివృద్ధిపనుల నిర్ణయాలను,కొన్ని తీర్మానాలను ముందుగానే వేగులుగా గత పాలకమండలి పెద్దలకు చేరవేసి రాజకీయం చేస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. ఇదే విషయంగా ఏడాదికాలంగా టిటిడిపై దుష్ప్రచారాలు సాగడం, పనిగట్టుకుని కొందరు ప్రతిదీ భూతద్దంలో చూపేలా కారణమవుతున్నారనేది బోర్డుక అందిన సమాచారం. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాలకు ముందు ఇఒగా రెండవసారి బాధ్యతలు చేపట్టిన సింఘాల్ పాలనను గాడిన పెట్టడానికి భారీ వ్యూహాన్ని రూపొందించారు. బ్రహ్మోత్సవాలు ముగియగానే వారంరోజుల్లో ఒక్కసారిగా డిప్యూటీ ఇఒ స్థాయి అధికారులను పూర్తిగా బదిలీ చేసి టిటిడిలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారనేది ప్రస్ఫుటమవుతోంది. గత వైసిపి పాలనలో ,టిటిడి బోర్డులో బదిలీలకు గురైన డిప్యూటీ ఇఒలను పూర్తిగా స్థానచలనం చేశారు. తిరుమల ఆలయ డిప్యూటీ ఇఒగా ఉన్న ఎం.లోకనాథంను తిరుపతి గోవిందరాజస్వామి ఆలయ డిప్యూటీ ఇఒగా, తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయ డిప్యూటీ ఇఒ పి,హరీంద్రనాథ్‌ను ఏకంగా మళ్ళీ రెండవసారి తిరుమల ఆలయ డిప్యూటీ ఇఒగా నియమించారు. తిరుమలలో వసతి కల్పన విభాగం డిప్యూటీ ఇఒ (ఆర్1)భాస్కర్‌ను టిటిడి పరిపాలన భవనంలోని సర్వీసెస్ విభాగానికి, ఇక్కడ ఉన్న గోవిందరాజన్‌ను తిరుమల కల్యాణకట్టకు, అన్నదానం డిప్యూటీ ఇఒగా సెల్వంను, వసతికల్పనవభాగం డిప్యూటీ ఇఒ(ఆర్1)గా అన్నదానం డిప్యూటీ ఇఒ రాజేంద్రను నియమించారు. ఆర్2గా ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తారు. తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయ డిప్యూటీ ఇఒగా గోవిందరాజస్వామి ఆలయం నుండి శాంతిని, కల్యాణకట్టనుండి వెంకటయ్యను తిరుపతి అన్నదానం డిప్యూటీ ఇఒగా బదిలీ చేశారు. ఇక రెండుమూడురోజుల్లో పూర్తిస్థాయిలో ఆలయం నుండి వసతికల్పన విభాగం, దాతల విభాగం, మార్కెటింగ్ విభాగంతోబాటు స్థానిక ఆలయాల్లో ఉన్న ,కీలకమైన కొన్ని విభాగాల సూపరింటెండెంట్‌లు,సీనియర్ అసిస్టెంట్‌లను బదిలీ చేసేందుకు రంగం సిద్దంచేశారు.


కార్మిక రాజ్య భీమా సంస్థ
(కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)
कर्मचारी राज्य बीमा निगम
(श्रम एवं रोजगार मंत्रालय, भारत सरकार)
Employees' State Insurance Corporation
(Ministry of Labour & Employment, Govt. of India)
క.రా.బీ.ని. E.S.I.C.

ప్రాంతీయ కార్యాలయం/क्षेत्रीय कार्यालय /Regional Office
ఈ ఎస్ ఐ రోడ్డు, గుణదల, విజయవాడ – 520 004
ईएसआइ रोड, गुणदला, विजयवाड़ा–520 004
ESI Road, Gunadala, Vijayawada-520 004
Telephone: 0866-2453498
e-mail : rd-andhrapradesh@esic.nic.in

ఇ.ఎస్.ఐ.సి. SPREE పథకం-2025
ప్రత్యేక రిజిస్ట్రేషన్ విండో
1 జూలై 2025 – 31 డిసెంబర్ 2025

యజమానులకు గమనిక

ESI చట్టం, 1948 కింద యజమానులు మరియు ఉద్యోగుల రిజిస్ట్రేషన్ ప్రమోషన్ కోసం ESI కార్పొరేషన్ SPREE పథకం-2025ను ప్రారంభించింది. ESI చట్టం కింద కవరేజ్ అర్హత కలిగి ఇప్పటివరకు నమోదు చేసుకోని యజమానులు మరియు కవరేజ్ అర్హత కలిగిన ఉద్యోగులను నమోదు చేయని నమోదిత యజమానులు 31.12.2025 కు ముందు తమను తాము నమోదు చేసుకుని తమ ఉద్యోగులను నమోదు చేసుకోవాలని మరియు పథకం కింద అందించబడిన క్రింది ప్రయోజనాలను పొందాలని అభ్యర్థన.

కీలక ప్రయోజనాలు
- యజమాని ప్రకటించిన తేదీ నుండి రిజిస్ట్రేషన్ చెల్లుబాటు అవుతుంది.
- రిజిస్ట్రేషన్ కు ముందు కాలానికి ఎటువంటి చందా లేదా ప్రయోజనం వర్తించదు.
- రిజిస్ట్రేషన్ కు ముందు కాలానికి ఎటువంటి తనిఖీ లేదా డిమాండ్ చేయబడదు.
- పాత కాలానికి సంబంధించి ఏ రకమైన జరిమానాలు లేవు.
- చట్టపరమైన అడ్డంకులు లేవు.

ఎలా నమోదు చేసుకోవాలి
సందర్శించండి:- ESIC పోర్టల్ : www.esic.gov.in లేదా MCA పోర్టల్: www.mca.gov.in
లేదా శ్రమ సువిధ పోర్టల్: www.shramsuvidha.gov.in

యజమానులకు మనశ్శాంతి, ఉద్యోగులకు రక్షణ

వార్త

మన జీవితానికి ఒక ఉద్దేశ్యం, ఒక లక్ష్యం ఉంటేనే అది జీవితం అనిపించుకోదు.

-రాచెల్

# చిత్తశుద్ధి లేని చట్టాలెందుకు?

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చట్టాల మీద చట్టాలు చేస్తున్నా, కఠిన శిక్షలు తప్పవని ప్రకటనలతో హెచ్చరిస్తున్నా అవేమీ ఆశించిన ఫలితాలు సాధించలేకపోతున్నాయి. ఆటపాటలతో, చదువుసంధ్యలతో ఆనందంగా గడపాల్సిన లక్షలాది మంది బాలల జీవితాలు కళ్లముందే బుగ్గిపాలవుతున్నాయి. పాలకుల మాటలు నీటిమూటలవుతున్నాయి. పాత చట్టాలకు మరింత పదును పెట్టి పకడ్బందీగా సరికొత్త చట్టాలు తీసుకొచ్చామని నేతలు చెప్పుకుంటున్నా శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు ఏదోఒకమార్గంలో ఈ వ్యవస్థ కొనసాగుతూనే ఉన్నది. అన్నింటి కంటే ముఖ్యంగా ఏళ్లతరబడి మగ్గుతున్న బాలకార్మికులను ఆ కూపం నుంచి బయటకు తీసుకువచ్చినా వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవ విషయాలను పరిగణనలోకి తీసుకొని నిర్దిష్ట చర్యలవైపు అడుగులు వేయలేకపోతున్నారు. ఇది అధికారులందరికి తెలిసిన సత్యమైనా ప్రభుత్వాన్ని నమ్మించేందుకు కాగితాల మీద ఏదో రాసుకొని కాలం గడుపుతున్నారు. అందుకే చట్టాలు, శిక్షలు కాగితాలకే పరిమితం కావడంతో బాలకార్మిక వ్యవస్థ నిరాటంకంగా కొనసాగుతున్నది. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదలు నేటి ప్రధాని నరేంద్ర మోడీ వరకు అటు రాష్ట్రపతులందరూ బాలలపట్ల అత్యంత ప్రేమాదరణలు చూపినవారే. ఈ బాలలే భావిభారత పౌరులని, వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆశించినవారే. ఆ దిశలో ఎన్నో కార్యక్రమాలు, మరెన్నో పథకాలు ప్రవేశపెట్టి ప్రోత్సహించినవారే. అంతెందుకు రాజ్యాంగంలోని ఇరవైనాలుగోవ అధికరణ బాలకార్మిక వ్యవస్థను సమూలంగా వ్యతిరేకిస్తున్నది. పద్నాలుగు సంవత్సరాల లోపు వయసు గల పిల్లలను, వ్యక్తులుకానీ, సంస్థలు కానీ పనిలో పెట్టుకోకూడదని నిర్దేశిస్తున్నది. రాజ్యాంగంలోని 39(ఇ) అధికరణ కూడా అదే విషయాన్ని స్పష్టంగా పేర్కొంటున్నది. లేత వయసులో ఉన్న పిల్లలను వారి వయసుకు మించిన పనిలో పెట్టకూడదని రాజ్యాంగ నిబంధనలు ఘోషిస్తున్నాయి. తల్లిదండ్రులు కూడా తమ ఆర్థిక అవసరాల నిమిత్తం పిల్లలకు వయసుకు మించిన భారం అప్పగించకూడదని రాజ్యాంగం స్పష్టం చేస్తున్నది. రాజ్యాంగ నిర్దేశాలు, చట్టాలున్నా అంతగా ఫలితం లేకపోవడంతో బాలకార్మిక వ్యవస్థలో మార్పులు రాకపోగా మరింత పెరుగుతుండడంతో 1986లో పదమూడు వృత్తులకు సంబంధించి యాభైఏడు రకాల పనులను పిల్లలతో చేయించకూడదని మరొక చట్టాన్ని తీసుకువచ్చారు. ఈ చట్టాలకు విరుద్ధంగా బాలకార్మికులను పనిలో నియమించుకునేవారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. అయినా ఆశించిన ఫలితాలు చేకూరలేదు.

1994లో ఈ విషయంలో ఆందోళన చెందిన కేంద్ర ప్రభుత్వం ముఖ్యంగా అప్పటి ప్రధాని పటిష్టమైన చర్యలకు ఆదేశించారు. రెండువేల నాటికి బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలిస్తామని ప్రకటించారు. అది కూడా కాగితాలకే పరిమితమైంది. రోజురోజుకు పెరిగిపోతున్న బాలకార్మిక సంఖ్యను, పరిస్థితులను చూసి ఆందోళన చెందిన దేశ అత్యున్నత న్యాయస్థానం కేంద్రప్రభుత్వాన్ని హెచ్చరించింది. దీంతో ఉన్న చట్టాలతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడం సాధ్యం కాదని, భావించిన కేంద్ర ప్రభుత్వం ఆ యేడాది అక్టోబరు పదిన కొత్త చట్టానికి శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా ఇళ్లలో పనిచేస్తున్న లక్షలాది మంది బాలకార్మికుల భవిష్యత్‌కు భరోసా కల్పించి, వారికి అక్షరాలునేర్పించి చైతన్యవంతులను చేయాలనే దిశలో నడుం బిగించింది. పెద్దఎత్తునే హడావుడి చేశారు. ముఖ్యంగా బాలకార్మికులను నిబంధనలకు విరుద్ధంగా నియమించుకునేవారిపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుశిక్ష విధించేలా చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. ఇళ్లలో హోటళ్లు, రెస్టారెంట్లలో పనిచేస్తున్న బాలకార్మికులను బయటకు తీసుకువచ్చి వారికి విముక్తి కల్పిస్తున్నట్లు ప్రకటనలు చేశారు. అంతవరకు బాగానే ఉంది. కానీ వారికి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారు. దీంతో ఆ పిల్లలు తిరిగి పాతబాటే మేలని భావించిఆవైపే మొగ్గుచూపారు. తల్లిదండ్రుల్లో కూడా ప్రభుత్వం కల్పించే పునరావాస కార్యక్రమాల మీద నమ్మకం కలగలేదు. ఇటు చదువు రాక, అటు పనిరాక, రెంటికి చెడ్డరేవడిలాతయారై మరో మార్గంలో ప్రయాణిస్తారనే భయాందోళనలకు గురయ్యారు. దీంతో వారు కూడా పాతమార్గంవైపే మొగ్గు చూపారు. దీనికితోడు కరోనా రక్కసి సృష్టించిన బీభత్సంతో లక్షలాది మంది బాలకార్మికులు పాతబాటవైపే నడవడం ప్రారంభించారు. లేతవయసులో చదువు సంధ్యలతో ఆడుతూ పాడుతూ కళ్లముందు ఉండాల్సిన పిల్లలు ఎక్కడో కన్పించని ప్రాంతాలకు పనికోసం పంపుతున్న ఆ తల్లిదండ్రులు ఎంతటి మానసిక క్షోభకు గురవుతుంటారో ఒక్కసారి మనస్సుపెట్టి ఆలోచించాలి. ఏ తల్లిదండ్రులు తమ పిల్లలను మనస్ఫూర్తిగా అలాంటి పనులకు ఆ వయసులో పంపరనేది వాస్తవం. అయినా పేగు తెంచుకొని పుట్టిన కన్నబిడ్డను కేవలం డబ్బుకోసమే పరాయిపంచకు పంపడానికి కారణం వారి ఆర్థిక పరిస్థితేనన్నది నగ్నసత్యం. ఆ పిల్లలు చేయలేని, చేయరాని పనులెన్నో చేస్తూ మరెన్నో బాధలు అనుభవిస్తున్నారన్న విషయం ఆ తల్లిదండ్రులకు తెలియంది కాదు. అటు తల్లిదండ్రులకు, ఇటు తమకు ఇష్టంలేని ఆవ్యవస్థలోకి పిల్లలు బలవంతంగా ప్రవేశిస్తున్నారు. అందుకు కేవలం ఆ కుటుంబాన్ని పట్టిపీడిస్తున్న దరిద్రమే ఏకైక కారణం. ఆ కోణంలో ఆలోచిస్తే కొంతవరకైనా సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

మనల్ని గాయపరిచినవారితో మనల్ని పోల్చుకోకపోవడమే సరైన ప్రతీకారం.



జేన్ పోర్టర్

మహనీయుడు మరణాసన్నదశలో మామూలు మాటలు మాట్లాడినా అవి దైవ వాక్యాలుగానే పరిణమిస్తాయి.



స్వీడన్ బర్గ్

## ప్రజావాక్కు



### గ్రామీణ ప్రాంత రోడ్లను బాగు చేయాలి

ఇటీవలి కురిసిన భారీ వర్షాలకు గ్రామీణ ప్రాంత రోడ్లు ప్రమాదకరంగా మారాయి. చాలా గ్రామాలలో పొలాల నుండి భారీగా కురిసిన వర్షపు నీరు రోడ్ల పై నుండి ప్రవహించి రోడ్లు కోతకు గురైయ్యాయి. ఈ పరిస్థితుల్లో గ్రామీణ రోడ్లు గుంతలమయంగా మారి, కంకరతేలి ప్రమాదాలు జరిగే విధంగా తయారయ్యాయి. అదే విధంగా రోడ్ల వెంట కంపచెట్లు పెరిగి వాహనదారులు గాయపడే విధంగా ఉంటున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు గ్రామీణ ప్రాంతాలలో ప్రమాదకరంగా దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలి. కనీసం గుంతలలో మట్టినైనా నింపివాహన దారులు ప్రమాదాలకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలి.

- తోట యోగేందర్, మిర్యాలగూడ, నల్గొండ జిల్లా

### ఉద్యోగాల కోత

ఇప్పటి వరకు ఇంజనీరింగ్ విద్య చదివిన వారందరూ అధిక జీతాలకు ఆశపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎగబడి దేశ విదేశాలలో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. ఇంకా ఎంతో మంది ఎదురు చూస్తున్నారు. ఏటా లక్షల మంది దేశవ్యాప్తంగా ఇంజనీర్లు పుట్టుకువస్తున్నారు. వీరందరికి ఉద్యోగాలు దొరకక బ్యాంకులలోనూ, ఇతర ప్రభుత్వ ప్రయివేటు సంస్థలలోను చిన్నదో పెద్దదో ఎంతో కొంత జీతానికి పని చేస్తున్నారు. పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఈమధ్యతమ సీనియర్ ఉద్యోగులను వేలసంఖ్యలో తొలగిస్తున్నారు. తక్కువజీతంలో కొత్తవారిని తీసుకుంటున్నారు. చాలా మంది ఇళ్ళు, బళ్ళు కొని బ్యాంకులకు ఇన్‌స్టాల్‌మెంట్లు కడుతున్నారు. వీరి ఆర్థిక భవిష్యత్తు అంధకారమవుతున్నది.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ఎన్నికలలో విద్యార్హతలు నిర్ణయించాలి

త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో నేరస్తులుగా జైలుశిక్షఅనుభవించిన వారిని, హత్యలు, కొన్నిపోలీస్ కేసులు ఉన్న వారిని నేరస్తులుగా శిక్ష పడిన వారిని, ఎన్నికలలో పోటీ చేసే అర్హతను కట్టడి చేయాలి. ఎన్నికలలో పోటీ చేయకుండా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ అనర్హులుగా ప్రకటించాలి. స్థానిక ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు విద్యా అర్హతలు నిర్ణయించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### దగ్గు మందు నిషేధం

ఇటీవలి కాలంలో ప్రభుత్వాలు కొన్ని దగ్గు మందులపై నిషేధం విధించడం ప్రజారోగ్య పరిరక్షణలో ఒకముఖ్యమైన నిర్ణయంగా చెప్పుకోవచ్చు. మార్కెట్‌లో లభించే కొన్ని సిరపులు, మందుల్లో ప్రమాదకరమైన రసాయనాలు ఉండటం, వాటి వాడకం చిన్నారులలో, యువతలో వ్యసనానికి దారి తీస్తుండటం గమనార్హం. ముఖ్యంగా కోడైన్ వంటి పదార్థాలు కలిగిన దగ్గు సిరపులు మత్తు పదార్థాలుగా మారి ఆరోగ్యానికి హానికరమవుతున్నాయి. ఈ పరిస్థితిని అరికట్టడానికి కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ కొన్ని బ్రాండ్లను నిషేధించడం సముచితం. దీని ద్వారా ప్రజల్లో అవగాహన పెరిగి, వైద్యుల సలహా లేకుండా మందులు వాడే అలవాటు తగ్గుతుంది. తల్లిదండ్రులు పిల్లలకు మందులు ఇచ్చేటప్పుడు వైద్యుని సూచన తప్పనిసరిగా తీసుకోవాలి. దగ్గు మందు నిషేధం అనేదికేవలం నియంత్రణచర్య మాత్రమే కాదు ఇది ఆరోగ్య భద్రతకు, సమాజం మేలుకు దారితీసే నిర్ణయం.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### స.హ. చట్టం పకడ్బందీగా అమలు చేయాలి

సమాచార హక్కుచట్టం వారోత్సవాల్లో సమాచారహక్కు చట్టం ఎలా అమలులోకి వచ్చింది, చట్టంతో ప్రజలకు ఉపయోగపడే వివరాలను తెలుపాలి సమాచార హక్కు చట్టం కింద ఎవరైనా ప్రభుత్వ కార్యాలయాల సమాచారం, ఉద్యోగులవిధులు, బాధ్యతలు తదితర సమాచారాన్ని తెలుసుకోవచ్చు. దేశభద్రత, రహస్య ఇతర ఇబ్బందులు ఎదురయ్యే సమాచారం మినహా అన్ని ఇవ్వాలి. ప్రతిప్రభుత్వ కార్యాలయంలో పౌరసమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి వివరాలు ఉండాలి. ఎవరైనా సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30రోజుల్లో వారికి సమాధానం ఇవ్వాలి.

-కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్, భూపాల్ పల్లి జిల్లా

### దాడి గర్హనీయమైంది

సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తిపయిన జరిగిన దాడి గర్హనీయమయింది. కోర్ట్ సెంట్రల్ హాల్‌లో అందరూ చూస్తుండగా జరగడం ఒక కారణం రెండు అతని పదవికి అతని అభిప్రాయ స్వేచ్ఛకు భంగం కలిగే విధంగా సదరు న్యాయమూర్తి వ్యవహారం ఉంది. కజూరాహో విగ్రహం విషయంలో దాఖలు అయిన పిల్ విషయంలో సదరు ప్రధాన న్యాయమూర్తి వ్యక్తికరించిన అభిప్రాయంకు మీడియా అత్యంత ప్రాధాన్యత ప్రచారం కల్పించింది. మీడియా కొంత సంయమనం వహిస్తే బాగుండు.

-భారత అవినాష్, జనగామ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# చరిత్రతో ప్రయోగాలు చేయొద్దు!

**ఆర్.యస్.యస్ భారతీయ నాగరికత ప్రతిబింబిస్తున్న తత్వశాస్త్రానికి కస్టోడియన్ అని బిజెపి నాయకులన్నా, జాతిపిత గాంధీ ఆధునిక వైతాళికుడు జవహర్‌లాల్ నెహ్రూ వల్లనే దేశానికి స్వాతంత్య్రం తెచ్చామని కాంగ్రెసు చెప్పుకున్నా, చిదంబరం, శశిథరూర్ లాంటి నాయకులురాజకీయ లబ్ధిపొందాలనే తాపత్రం తమమాటల్లో అర్థనిజాలు వక్కాణించినా, ఆర్‌యస్‌యస్, వాజ్‌పాయ్ ప్రతిభాపాటవాలను బిజెపి నాయకులు ఇప్పుడు తెరమీదకుతెచ్చినా భారత ప్రజలకు ఇప్పుడు ఒరిగేదేమీ లేదు. కలిసికట్టుగా ఆనాడు పోరాడబట్టే స్వాతంత్య్రం ఈ దేశానికి వచ్చింది. ఇప్పుడున్న రాజకీయ నాయకులలో కొందరు అప్పుడు పుట్టలేదు కూడా! అందుకే ఆ ఫలాలను అందుకుంటూ, చెట్టుకాయలను అమ్ముకునే ప్రయత్నం ఈనాటి నాయకులు చేయడం న్యాయం కాదు. ఇప్పుడిప్పుడే మనదేశం అన్నివిధాలా ముందంజ వేస్తున్నది. దయచేసి వెనకకులాగే ప్రయత్నాలు చేయడం భావ్యం కాదు.**



రావులపాటి సీతారాం రావు

కాలగమనాన్ని ఎవరూ ఆపలేరు! చరిత్రను ఎవరూ తిరిగిరాయలేరు. కొందరి ప్రయత్నం చరిత్రను మార్చాలనే సంకల్పం, అందుకు తగ్గ ఏర్పాట్లు ఈ మధ్యకాలంలో విజ్ఞులు గమనిస్తూనే ఉన్నారు. ఎందుకు ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయంటే జవాబు ఒక్కటే కళ్లముందు కదలాడుతున్నది. ప్రస్తుత పరిస్థితులను తమకు అనుకూలంగా మల్చుకోవాలనే ఆరాటం వల్ల కొందరు చరిత్రను తిరగతోడుతున్నారు. అర్ధ సత్యాలను అనుకూలంగా విశ్లేషిస్తున్నారు. ఒక చిన్న ఆధారంతో మూలాలనే సమూలంగా పెళ్లగించాలనే ప్రయత్నంలో పడ్డారు. ఒక్కమాటలో చెప్పాలంటే చరిత్రతో రాజకీయాలు చేస్తున్నారు. రెండు, మూడు వార్తా కథనాలు ఈ మధ్య కావాలనో, మరెందుకనో బహుళ ప్రచారంలో ఉన్నాయి. వీటి ప్రస్తావన కేవలం ఈ కథనాల ఆధారంతో పార్టీలు పబ్బం గడుపుకుందామనే ఆలోచనను బహిర్గతం చేసేందుకే! అయితే ఒక కథనం ఈ నాటి యువతకు మార్గదర్శకంగా నిలిచే కథనం. ఒక విధంగా చరిత్ర సంగతి వదిలేస్తే, ఆ కథనం జాతిని మరొక్కసారి మేల్కొలిపి, సరైన మార్గంలో పెట్టేదే! ఈ కథనంలో రాజకీయ ప్రమేయం పసిగట్టడానికి ఆధారాలు లేవు. కానీ ఈ మంచి వార్తను కూడా రాజకీయ నాయకులు తమపార్టీలకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తారని హెచ్చరించేందుకే! నవజీవన్ ప్రెస్ ప్రచురించిన 'ది స్టోరీ ఆఫ్ మై ఎక్స్‌పరిమెంట్స్ విత్ ట్రూత్' ఇప్పటివరకు అరవై ఒక్క లక్షల కాపీలు 17 భాషలలో అమ్ముడుపోయింది. అంతకంటే బహుశా ఎక్కువకాపీలే ప్రజలు తెచ్చుకొని చదివి ఉండవచ్చు. ఈ వంద సంవత్సరాలలో ఆ పుస్తకం 'బెస్ట్ సెల్లర్'గా పేరు తెచ్చుకుంది. జాతిపిత మహాత్మాగాంధీ రాసిన రచన అప్పట్లో పీరియాడికల్‌గా నవజీవన్ ట్రస్ట్ నుంచి నవంబరు 1925లో మొదలైన విషయం చాలా మందికి తెలియకపోవచ్చు కానీ, 'గాంధీ' గొప్పతనం దాదాపు జాతి, జాతిపితను మరిచిపోయిన తరుణంలో రిచర్డ్ అటెన్‌బరో సినిమా 'గాంధీ'ని మరొక్కసారి మహత్తరంగా జ్ఞప్తికి తెచ్చింది. 'లగేరహో మున్నాభాయి' హిందీ సినిమాతో మహాత్మా ముఖ్యంగా యువతకు దగ్గరయ్యారు. ఆసక్తిపరంగా ఇప్పుడు ఈ పుస్తకం కథ బయటకువచ్చింది. అయితే ఇంతవరకూ ఏ రాజకీయ పార్టీలూ గాంధీ మహాత్ముడిని తమ రాజకీయ పార్టీలో ఉత్పన్నమవుతున్న ఏ సమస్యతో ముడిపెట్టకపోవడం చాలా మంది పాతకాలం వారికి ఊరట కలిగిస్తున్నది. ఈ మధ్యన కాంగ్రెసులో సీనియర్ నాయకుడిగా ఎంతో అనుభవం గడించిన పి. చిదంబరం ఒక టి.వి ఇంటర్వ్యూలో చెప్పిన అంశం సెన్సేషనల్‌గా మారింది. కావాలనే ఆ ప్రస్తావన తెచ్చారో ఏమో కానీ ఇప్పుడున్న పరిస్థితులలో కాంగ్రెసు పార్టీకి మరో సమస్యను ఆయన ఇంటర్వ్యూ తెచ్చిపెట్టింది. 'ముంబాయిలో 26/11 ఉగ్రవాద దాడుల తర్వాత మన్మోహన్ గవర్నమెంట్ పాకిస్థాన్ ప్రభుత్వానికి ధీటుగా ప్రతిదాడులతో జవాబు ఇవ్వడానికి సిద్ధమైనా, ఆగిపోయింది. బహుశా అమెరికా ఒత్తిడి వల్ల కావచ్చు' అని ఆ ఇంటర్వ్యూలో ఇచ్చిన అంశం సారాంశం. ఇన్నేళ్ల తర్వాత చిదంబరం ఎందుకు



ఈ రహస్య సమాచారాన్ని అందివ్వాలని ఆశించారో తెలియదు. కానీ ఈ మాటలు మాత్రం కాంగ్రెస్ పార్టీని మరింత బలహీనపర్చడానికి కారణంగా మారాయి. టారిఫ్‌లతో తన విదేశాంగ విధానంతో భారత్‌ను ట్రంప్ తక్కువ చూపు చూస్తూ, ప్రధానికీ, బిజెపి నాయకత్వం వహిస్తున్న ఎన్‌డిఏ ప్రభుత్వానికి ఇబ్బంది కలిగిస్తున్న ఈ తరుణంలో ఎందుకు ఎన్నో పదవులు అనుభవించి కాంగ్రెసులో ప్రముఖ స్థానాన్ని పొందిన తమిళనాడు చిదంబరం కావాలనే ఈ నిప్పురవ్వ వదిలాడా, లేక యాదృచ్ఛికంగా ఈ సంగతి బయటపడిందా అన్న సంగతి అటుంచితే, బిజెపి పని మాత్రం గారెలబుట్టలో పడ్డట్లయింది. ఉగ్రవాదులు కాశ్మీర్‌లో చేసిన పహల్గాం దాడి తర్వాత భారత్, ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌ను భయంకరంగా నిర్వీర్యులను చేసింది. ప్రపంచ దేశాలు భారత్ ఆయుధ సంపత్తితో పాటు దాడి నైపుణ్యాన్ని గుర్తించాయి. కాంగ్రెసు పార్టీతోసహా అన్ని పక్షాలూ ఆర్మీ దాడిని శ్లాఘించక తప్పలేదు. ఇటువంటి తరుణంలో దిక్కుతోచక ట్రంప్ అదే పనిగా తానే పాకిస్థాన్, భారత్‌ల మధ్య ఘర్షణలు ఆపానని, ప్రచారం చేసుకున్నా, ప్రపంచ దేశాలు నమ్మలేదు. అనేక రకాల ఆర్థిక, దౌత్యపరమైన ఇబ్బందులు అమెరికా దేశం సృష్టించాలని ప్రయత్నించినా భారత్ పైచేయే అందరికీ కనపడింది. ఇలాంటి పరిస్థితులలో చిదంబరం బయటపెట్టిన రహస్యం లాంటి ఆ మాట (ఎంతవరకు నిజమో కాని) ఒక్కసారి కాంగ్రెసు పార్టీని పాతాళంలోకి తోసేసింది. అంతకు మునుపుకొందరు కాంగ్రెస్ నాయకులు కూడా ఇలాంటి మాటలతో ప్రతిపక్షమైన కాంగ్రెసును బలహీనపర్చారు. బిజెపి నాయకులు కాంగ్రెస్ నిష్క్రియా పర్వాన్ని మాత్రమే ఎత్తిచూపుతున్నారు కానీ, చిదంబరం ఆ విధంగా ఈ తరుణంలో మాట్లాడటం భావ్యం కాదని మాటవరుసకైనా అనటం లేదు. అలా అనాల్సిన అవసరం లేదు. ఎందుకంటే వారికి అనుకూలమైన పరిణామాలను ఎందుకు వదులుకుంటారు. చిదంబరం ప్రకటనకు విరుగుడుగా కాంగ్రెసు అధ్యక్షుడు ఖర్గే దేశమంతా స్వాతంత్య్రం తెచ్చుకోటానికి బ్రిటిష్ వారితో పోరాడుతుంటే ఆర్.ఎస్.ఎస్ బ్రిటిష్ ప్రభుత్వానికే సహకరించిందని మళ్లీ పాత పాటనే తెరమీదకి తెచ్చారు. గాంధీ పుస్తకాన్నిగురించి అనుకోకుండా వచ్చిన కథనం ఆధారంగా గాడ్సే ఉదంతం కాంగ్రెస్ అనుకూలురు తెరమీదికి తెచ్చినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. ఇలాంటి వ్యర్థ ప్రయత్నాలతో ఇప్పుడిప్పుడే అగ్రస్థానం వహిస్తూ ఆర్థికపరంగా ఆర్మీపరంగా, అభివృద్ధిపరంగా ముందుకు దూసుకొని వెళ్తున్న మన దేశ ప్రతిభను రాజకీయాలతో దిగజారుస్తున్నందుకేఆశ్చర్యపడాలి. ఆర్‌యస్.యస్ భారతీయ నాగరికత ప్రతిబింబిస్తున్న తత్వశాస్త్రానికి కస్టోడియన్ అని బిజెపి నాయకులన్నా, జాతిపిత గాంధీ ఆధునిక వైతాళికుడు జవహర్‌లాల్ నెహ్రూ వల్లనే దేశానికి స్వాతంత్య్రం తెచ్చామని కాంగ్రెసు చెప్పుకున్నా, చిదంబరం, శశిథరూర్ లాంటి నాయకులురాజకీయ లబ్ధిపొందాలనే తాపత్రం తమమాటల్లో అర్థనిజాలు వక్కాణించినా, ఆర్‌యస్‌యస్, వాజ్‌పాయ్ ప్రతిభాపాటవాలను బిజెపి నాయకులు ఇప్పుడు తెరమీదకుతెచ్చినా భారత ప్రజలకు ఇప్పుడు ఒరిగేదేమీ లేదు. కలిసికట్టుగా ఆనాడు పోరాడబట్టే స్వాతంత్య్రం ఈ దేశానికి వచ్చింది. ఇప్పుడున్న రాజకీయ నాయకులలో కొందరు అప్పుడు పుట్టలేదుకూడా! అందుకే ఆ ఫలాలను అందుకుంటూ, చెట్టుకాయలను అమ్ముకునే ప్రయత్నం ఈనాటి నాయకులు చేయడం న్యాయం కాదు. ఇప్పుడిప్పుడే మనదేశం అన్నివిధాలా ముందంజ వేస్తున్నది. దయచేసి వెనకకు లాగే ప్రయత్నాలు చేయడం భావ్యం కాదు. ●

# 'కడుపుకోత'లు తెలంగాణలోనే ఎక్కువ!

డాక్టర్ మధుసూదన్ రెడ్డి బుర్ర

గర్భం దాల్చడం ఓ మధుర అనుభూతి. మాతృత్వం ఓ దేవుడిచ్చిన వరం. సహజ ప్రసవం ఓ అద్భుత అదృష్టం. సహజ ప్రసవంతో మాతాశిశు ఆరోగ్యాలు పదిలంగా ఉంటాయి. అన్నీ తెలిసిన నడవంత్రపు నరులు తీరొక్క ఆలోచన చేస్తున్నారు. పిల్లల్ని కనడం భూమిని మోసినంత భారం అవుతున్నది. పిల్లల పెంపకంలో బాధ్యతలు బాధలతో కూడినవే అంటూ విపరీత ఆలోచనలు చేస్తున్నాం. కుటుంబ నియంత్రణ బహుళ ప్రచార దీవెనలతో వన్ ఆర్ నన్ నినాదాన్ని నిజం చేస్తున్నాం. సహజ ప్రసవంలో ప్రసవ వేదన పడలేమంటూ, మంచి ముహూర్తాలు చూసి ఆయా సమయాలకు ఆపరేషన్ ద్వారా అవాంఛనీయ కృత్రిమ ప్రసవాలకు మొగ్గు చూపుతున్నాం. సుముహూర్తాలను చూసుకొని కడుపు కోతలు, అధిక బిల్లుల వసూలుకు ప్రైవేట్ ఆసుపత్రులు పాటిస్తున్న అనైతిక ఆచారాలు, పూర్తి అవగాహన లేకపోవడం లాంటి పలు కారణాలతో క్రమంగా సహజ ప్రసవాలు తగ్గుతూ సిజేరియన్ ఆపరేషన్లు పలు రెట్లు పెరుగుతున్నాయి. ఆధునిక ప్రసవాల్లో సహజ ప్రసవాలు అరుదైపోతున్నాయి. మాతాశిశు ఆరోగ్యాలను గాలికి వదిలేస్తున్నాం. ప్రపంచ స్థాయిలో నేడు సిజేరియన్ ప్రసవాలు 21 శాతం జరుగుతుండగా, ఇవి 2030నాటికి 28 శాతానికి పెరగవచ్చని కూడా అంచనా వేస్తున్నారు. భారత్‌లో 2016లో 17.2 శాతం ప్రసవాలు సిజేరియన్ ఆపరేషన్ ద్వారా జరుగగా, 2021లో అది 21.5 శాతానికి పెరగడం గమనించారు. 2021లో ప్రైవేట్ ఆసుపత్రి ప్రసవాల్లో ఏకంగా 47.4 శాతం ప్రసవాలు,




ప్రభుత్వ ఆసుపత్రుల్లో 14 శాతం ప్రసవాలు సిజేరియన్ ఆపరేషన్ల ద్వారా జరిగినట్లు లాంసెట్ దేశవ్యాప్త విస్తృత అధ్యయనాల ద్వారా తెలుస్తున్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం కేవలం 15శాతం కన్న తక్కువగా కావలసిన సిజేరియన్ ప్రసవాలు నేడు భారతదేశవ్యాప్తంగాపలు రాష్ట్రాల్లో అత్యధిక శాతం నమోదు కావడం విచారకరం. దేశంలో సిజేరియన్ ప్రసవాలు అత్యధికంగా తెలంగాణ రాష్ట్రంలో 60.7 శాతం వరకు జరుగుతున్నాయని, అతి తక్కువ సిజేరియన్ ప్రసవాలు నాగాలాండ్‌లో 5.2 శాతం మాత్రమే జరుగుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో అధికంగా తమిళనాడులో 44.9 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 42.4 శాతంగా సిజేరియన్ ప్రసవాలు నమోదు అయ్యాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో మేఘాలయాలో 8.2 శాతం, బీహార్‌లో 9.7 శాతం మాత్రమే సిజేరియన్ ప్రసవాలు జరుగుతున్నాయి. పేదలతో పోల్చితే ధనిక వర్గాల్లో ఐదు రెట్లు అధికంగా సిజేరియన్ ప్రసవాలు జరుగుతున్నట్లు స్పష్టం అవుతున్నది. సహజ ప్రసావాలకు వైద్యులు, వైద్య సిబ్బంది ఎక్కువ సమయం, శ్రమ కేటాయించాల్సి వస్తున్నది. సిజేరియన్ ఆపరేషన్ ప్రసవాలు కేవలం గంటలో పూర్తి కావడంతో వైద్యులకు, ప్రసవించిన తల్లులకు శ్రమ తగ్గుతోంది. ప్రసవ సమయంలో మాతాశిశు ఆరోగ్యానికి ప్రమాదం కావచ్చని భావించినపుడు మాత్రమే సిజేరియన్ ప్రసవాలను ఆశ్రయించాలి. సహజ ప్రకృతి ప్రసవాలకు అవకాశం ఉన్నప్పటికీ సిజేరియన్ ప్రసవాలను ఆశ్రయించడం తల్లి బిడ్డలకుఆరోగ్యకరం కాదు. సహజ ప్రసవాలతో శిశువులపై మాతృత్వ అనుభూతులు తియ్యగా ఉంటుంది. ప్రకృతి నియామకాలకు విరుద్ధంగా వేసే ప్రతి అడుగు అనర్థానికి దారి తీస్తుందని గమనించి సహజ ప్రసవాలకు పట్టం కడదాం. ●

# ఒత్తిళ్లే మానసిక వైకల్యానికి మూలం

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రతీ ఏడాది అక్టోబర్ 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం జరుపుకుంటున్నాం. నేటి ఔత్సాహిక యువతరంలో శారీరక సమస్యలతో పాటు మానసిక సమస్యలున్న వారి సంఖ్య పెరుగుతోంది. కొందరు వాటిని బయటకు చెప్పుకోలేక సతమవుతూ ఉంటారు. సమాజం వాటిని మరొక కోణంలోనే చూస్తున్న ఈ నేపథ్యంలో మానసిక అనారోగ్య సమస్యను సాధారణ అనారోగ్యంగా భావించాలని తెలిపేందుకే ఈ రోజు నిర్వహిస్తున్నారు. 1992లో వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెంటల్ హెల్త్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మనిషి పుట్టాక ఎలాంటి వైకల్యం లేకుండా ఉంటే అతడి జీవితం హ్యాపీగా సాగుతుంది. ఐతే చిన్న వైకల్యం ఉన్నా అది జీవితాంతం అతడిని పీడిస్తుంది. కొందరు పుట్టుకతో ఆరోగ్యకరంగా బాగానే ఉన్నప్పటికీ హఠాత్తుగా మానసిక రోగులుగా మారిపోతుంటారు. నిజానికి మనలో 40 శాతం పిచ్చివాళ్ళేననేది నిపుణుల అంచనా. అది మెడికల్ అనాలిసిస్ మాత్రమే. ఇంకా ఫ్రాంకుగా, నిఖార్సుగా చెప్పాలంటే పూర్తి నార్మల్‌గా వుండే వాళ్లు బహుశా ఏ రెండు శాతమో వుంటారు. మనచుట్టూ ఎంత అబ్ నార్మాలిటీ? ఎన్ని వింత పోకడలు? తిండి పిచ్చి, డబ్బు పిచ్చి, నగల పిచ్చి, పుస్తకాల పిచ్చి, పేరుపిచ్చి, సినిమాల పిచ్చి, గొప్పలు చెప్పడం, అప్పులు చేయడం ఆడంబరాలు పోవడం, షాపింగు, అతివాగుడు, మితిమీరిన కోపం వైద్య పరిభాషలో డిప్రెషన్, యాంగ్జయిటీ, యాంగ్జయిటీ న్యూరోసిస్, బైపోలార్ డిజార్డర్, సోషల్ యాంగ్జయిటీ డిజార్డర్, పానిక్ డిజార్డర్, అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్, పోస్ట్ ట్రమాటిక్ స్ట్రెస్ డిజార్డర్, ఫోబియా, మానియా స్కిజోఫ్రీనియా, డిల్యూషనల్ డిజార్డర్, స్లీప్ డిజార్డర్ ఇమ్నియా), ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్, సుపీరియారిటీ కాంప్లెక్స్ ఇల్యూషన్, అడిక్షన్ లాంటి మానసిక వైకల్యాలు అనేకం ఉన్నాయి. స్థూలంగా చెప్పాలంటే మానసిక ఉద్రేకాలను నిగ్రహించుకోలేకపోవడమే రుగ్మతను తెచ్చిపెడ్తుంది. ఏ లక్షణమైనా సరే అవధులు దాటినప్పుడు అది పిచ్చి చేష్ట అవుతుంది. హద్దుల్లో మనం వుండి, బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తున్నంతవరకు ఎవరూ మనని తప్పుపట్టరు. మానసిక వైకల్యం వచ్చిన వారిలో సగానికి పైగా 14 ఏళ్ల లోపు వయసు నుంచి ఈ సమస్య ప్రారంభమవుతుంది. మొత్తం 20 శాతం మంది బాలబాలికల్లో ఈ అవలక్షణం ఉన్నట్లు తేలింది. భయంకర సంఘటనలు, సామాజిక పరిస్థితుల కారణంగా మానసిక వైకల్యం చెందడం సర్వసాధారణమైన కారణంగా చెపుతారు. మానసిక సమస్యతో బాధపడే వారిని గుండె సంబంధిత సమస్యలు, మధుమేహం, గ్యాస్ట్రిక్ సమస్యలు కూడా వెంటాడుతాయి. మానసికంగా బలహీనంగా ఉన్నవారు పూర్తిగా ఆ సమస్యలో కూరుకుపోవడానికి కారణం సదరు వ్యక్తి కుటుంబ సభ్యులు కూడా కారణమవుతున్నారు. సమాజంలో మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వారికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి. సంఘానికి వ్యతిరేకంగా ప్రవర్తించడం, కొంతమంది వ్యక్తులు ప్రత్యేకించి కొన్నిసార్లు విపరీతమైన కోపాన్ని ప్రదర్శిస్తూ అరుస్తూ పిచ్చిగా ప్రవర్తిస్తుంటారు. వీరి ప్రవర్తన ఇతరులకు హాని కలిగించేదిగా ఉంటుంది. అమ్నోసియా ఇది కూడా సర్వసాధారణంగా కనబడేదే.



వీరిలో కనిపించే లక్షణం మర్చిపోవడం. బ్రెయిన్ డ్యామేజ్ కారణంగా చెప్పినవి, జరిగినవి మర్చిపోతుంటారు. ఆస్పర్జెర్స్ సిండ్రోమ్ వీరిని కూపస్త మండూకాలని చెప్పవచ్చు. సమాజంలో ఎవ్వరితోనూ వీరికి సంబంధాలు ఉండవు. ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడుతుంటారు. ఎవరితోనూ మాట్లాడేందుకు ఇష్టపడరు. ప్రత్యేకమైన వ్యక్తులుగా అగుపిస్తుంటారు. ఒత్తిడి అనేది చాలా పెద్దపదం. దీని కారణంగా చాలామంది ప్రాణాలు తీసుకున్న సంఘటనలున్నాయి. ఈ ఒత్తిడి సమస్య కారణంగా వారిపై వారికి నమ్మకం సన్నగిల్లుతుంది. సంతోషకరమైన పండుగలు ఇతరత్రా ఏవివచ్చినా వాటిని జరుపుకునేందుకు ఆసక్తిచూపరు. ప్రతిదాన్ని విమర్శిస్తూ తిట్టుకుంటూ ఉంటారు. నలుగురితో కలిసి తిరగడం వీరికి అస్సలు ఇష్టం ఉండదు. ఇలాంటి వారి మానసిక స్థితిని మామూలు స్థితికి తీసుకు రాకపోతే ఆత్మహత్యలకు పాల్పడేందుకు అవకాశం ఉంటుంది. ఒబెసివ్ కంపల్సివ్ డిజార్డర్ అంటే వీరు ఒకరకంగా మతిమరుపు టైపే. పెట్టిన చోట వస్తువు ఉందో లేదో అని పదేపదే చెక్ చేసుకుంటూ ఉంటారు. అలాగే ప్రతి చిన్నదానికి చేతులు కడుక్కోవడం, ఇంట్లో ఉన్న వస్తువులను లెక్కబెట్టడం, అకస్మాత్తుగా స్నానం చేయడం, తలుపులు వేసి ఉన్నాయో లేదో అని పలుమార్లు చెక్ చేసుకోవడం వంటివి చేస్తుంటారు. అలాగే వదిలేస్తే ఇవి కూడా ఆ వ్యక్తిలో ఆత్మహత్యల వైపు తీసుకెళతాయి. కాబట్టి మానసిక వైకల్యం ఉన్న వారి విషయంలో కుటుంబ సభ్యులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవలసిన అవసరం ఉంటుంది. వృద్ధాప్యం మరో బాల్యం లాంటిది. వృద్ధులతో వ్యవహరించేటప్పుడు కాస్త సున్నితంగా ఉండటం చాలా అవసరం. సగటు ఆయుర్దాయం పెరగడంతోవృద్ధుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతోంది. వృద్ధుల సంఖ్యతో పాటే మలి వయసులో మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడే వారి సంఖ్యాపెరుగుతోంది. మానసిక చికిత్సా విభాగానికి వచ్చే ప్రతి వందమందిలో 25 మంది వృద్ధులుంటున్నారు. వీరిలో అత్యధికులు డిప్రెషన్, నిద్రలేమి ఆందోళన, డిమెన్షియా వంటి ఆరోగ్యసమస్యలు వస్తున్నాయి. మానసిక రుగ్మతలు ఉన్నవారికి మెరుగైన చికిత్స అందుబాటులో ఉంది. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రికి తీసుకువస్తే వ్యాధిని పూర్తిగా నియంత్రించవచ్చు. అలాంటి వ్యాధి సోకితే జబ్బు తీవ్రత కంటే ఎక్కువగా మనం తల్లడిల్లిపోతాం. మనతో బాటు మనవాళ్ళూ ఆందోళన చెందుతారు. జన్యుశాస్త్రం కుటుంబాలలో వస్తూ వుండే మానసిక రుగ్మతలు తమ కుటుంబంలో మరో ఏ సభ్యుడికైనా అటువంటివి ఉన్నట్లయితే, మిగతా వారు కూడా అటువంటి మానసిక రుగ్మతల బారిన పడే అవకాశాలను ఎక్కువగా కలిగి ఉంటారని సూచిస్తున్నాయి. మానసిక రుగ్మత, వైకల్యం అనేది అనేక జన్యువుల పరస్పరక్రియ, ప్రభావం (ఇంటరాక్షన్) వల్ల ఇతర అంశాలవల్ల అంటే ఒత్తిడి, దుర్వినియోగం, లేకపోతే ఒక శరాఘాతం (ట్రోమా) కలిగించే సంఘటన వంటివాటి వల్ల సంభవిస్తుంది. ఒక వ్యక్తి వారసత్వంగా ఈ రుగ్మతకు గురయ్యే అవకాశాన్ని కలిగి వున్నప్పుడు ఆ వ్యక్తిలో ఇవి అనారోగ్యాన్ని మరింత ప్రభావితం చేయడమో లేక అనారోగ్యాన్ని ఉసిగొల్పడమో చేస్తాయి. అంటు రోగాలు మెదడు దెబ్బ తినడానిక, మానసిక రుగ్మత వృద్ధి చెందడానికి లేక క్షీణించిపోతూ ఉండే పరిస్థితిని తెలియజేసే రోగ లక్షణాలతో సంబంధం కలిగివుంటాయి. ఉదాహరణకు పీడియాట్రిక్ ఆటో ఇమ్యూన్ న్యూరో సైకియాట్రిక్ డిజార్డర్ (పి.ఎ.ఎన్.డి.ఏ) గా పిలువబడే పరిస్థితి పిల్లలలో స్ట్రెప్టోకోకస్ బ్యాక్టీరియా అనేది అబ్సెసివ్‌కంపల్సివ్ డిజార్డర్ (నిరంతరం ఒకే భావంతో ఉండే స్థితి తప్పనిసరి, బలవంతమైన వైకల్యం) ఇతర మానసిక రుగ్మతలు పెరగడంతో సంబంధం కలిగి ఉంటుంది. మెదడులోని కొన్ని భాగాలలో లోపాలు కలుగడం లేక గాయాలు కలిగి వుండడం అన్నది కొన్ని మానసిక రుగ్మతలతో సంబంధం కలిగి ఉంటుంది. ●

# గుంటూరు వార్త





జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను బహుకరించిన పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి దంపతులు (గుంటూరు క్రైమ్, ప్రభాతవార్త)

## 25మంది పెన్షనర్లతో నూతన కార్యవర్గం

గుంటూరు విద్య,అక్టోబర్ 9,ప్రభాతవార్త : ఆలిండియా పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్స్ అండ్ కస్టమ్స్ (సిబిఐసి) ఆంధ్రప్రదేశ్ యూనిట్ 25మందితో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏర్పాటుచేసుకున్నారు.గురువారం గుంటూరు రింగ్‌రోడ్డులోని కస్టమ్స్,జీఎస్టీ అప్పీల్స్ కార్యాలయంలో



పెన్షనర్ల సంఘం రాష్ట్రస్థాయి ఎన్నిక,సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి గుంటూరుకు చెందిన టి.వివేకానంద ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోగా,ప్రధానకార్యదర్శిగా విజయవాడకు గద్దె తిలక్ ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా ఎం.దేవరాజన్ (తిరుపతి) బి. రాజేశ్వరరావు(గుంటూరు), ఎ.సత్యనారాయణ(రాజమండ్రి), పర్వతనేని ప్రసాద్ (విజయవాడ) ఎన్నికయ్యారు.సంయుక్త కార్యదర్శి పదవికి పి.వి.సత్యనారాయణ(గుంటూరు), పి.భీమ్ ప్రసాద్ (ఏలూరు), కె.వి.అప్పలాచార్యులు (కాకినాడ), పివిఎ నరసింహం(వైజాగ్) ఎన్నికయ్యారు.కోశాధికారిగా పి.కోటేశ్వరరావు (గుంటూరు),సిజిహెచ్ఎస్ ఏపి కోఆర్డినేటర్‌గా గుమ్మడి సీతారామయ్య చౌదరి(గుంటూరు), విజయవాడ కోఆర్డినేటర్‌గా పి.భాగ్యరావు(విజయవాడ) మహిళా రిప్రజెంటేటివ్‌గా కే.సామ్రాజ్యం(గుంటూరు) పదవులు దక్కించుకున్నారు.సర్కిల్ సెక్రటరీలుగా గుంటూరు కు ఎన్.ఎస్.నగేష్ బాబు,విజయవాడకు పి.భాగ్యరావు,ఏలూరుకు ఎస్.కె.హుస్సేన్,కాకినాడకు టి.వెంకట్రావు,విశాఖపట్నంకు ఎం.వినోద్‌కుమార్,నెల్లూరు ఇక్రముల్లా షా,తిరుపతికి ఇనయతుల్లా ఎన్నికయ్యారు.సంఘ గౌరవాధ్యక్షులుగా సెంట్రల్ ఎక్సైజ్ శాఖ విశ్రాంత చీఫ్ కమీషనర్ సి.పి.రావు,గౌరవ సలహాదారులుగా ఐఆర్ఎస్ క్యాడర్ కు చెందిన విశ్రాంత అసిస్టెంట్ కమీషనర్లు బి.సీతారామయ్య,పి.వి.రమణమూర్తి,నర్రా వెంకటేశ్వర్లు ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎన్నికల అధికారులుగా జీఎస్టీ సూపరింటెండెంట్లు కె.పి.సాగర్,ఎం.గిరిబాబు వ్యవహరించారు.నూతన కార్యవర్గం రెండేళ్ళపాటు పనిచేస్తుంది.సెంట్రల్ జీఎస్టీ కమీషనర్ సుజిత్ మల్లిక్,విశ్రాంత చీఫ్ కమీషనర్ బి.హరేరామ్,అఖిల భారత కస్టమ్స్,జీఎస్టీ ఉద్యోగ సంఘ నాయకులు ఎం.నాగరాజు,కె.యుగంధర్,బి.నవీన్‌రాజు,సూర్యదేవర రమేష్‌బాబు,గాదె శ్రీనివాసరెడ్డి తదితరులు నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు.

## ఢిల్లీలో ఆంధ్రా ఇంటాక్ సభ్యుల బృందం శిష్ గుంబద్ చారిత్రక కట్టడం సందర్శన

గుంటూరు విద్య,అక్టోబర్ 9,ప్రభాతవార్త : ఇంటాక్ (ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్) కెపాసిటి బిల్డింగ్ వర్క్‌షాప్ రెండో రోజు కార్యక్రమంలో భాగంగా సభ్యులు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.శిక్షణలో బాగంగా బృంద సభ్యులు ఢిల్లీలోని అతి పురాతనకట్టడమైన శిష్ గుంబద్‌ను సందర్శించారు.ఇంటాక్ సభ్యుల కోసం జరిగిన సామర్థ్య నిర్మాణ వర్క్‌షాప్ 2వరోజు చాప్టర్స్ డివిజన్ డైరెక్టర్ కెప్టెన్ అరవింద్ శుక్లా కార్యాశాలను ప్రారంభించారు.



కెప్టెన్ శుక్లా ప్రసంగిస్తూ దేశవ్యాప్తంగా 240చాప్టర్స్ తోటి ఇంటాక్ చారిత్రక వారసత్వ ప్రాంతాల పరిరక్షణ కోసం ప్రభుత్వంతో పాటు కృషి చేస్తుందన్నారు.ఇంటాక్ చైర్మన్ అశోక్ సింగ్ ఠకూర్,చాప్టర్స్ డివిజన్ డైరెక్టర్ కెప్టెన్ ఆరవింద్ శుక్లా, మెంబర్ సెక్రటరీ రవీంద్ర సింగ్,వివిధ డివిజన్ల డైరెక్టర్లు దీప్తి,రీతుసింగ్ సభ్యులను లోధి ఎస్టేట్లోని ప్రాచీన కట్టడంకు ఫీల్డ్ వర్క్‌కు తీసుకెళ్ళి కట్టడం యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు.సాయంత్రం సుందర్ నర్సరీ ప్రపంచ వారసత్వ నర్సరీ సాయంత్రం సభ్యులను తీసుకెళ్ళి ప్రకృతి సహజ సిద్ధమైన అతి పురాతన మైన వృక్షాల గురించి తెలియజేశారు.వారసత్వంలో పరిశోధన తదితర అంశాలపైన అవగాహన కల్పించారు.ఆంధ్రప్రదేశ్ నుంచి ఇంటాక్ సభ్యులు గుంటూరు చాప్టర్,విజయవాడ,కడప,విశాఖపటన్నం నుండి ఢిల్లీలో మూడురోజుల పాటు జరిగే వర్క్‌షాప్ లోధిరోడ్డులోని ఇంటాక్ ప్రధాన కార్యాలయంలో హాజరైయ్యారు.అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు,అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఇంటాక్ సభ్యులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు,మేకల రవీంద్రబాబు,ఎన్ సుకీర్తి,కే.ప్రవీణ,డాక్టర్ రేణుకారాణి,ఎస్.మహిపాల్ రెడ్డి,ఈ .రమేష్, ఎం.వెంకట సుబ్బారెడ్డి,నాగభూషణం,వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

### --మంత్రి లోకేష్‌కు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ వినతి

గుంటూరు విద్య ,అక్టోబర్ 9,ప్రభాతవార్త : రాష్ట్రంలో ఉపాధ్యాయుల చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు,బొనిగల హైమారావులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను కోరారు.ముఖ్యంగా డిఎస్సీ -2003 ఉపాధ్యాయులకు పాత



పెన్షన్ విధానం అమలు చేయాలని,పెరుగుతున నిత్యావసరాల ధరలదృష్ట్యా కరువు భత్యం మంజూరు చేయాలని,కోవిడ్‌లో మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాల్లో కారుణ్య నియామకాలు చేపట్టాలని,12వ పిఆర్సీ కమీషన్ ఏర్పాటు చేయాలని,మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని,డిఈవో పూల్లో ఉన్న మున్సిపల్ లాంగ్వేజ్ పండిట్ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్ తెలుగు హిందీ పదోన్నతులు కల్పించాలని,తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న లాంగ్వేజ్ పండిట్‌లకు పదోన్నతులు కల్పించడం,అంతర్ జిల్లాల ఉపాధ్యాయ బదిలీలు చేపట్టినందుకు ప్రభుత్వానికి నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ పక్షాన ధన్యవాదాలు తెలిపారు.రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావులతోపాటు రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి జె.శ్రీనివాసరావు,చిత్తూరు జిల్లా అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు,అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు టి.వెంకటరమణ,విజయవాడ అర్బన్ ప్రధాన కార్యదర్శి చంటి బాబు తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమలో రూ.1.80కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మాధవి శంకుస్థాపన



గుంటూరు క్రైమ్,అక్టోబర్ 9,ప్రభాతవార్త : స్థానిక పశ్చిమ నియోజకవర్గంలోని 25వ డివిజన్‌లో రోడ్లు, డ్రైయిన్లు, కల్వర్టుల నిర్మాణం కోరకు రూ.1.80కోట్ల వ్యయంతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గళ్ళామాధవి శంకు స్థాపన చేశారు.కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎన్డీయే కూటమి నేతలు, కార్పొరేషన్ అధికారులు, ప్రజా ప్రతినిధులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ 25వ డివిజన్ నగరానికి శివారులో ఉండి చాలా కాలంగా అభివృద్ధికి దూరంగా ఉంది,రోడ్లు,డ్రైయిన్లు,నీటి సరఫరా వంటి ప్రాధమిక సౌకర్యాలు లేని పరిస్థితి ఉండేది.ముఖ్యంగా లక్ష్మీనగర్ ఏరియాలో తాగునీటి సమస్య చాలా కాలంగా ఉంది.ఇప్పుడు పైపులైన్లు,డ్రైయిన్‌లు,సిసి రోడ్లు వేసే పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గాలం వెంకటేశ్వర్లు, కదిరి సంజయ్,బిజేపి బాబు,తోట చిన్ని,చెంబేటి మణికుమారి,బాబు,ప్రసాద్,ఖాజా ఖాన్,వెంకట్రావు, బుల్లబ్బాయి,కోటయ్య వేణు,పవన్ గుర్రం ప్రసాద్,ఖర్జూర శ్రీనివాస్,చాంద్ తదితరులు పాల్గొన్నారు.

వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, Kota Vijay Babu S/O Samuel Josh born on 01-01-1976 residing at 6-118, Dhullipalla, near Kallam Spinning Mill, Sattenapalli Mandal, AP-522412, have changed my name to Kota Srinivasa Rao vide affidavit on 08-10-2025 at sattenapalli
(Ro.No.25618)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## ఎపి సిఆర్డీఏ సెంట్రల్ నర్సరీ నిర్వహణకు నూతన వాహనాలు

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 9: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఎపి సిఆర్డీఏ) అమరావతిలోని ఉద్దండరాయునిపాలెంలో 20 ఎకరాలలో విస్తరించి ఉన్న ఏపీ సిఆర్డిఏ సెంట్రల్ నర్సరీ మరియు అవెన్యూ మొక్కల పెంపకం నిర్వహణ కోసం నూతన వాహనాలు



అందజేసింది. నర్సరీ నిర్వహణ నిమిత్తం 47 హెచ్‌పి ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్, ట్రైలర్‌ను తాజాగా సిఆర్డిఏ కొనుగోలు చేసింది. సిఆర్డిఏ కమిషనర్ కె.కన్నబాబు ఐఏఎస్ గారు సంబంధిత అధికారులకు వాహనాల తాళాలను అందజేశారు. ప్రజారాజధాని అమరావతిలో పచ్చదనం పెంపొందించేందుకు సిఆర్డిఏ కట్టుబడి ఉందని కమిషనర్ గారు తెలిపారు. కార్యక్రమంలో సిఆర్డిఏ ల్యాండ్ స్కేప్ ఎన్విరాన్‌మెంట్ విభాగ అడిషనల్ డైరెక్టర్ ఎం.హరిప్రసాద్ హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ బి.జాన్ బెన్నీ, హార్టికల్చర్ అధికారి ఏ.శివ రామ కృష్ణ పాల్గొన్నారు.

## అనధికారిక కట్టడాలను లేఅవుట్లను ఉపేక్షించేది లేదు : కమీషనర్ పులి శ్రీనివాసులు



గుంటూరు నగరపాలక సంస్థ,అక్టోబర్ 9,ప్రభాతవార్త : జిఎంసి పరిధిలో అనధికార కట్టడాలను,లే అవుట్లను ఉపేక్షించబోమని, ఎక్కడైనా అనధికార నిర్మాణాలు జరిగితే ప్రజలు నేరుగా కమీషనర్ పర్యవేక్షణలో ఉండే 98499 08391నెంబర్‌కి వాట్సాప్ ద్వారా తగిన ఆధారాలతో (ఫోటోలు వీడియోలు)ఫిర్యాదు చేయవచ్చరని కమీషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు.నగరంలో నిర్మాణాలు జిఎంసి నుండి నిర్ధేశిత అనుమతులు పొందిన అనంతరమే చేపట్టాలని అనుమతుల్లేకుండా నిర్మాణం చేస్తే నిర్మాణాన్ని కూల్చివేయడంతోపాటు నిర్మాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.అలాగే బాధ్యులైన సిబ్బంది,అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.నగర ప్రజలందరూ నిర్మాణ లే అవుట్ల అనుమతుల కోసం దరఖాస్తు చేస్తే నిర్ధేశిత గడువులోపు మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## శ్రీగిరి నాగమాంబ వర్ధంతి,విశ్వకర్మ హోమం

గుంటూరు క్రైమ్,అక్టోబర్ 9,ప్రభాతవార్త : ఆంధ్రరాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో గురువారం సమాజ స్థలదాతల్లో ఒకరైన శ్రీగిరి నాగమాంబ వర్ధంతి,విశ్వకర్మ హోమం కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి,గళ్ళా రామచంద్రరావు దంపతులు ముఖ్యఅతిధులుగా



హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన సమాజాభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేసిన మహానుభావుల పుణ్యఫలంగా మనం ఒకే వేదికపై ఇలాంటి పవిత్ర కార్యక్రమాలను జరువుకుంటున్నామన్నారు.శ్రీగిరి నాగమాంబ పుణ్యం వల్లే ఈ స్థలం,ఈ సమాజం అభివృద్ధి దిశగా సాగుతోందని,భవిష్యత్ తరాల అభ్యున్నతి గురించి ఆలోచించిన మహానుభావుల త్యాగమే మనకు మార్గదర్శకం కావాలి.మన కమిటీ ఈ పవిత్ర స్థలాన్ని ఈ సమాజాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నా అన్నారు.సమాజ పెద్దలందరికి అభినందనలు తెలియజేస్తూ కొత్త పాలకమండలి ఆధ్వర్యంలో సమాజం మరింత వైభవంతంగా ఎదగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తిరువళ్ళూరు పద్మావతి కార్పొరేటర్ శ్రీవల్లి,రావెళ్ళ వెంకటయ్య,అధ్యక్షులు జంపని రాధాకృష్ణమూర్తి,ఉపాధ్యక్షులు కొలగాని నందవీర ప్రసాద్,ప్రదాన కార్యదర్శి కందుకూరి ఎన్.సుధాకరబాబు,కార్యదర్శి పూసపాటి గిరిధర్,కోశాధికారి కందేపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## 'ఉద్యోగ,ఉపాధ్యాయ విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత చికిత్స అందించాలి'



గుంటూరు విద్య,అక్టోబర్ 9,ప్రభాత వార్త : ఏపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు చాంద్‌భాష,కార్యవర్గ సభ్యులు జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ ని కలసి ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు నెట్‌వర్క్ హాస్పటల్స్‌లో నగదు రహిత వైద్య చికిత్సను పూర్తిస్థాయిలో అందించాలని కోరారు.జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ మాట్లాడుతూ తప్పనిసరిగా హాస్పటల్ యాజమాన్యంతో సమావేశం ఏర్పాటుచేయిస్తాను అని చెప్పారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ,జిల్లా ఉపాధ్యాయులు యు.సుమిత్రాదేవి,జిల్లా సంయుక్త కార్యదర్శి కోటా సాహెబ్,వి.కార్తిక్,నగర శాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి,ఈశ్వరప్రసాద్,నగర శాఖ ఉపాధ్యక్షులు నాగరాజు,కోశాధికారి,శ్రీనివాస్,మహిళా విభాగం నాయకులు రమణి,మయూరి పాల్గొన్నారు.

## దేశంలోని చారిత్రమ ప్రాంతాలు,ప్రాచీన వారసత్వ కట్టడాలను పరిరక్షించాలి

గుంటూరు విద్య,అక్టోబర్ 9,ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ఇంటాక్ సభ్యులకు ఢిల్లీలోని ఇంటాక్ కార్యాలయంలో సర్టిఫికెట్లను చైర్మన్ అశోక్‌సింగ్ ఠాగూర్,మాజీ కేంద్ర ప్రభుత్వ కల్చర్ డిపార్టుమెంట్




కార్యదర్శి ,ఇంటాక్ మెంబర్ సెక్రటరీ రవీంద్ర సింగ్,చాప్టర్స్ డివిజన్ డైరెక్టర్ అరవింద్ శుక్లా తదితరుల చేతుల మీదుగా సభ్యులకు సర్టిఫికేట్లను ప్రధానం చేశారు.అనంతరం ఇంటాక్ కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్ మూడవరోజు శిక్షణ కార్యశాలను డివిజన్ డైరెక్టర్ కెప్టెన్ అరవింద్ శుక్లా ప్రారంభించారు.ఇంటాక్ చైర్మన్ అశోక్‌సింగ్ ఠాగూర్,చాప్టర్స్ డివిజన్ డైరెక్టర్ కెప్టెన్ అరవింద్ శుక్లా,మెంబర్ సెక్రటరీ,మాజీ కేంద్ర ప్రభుత్వ కల్చర్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శి రవీంద్రసింగ్ ల నుంచి ట్రైనింగ్‌సర్టిఫికేట్లు అందుకున్న ఏపి నుంచి అఖిల భారత పంచాయితీ పరిషత్ (ఢిల్లీ ) జాతీయ ఉపాధ్యాక్షులు,అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్,ఇంటాక్‌సభ్యులు డాక్టర్ జాస్తీ వీరాంజనేయులు.మేకల రవీంద్రబాబు,ఎన్.సుకీర్తి,కే.ప్రవీణ,డాక్టర్ రేణుకారాణి,మహిపాల్ రెడ్డి,రమేష్,వెంకట సుబ్బారెడ్డి,నాగభూషణం,వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

## సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్

పెదనందిపాడు అక్టోబర్ 9 (ప్రభాతవార్త): మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్. అశోక పాఠశాల కరస్పాండెంట్ పోపూరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూకేంద్రం ప్రకటించిన జిఎస్టి రాయితీ ల లో ఆరోగ్య పరంగాజీవిత/ఆరోగ్య భీమాసేవలుగతంలో 18 శాతం జిఎస్టి ఉంటే రాయితీ ప్రకటించిన తర్వాతఇప్పుడు 0 అనగా 18 పొదుపు అయిందని. అదేవిధంగా వివిధ రకాల మందుల పై..గతంలో 12 ఉంటే ఇప్పుడు 5 తగ్గించడం వలన7 వరకు పొదుపు లభిస్తుందన్నారు.వ్యాధి నిర్ధారణ కిట్లు, సంబంధిత పరికరాలుగతంలో 12 ఉండగా ఇప్పుడు 5 తగ్గించడంతో7 వరకు పొదుపు అవుతుందన్నారు.



మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్.. గతంలో 12 జిఎస్టి ఉండగా ఇప్పుడు 5 రావడం వలన7 వరకు పొదుపు లభిస్తుందన్నారు దృష్టి సరిచేసే కళ్ల అద్దాలు.గతంలో 12 . జీఎస్టీ ఉండగా ఇప్పుడు 5 రావడంతో7 వరకు పొదుపు అవుతుందన్నారు. మెడికల్ థర్మామీటర్/మెడికల్ అనాలసిస్ పరికరాలు.గతంలో 18 ఉండగా ఇప్పుడు 5 రావడంతో13 వరకు పొదుపు లభిస్తుందన్నారు. ఇదేవిధంగా36 రకాల ప్రాణ రక్షక, కాన్సర్, అరుదైన వ్యాధుల మందుల పై పన్నులు.గతంలో 12 జిఎస్టి ఉండగాఇప్పుడు 0 తగ్గించడంతో 12 వరకు పొదుపు లభించిందన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ఆరోగ్యం విషయం లో ప్రజా ప్రభుత్వం తీసుకున్న సాహసో పేత నిర్ణయం అని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. పెదనందిపాడు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంవైద్యాధికారులు డాక్టర్ ఎస్. నంద కుమార్ డాక్టర్ బి. ప్రియంవద లు మాట్లాడుతూ సూపర్ జిఎస్టి . సూపర్ సేవింగ్స్ వల్ల పేదలకు మరింత అందుబాటులో వైద్యసేవ లు ఉండి ప్రజలకు ఆర్థిక ఆసరా మరియు వెసులు బాటు కలుగుతుంది అన్నారు. ఈకార్యక్రమం నందు సి హెచ్ ఓ ఎస్ ఆర్. ప్రసాద స్వామి, ఎంపీహెచ్ఎస్ పి. అరుంధతి, ఈ చెన్నయ్య, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి. ఆశా కార్యకర్తలు, సిరి క్లినికల్ రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ శివరాం ప్రసాద్‌కు అభినందన



పెదనందిపాడు అక్టోబర్ 9 (ప్రభాతవార్త): పెదనందిపాడు మండలం పూసులూరు గ్రామానికి చెందిన పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థి, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ఎమ్.బి.ఏ, ఇంటిగ్రేటెడ్ ఎమ్.బి.ఏ మరియు కామర్స్ డిపార్ట్మెంట్స్ కి శాఖాదిపతి గా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ ఆర్. శివరాం ప్రసాద్ ఇటీవల రెక్టార్( ప్రో వైస్ ఛాన్సలర్ ) గా నియమితులైనారు. ఈ నేపథ్యంలో పెదనందిపాడు పి.ఏ.యస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జి వీర రాఘవయ్య, ఎన్. సి. సి ఆఫీసర్ డాక్టర్. పి శ్రీనివాస్, ఆఫీస్ సభార్డినేట్ ఏ. సుజిత్ బాబు లు. గురువారం ప్రొఫెసర్ ఆర్. శివరాం ప్రసాదును.యూనివర్సిటీలోమర్యాద పూర్వకముగా కలిసి వారిని సత్కరించి కళాశాల తరుపున మరియు పాలక వర్గం తరుపున శుభాభినందనలు తెలియ చేసినారు.

## మేలు జాతి దూడల ప్రదర్శన రైతులకు బహుమతులు

ప్రత్తిపాడు, అక్టోబర్ 9, ప్రభాతవార్త: ప్రత్తిపాడు మండలంలోని నడింపాలెం లో గురువారం. గుంటూరు పశుసంవర్ధక శాఖ మరియు పశుగణాభివృద్ధి సంస్థ ల సహకారంతో మేలు జాతి దూడల



ప్రదర్శన నిర్వహిం చారు. ఈ కార్యక్రమాన్ని తొలుత గుంటూరు జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె వి వి సత్య నారాయణ ప్రారం భించారు. ఈ కార్యక్ర మంలో గుంటూరు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టీ శంకర్రావు. పత్తిపాడు మండల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుగుణ్యారావు. చల్లా వారి పాలెం. వంగిపురం .పశు వైద్యులు డాక్టర్ వై ఈశ్వర్ రెడ్డి. డాక్టర్ సి హెచ్ హరీష్ కన్నా. డాక్టర్ కె వి ఎస్ నందకిషోర్ లు పాల్గొని మాట్లాడుతూ రైతులు దూడలలో సరైన ఎదుగుదలను. తీసుకోవాల్సిన జాగ్రత్తలను యాజమాన్య పద్ధతులు. మరియు లింగ నిర్ధారిత వీర్యం వలన కలిగే లాభాలు గురించి వివరించారు. అనంతరం అందమైన దూడల యజమానులకు బహుమతులు అందజేశారు.

కెనరా బ్యాంక్ Canara Bank
సిండికేట్ Syndicate
ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీస్, డి.నెం.54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ - 520008, ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 8331011695, ఇ-మెయిల్ : armvij@canarabank.com

**ఋణగ్రహీత / హామీదారు / తనఖాదారులకు సెక్షన్ 13 (8) క్రింద**
**REDEMPTION NOTICE**

టు :
ఋణగ్రహీత/హామీదారులు/తనఖాదారు పేరు & చిరునామా: మెస్సర్స్ హర్షిత కాటన్ ట్రేడర్స్, ప్రొప్రయిటర్ : శ్రీ నల్లూరి సుబ్బారావు, డోర్ నెం.1-74, కొర్నెపాడు పోస్ట్, ప్రత్తిపాడు మండలం, గుంటూరు జిల్లా - 522019. శ్రీ నల్లూరి సుబ్బారావు, తండ్రి : శివ రామయ్య, ఫ్లాట్ నెం.416, 3వ అంతస్తు, సత్య కంఫర్ట్స్ అపార్ట్‌మెంట్స్, ద్వారకా నగర్, 9వ లైన్, కొరిటెపాడు, గుంటూరు - 522007, శ్రీ నల్లూరి శివ రామయ్య, తండ్రి : వెంకటప్పయ్య, ఇ.నెం.17, కొండెపాడు గ్రామం, ప్రత్తిపాడు మండలం, గుంటూరు జిల్లా - 522019. శ్రీమతి నల్లూరి భారతి, భర్త : నల్లూరి సుబ్బారావు, ఫ్లాట్ నెం.416, 3వ అంతస్తు, సత్య కంఫర్ట్స్ అపార్ట్‌మెంట్, ద్వారకా నగర్, 9వ లైన్, కొరిటెపాడు, గుంటూరు - 522007.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని రూల్ 8 (6) తో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసు (ఇక మీదట "చట్టం" గా రిఫర్ చేయబడును).

కెనరా బ్యాంక్, ఎఆర్ఎమ్ బ్రాంచ్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్"గా రిఫర్ చేయబడును), సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇకపై "ది యాక్ట్" గా రిఫర్ చేయబడును) లోని రూల్ 8 (6) తో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీత/ సంస్థ మెస్సర్స్ హర్షిత కాటన్ ట్రేడర్స్, తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) వారిని బకాయి రూ.1,48,48,868/- (అక్షరాల ఒక కోటి నలభై ఎనిమిది లక్షల నలభై ఎనిమిది వేల ఎనిమిది వందల అరవై ఎనిమిది రూపాయలు మాత్రమే) + వడ్డీతో కలిపి మెస్సర్స్ హర్షిత కాటన్ ట్రేడర్స్ వారి లోను ఖాతా యొక్క బకాయి నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా కోరుతూ కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి చట్టంలోని సెక్షన్ 13 (2) క్రింద 04.03.2022 తేదీన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఋణగ్రహీతలు/సంస్థ, తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి తేది.30.05.2022న మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక/భౌతికంగా స్వాధీనం తీసుకున్నారు మరియు చట్ట ప్రకారం సదరు లాంఛనాత్మక/భౌతిక స్వాధీనత నోటీసును రెండు స్థానిక వార్తా పత్రికలలో తేది.02.06.2022న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది.30.09.2025 నాటికి చెల్లించవలసిన బకాయి రూ.2,49,04,049.41 పై (అక్షరాల రెండు కోట్ల నలభై తొమ్మిది లక్షల నాలుగు వేల నలభై తొమ్మిది రూపాయల నలభై ఒక్క పైసలు మాత్రమే) + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002 నందలి రూల్ 8(6) క్రింద ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది. (ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు వారి నుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారి నుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజల నుండి టెండరు ఆహ్వానించుట లేదా (సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటీ. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

**తనఖా పెట్టిన స్థిరాస్తి వివరములు**

1. గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు మండలం, కొండెపాడు గ్రామ పంచాయితీ, డోర్ నెం.1-74, డి.నెం.50/బి వద్ద 121.50 చ॥గ॥ల విస్తీర్ణంలో ఆర్‌సిసి రూఫ్డ్ క్రింది అంతస్తుతో కూడిన నివాస భవనమునకు **హద్దులు : తూర్పు:** ఎన్. శ్రీనివాసరావు గారి "సి" షెడ్యూలు ఆస్తి - 27'-0", **దక్షిణం :** జె. వెంకటేశ్వర్లు గారికి చెందిన ఆస్తి - 40'-6", **పడమర :** జె. వెంకటేశ్వర్లు గారికి చెందిన ఆస్తి - 27'-0", **ఉత్తరం :** ఎన్. వెంకటేశ్వర్లు గారికి చెందిన ఆస్తి - 40'-06".
**టైటిల్ హోల్డర్ : శ్రీ నల్లూరి శివ రామయ్య, తండ్రి : వెంకటప్పయ్య.**

2. గుంటూరు, కొరిటెపాడు, ద్వారకా నగర్, డి.నెం.152/2 వద్ద 39.804 చ॥గ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా స్థల విస్తీర్ణంతో గల సత్య కంఫర్ట్స్ అపార్ట్‌మెంట్ మూడవ అంతస్తు నందు 1000 చ॥అ॥ల ఫ్లింత్ ఏరియాతో గల నివాస ఫ్లాట్ నెం.416. **హద్దులు : తూర్పు:** రోడ్డు - 205'-00", **దక్షిణం :** మున్సిపల్ కార్పొరేషన్ పార్క్‌కు చెందిన ఆస్తి - 133'-06", **పడమర :** సూరబోయిన జూడత్, చెరుకూరి మల్లిఖార్జున రావు, మందల రాణి & ఇతరులకు చెందిన ఆస్తి - 210'-00", **ఉత్తరం :** మదమంచి అరుణ & ఇతరులకు చెందిన ఆస్తి - 136'-06". **ఫ్లాట్ నెం.416కు హద్దులు : తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర :** కామన్ కారిడార్, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై
**టైటిల్ హోల్డర్ : శ్రీ నల్లూరి సుబ్బారావు, తండ్రి : శివ రామయ్య.**

తేది : 07-10-2025, స్థలం : విజయవాడ    సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

# పర్యటనల పేరుతో అల్లర్లు చేయటమే జగన్‌కు తెలిసిన విద్య: ఎమ్మెల్యే ఆనంద్‌బాబు

గుంటూరు–ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 9: పేదలకు మంచి చేయాలని కూటమి ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా అడ్డుకోవడం జగన్ రెడ్డికి పరిపాటిగా మారిందని పోలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు మండిపడ్డారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక వీడియోను విడుదల చేశారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు నిర్మిస్తే తప్పేంటని స్వయంగా న్యాయస్థానాలే చెబుతున్నా... ఈ అజ్ఞాని జగన్ కు చెవికెక్కడం లేదని విమర్శలు చేశారు. ప్రభుత్వం



వద్ద నిధులు లేనప్పుడు పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు నిర్మిస్తే తప్పేంటని ప్రశ్నించారు. అల్లర్లు, అలజడులు సృష్టించడం కోసం జగన్మోహన్ రెడ్డి నర్సీపట్నం పర్యటన చేస్తున్నారు. సిగ్గు లజ్జా లేని వ్యక్తి జగన్. మెడికల్ కాలేజీల గురించి మాట్లాడే అర్హత లేని వ్యక్తి జగన్. కరోనా సమయంలో వేలాది మందిని చంపేశాడు. లక్షలాది మందికి సరైన వైద్య సౌకర్యాలు కూడా కల్పించలేదు. మాస్కులు అడిగితే పిచ్చోడని చెప్పి ముద్రేసి డా.సుధాకర్ ను చంపేశాడు. ఐదేళ్ల పాలనలో నువ్వేమి వెలగబెట్టావని చూడటానికి పోతున్నావ్ జగన్ రెడ్డి. కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు నాయకత్వంలో పేద వాడికి ప్రపంచ స్థాయి సౌకర్యాలతో కూడి వైద్యం విద్యాను అందించాలని, ఉచితంగా పేద పిల్లలకు మెడికల్ సీట్లు ఇవ్వాలన్న సంకల్పంతో ప్రభుత్వం పీపీపీ విధానానికి వెళ్తుంటే దానిపై విమర్శలు చేస్తున్నావు. పీపీపీ విధానంతో ప్రో పూర్ పాలసీతో మెడికల్ కాలేజీలను వేగవంతంగా నిర్మించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే దాన్ని అడ్డుకుంటున్నాడు. జగన్మోహన్ రెడ్డి ఇకనైనా సిగ్గుమాలిన రాజకీయాలు మానుకోవాలన్నారు. అభివృద్ధి సంక్షేమమే అజెండాగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వంపై కావాలనే అల్లర్లు, అలజడులు సృష్టిస్తున్నారని, తప్పుడు ప్రచారాలతో కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నావని అన్నారు. ప్రజలు నీ జిత్తులమారి పర్యటనలను నమ్మేందుకు సిద్దంగా లేరు. ఐదేళ్ల రాక్షస పాలన అంతం అయ్యే ప్రజలు నేడు స్వేచ్ఛగా ఉన్నారని, ఇలాంటి పర్యటనల పేరుతో ఇంకా ప్రజలను హింసించాలని చూస్తున్నావన్నారు. . జగన్ రెడ్డి చర్యలు ఇలాగే కొనసాగితే ప్రజలే నిన్ను తరిమికొడతారని,. పీపీపీ విధానంతో పేద విద్యార్థులు డాక్టర్లు అవ్వాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

## అట్లతద్ది పండుగ వేడుకలు



పెదకూరపాడు, అక్టోబరు 9 ప్రభాతవార్త : మండలంలో అట్లతద్ది పండుగ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామాలలో అనాదిగా వస్తున్న ఈ సాంప్రదాయాన్ని గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. తెల్లవారుజామునే మహిళా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి అట్లతద్ది ఆరు అట్లు ముద్ద పప్పు మూడు అట్లు అంటూ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో ఈ కార్యక్రమాలు జరిగాయి.

## నేటి నుండి రెండురోజుల పాటు కెఎల్‌యులో సమ్యక్ 2025-జాతీయస్థాయి సాంకేతిక సదస్సు

తాడేపల్లి,అక్టోబర్ 9,ప్రభాతవార్త : విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించే లక్ష్యంతో కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ప్రతిఏటా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయస్థాయి సాంకేతిక ఉత్సవం సమ్యక్ వేడుకలను వడ్డేశ్వరంలోని గ్రీన్ ఫీల్డ్ క్యాంపస్‌లో ఈనెల 10,11రెండు రోజులపాటు జరుగుతాయని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారధి వర్మ అన్నారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపి స్పోర్ట్స్ అథార్టి చైర్మన్ అనిమిని రవినాయుడు,విశిష్ట అతిథులుగా ఫెనామ్



ఇంక్ హెచ్ఆర్ టిఏ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ పిండి,వ్యవస్థాపకులు చలనచిత్ర నిర్మాత కోనేరు నిఖిల కార్తికేయన్ లు హాజరుకానున్నారు ఈ సందర్భంగా విసి డాక్టర్ పార్థసారధి వర్మ మాట్లాడుతూ ఈ సాంకేతిక సదస్సుకు దేశవ్యాప్తంగా 23రాష్ట్రాల నుంచి ఆయా కళాశాలలు,యూనివర్సిటీలకు చెందిన సుమారు 25వేలకు పైగా విద్యార్థులు ఈ సాంకేతిక సదస్సుకు హాజరై ఆవిష్కరణలు,పరిశోధనలు,పరిశ్రమల విద్యాసహకార పండుగను జరుపుకోనున్నారు.సమ్యక్ 2025 చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ మాట్లాడుతూ ప్రదర్శనలో 450కి పైగా విద్యార్థులు ప్రాజెక్టులు అత్యాధునిక ఆవిష్కరణలు,పరిశోధనలను ప్రదర్శించే వాస్తవ ప్రపంచ నమూనాలను ప్రదర్శించనున్నారన్నారు. కార్యక్రమంలో విసి డాక్టర్ జి.పార్థసారధి వర్మ,సమ్మక్2025 చైర్మన్లు స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్,ఆర్ అండ్ డి డీన్ డాక్టర్ బిటిపి మాధవ్,సమ్యక్ 2025 కన్వీనర్లు ప్రిన్సిపాల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ వి.రాజేష్,ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు,ఎఫ్ఈడి ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కెఎల్‌యులో ఫ్లెక్సిబుల్ ఎలక్ట్రానిక్స్ ఎక్స్‌లెన్స్ సెంటర్ ప్రారంభం

తాడేపల్లి,అక్టోబర్ 9,ప్రభాతవార్త : భారతదేశంలో ప్రముఖ పరిశోధనా ప్రదాన విశ్వవిద్యాలయంలో ఒకటైన కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని ఈసిఈ విభాగంలోని ఫ్లెక్సిబుల్ ఎలక్ట్రానిక్స్ లాబోరేటరీ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఫ్లెక్సిబుల్ ఎలక్ట్రానిక్స్ గా అప్‌గ్రేడ్‌చేసినట్లు



విసి డాక్టర్ జి.పార్థసారధి వర్మ ప్రకటించారు.ఇది కెఎల్‌యు,మలేషియాలోని యూనివర్సిటీ మలయా,కౌలాలంపూర్ మధ్యగల దీర్ఘకాలిక అకడమిక్ భాగస్వామ్యానికి కొత్త దశగా నిలిచిందన్నారు.ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ప్రారంభోత్సవం వడ్డేశ్వరం క్యాంపస్‌లో ఘనంగా జరిగింది.సెంటర్‌ను మలేషియా క్యాంపస్ జనరల్ శరవణకుమార్ కుమారసనగం ప్రారంభించారు.యూనివర్సిటీ ఆఫ్ మలయా నుండి ఆచార్య డాక్టర్ వాన్ హలిజా బింటి అబ్,ప్రధాన అతిథిగా ఎల్.ఎంఆర్టీ హెడ్ మజీద్,గౌరవాతిథిగా అసోసియేట్ ప్రొఫెసర్ థమిళ్‌సెల్వి వెలాయుధం హాజరయ్యారు.ఇందు వర్సిటీ సీనియర్ అకడమిక్ లీడర్స్ నాయకుల సమక్షంలో కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా నిలిచింది.కెఎల్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ఆర్.కోనేరులక్ష్మణ్ హవిష్ మాట్లాడుతూ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ స్థాపన తమ విశ్వవిద్యాలయ గ్లోబల్ రీసెర్చ్ ఇంటిగ్రేషన్,ఇన్నోవేషన్ ఆధారిత విద్యపై ఉన్న కట్టుబాటును ప్రతిబింబిస్తుందన్నారు.


## ఆంజనేయకాలనీలో ఘనంగా అట్లతద్ది వేడుకలు



తాడేపల్లి, అక్టోబర్ 9,ప్రభాతవార్త : అట్లతద్ది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళగిరి డాక్టర్ ఆంజనేయ కాలనీ బోరింగ్ పంపు సెంటర్ వద్ద "శ్రీసీతారామ భక్త సమాజం"నిర్వాహకులు గుత్తి కొండ ధనుంజయ రావు,వంగర లక్ష్మయ్య, గద్దె శ్రీమన్నారాయణ, తిరువీదుల అరుణబాబు,తాటి సాంబశివరావు,జంజనం వీరులు,తాటి సుబ్బారావు తదితరుల ఆధ్వర్యంలో ఉయ్యాల ఏర్పాటు చేయడంతో మహిళలు పెద్దసంఖ్యలో విచ్చేసి ఉయ్యాల ఊగి తమ సంతోషాన్ని వ్యక్తంచేశారు.మంగళగిరిలో గతంలో ప్రతి వీధిలో అట్లతద్ది పండుగ ఉయ్యాలలతోకళకళ వీధులన్నీ మహిళలతో నిండిపోయేవి.నేడు ఒక్క ఆంజనేయకాలనీలో మాత్రమే ఒకే ఒక్క ఉయ్యాల కావడంతో చాలా సుదూర ప్రాంతాల నుండి మహిళలు వచ్చి ఉయ్యాల లూగుతుండడంతో ఉయ్యాల ఏర్పాటు చేసి శ్రీసీతారామ భక్త సమాజం నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు.

## సక్రమంగా పొదుపు చేసుకోండి...అధిక రుణం పొందండి

### - డీఆర్‌డిఏ ఏపిఎం రమాదేవి



కొల్లిపర,అక్టోబరు 9 ప్రభాతవార్త: డ్వాక్రా సంఘాలు బ్యాంకులలో సక్రమంగా పొదుపు చేసుకుంటే అధిక రుణం పొందటానికి అవకాశం ఉంటుందని డీఆర్‌డిఏ ఏపిఎం రమాదేవి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర స్త్రీశక్తిభవనంలో డ్వాక్రా మహిళలతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలు ప్రతి నెలా సక్రమంగా సమావేశాలు నిర్వహించటం వలన సంఘం మరింత బలోపేతం అవుతుందన్నారు.బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలన్నారు.డ్వాక్రా గ్రూపు సభ్యులు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే రుణాలను వినియోగించాలన్నారు.సమావేశంలో సీసీలు విజయకుమార్,మధు,పూర్ణయ్య,ఎమ్ఎస్ఏ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలోని ఆర్ అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు రూ.9 కోట్ల కేటాయింపు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, అక్టోబర్ 9, ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమంతో పాటు.. ప్రజలకు అవసరమైన కనీస వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, చంద్రబాబు నాయకత్వంలో సంక్షేమం.. అభివృద్ధి కలగలసిన సుపరిపాలనతో ప్రజలు సంతోషంగా ఉన్నారని మాజీమంత్రి,



శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఆర్థిక సమస్యలు వేధిస్తున్నా కూడా ప్రజలకు ఇబ్బంది కలగడకూడదన్న సదుద్దేశంతోనే వర్షాలకు దెబ్బతిన్న ఆర్ బీ రోడ్ల మరమ్మతులు, ప్యాచ్ వర్క్ లకు ప్రభుత్వం సకాలంలో నిధులు కేటాయించిందన్నారు. నియోజకవర్గంలోని రోడ్ల మరమ్మతులు, ప్యాచ్ వర్క్ ల నిమిత్తం ప్రభుత్వం రూ.9 కోట్లు మంజూరు చేయడంపై ప్రత్తిపాటి పుల్లారావు హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల మరమ్మతులకు బుధవారం ప్రభుత్వం రూ.వెయ్యికోట్లు విడుదల చేసిందని, దానిలో భాగంగా నియోజకవర్గంలోని మూడు ప్రధాన రోడ్ల మరమ్మతులకు రూ.9 కోట్లు కేటాయించారని ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దింతెనపాడు – సాతులూరు ఆర్ బీ రోడ్డు మరమ్మతులకు రూ.5 కోట్లు, చిలకలూరిపేటలోని టిడ్కో గృహాల సమీపం నుంచి కమ్మవారిపాలెం, కట్టుబడివారిపాలెం మీదుగా యూటీ కూడలి వరకు ఉన్న రోడ్డు మరమ్మతులు, వీ.ఎన్.పీ రోడ్డు నుంచి గణపవరం మీదుగా వేలూరు వరకు ఉన్న రోడ్డు మరమ్మతులకు మరో రూ.4 కోట్లు కేటాయించినట్టు ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల విజ్ఞప్తులపై స్పందించి రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు నియోజకవర్గ ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్టు ఆయన చెప్పారు.

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నం హేయమైన చర్య కాంగ్రెస్ పార్టీ నిరసన

మంగళగిరి, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై ఇటీవల జరిగిన మతోన్మాదుల దాడిని కాంగ్రెస్ పార్టీ నేతలు ఖండించారు. మంగళగిరి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడికొండ వెంకటేశ్వరరావు, గుంటూరు జిల్లా పార్లమెంట్ ఇంచార్జ్ శ్రీపతి ప్రకాష్, జిల్లా అధ్యక్షుడు చిలక విజయ్ కుమార్ నియోజకవర్గ ఇన్చార్జ్ షేక్ సలీం




మాట్లాడుతూ, "సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడారనే పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై చెప్పు విసరడానికి ప్రయత్నించిన న్యాయవాది కిషోర్ పై తక్షణమే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి" అని వారు డిమాండ్ చేశారు... ఇటీవల మతోన్మాద శక్తులు ఆగ్రహావేశాలతో రాజ్యాంగ వ్యవస్థపై దాడులకు దిగుతున్నాయి. ఈ పరిస్థితి ప్రజాస్వామ్యానికి భయంకర ముప్పు అని చెప్పారు. దళితులు, మైనార్టీలను లక్ష్యంగా చేసుకున్న మతోన్మాదులు ఇప్పుడు నేరుగా సుప్రీంకోర్టునే ప్రశ్నిస్తున్నారని, ఇది దేశ ప్రజలందరికీ హెచ్చరిక అని పేర్కొన్నారు.నేతలు భారత రాజ్యాంగాన్ని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, సనాతన ధర్మవాదుల అహంకారాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఈ రకమైన దాడులు పెరిగాయని వారు విమర్శించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం అంటే రాజ్యాంగంపై దాడి చేసినట్లేనని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తి అధికారంలో ఉంటే ఈ విధంగానే స్పందించేవారా అని ప్రశ్నించారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను తిలోదకలిస్తూ, ప్రజల ఓట్లను దోచి మూడోసారి అధికారంలోకి రావడం మానవీయ, రాజ్యాంగపరంగా నికరించారు..ఓటర్ల జాబితాలో అనేక అవాస్తవ ఓట్లను చేర్పించి, ఉన్నవాటిని తొలగించడం ద్వారా బిజెపి ఓట్ చోరీకి పాల్పడిందని వారు విమర్శించారు. ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త సంతకాల సేకరణ ఉద్యమాన్ని తలపెట్టిందని అందరూ మద్దతు తెలిపి జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. సంతకాల సేకరణ కోసం పట్టణంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ షేక్ సలీం, జిల్లా కాపు సంఘం చైర్మన్ రమ్మీశెట్టి హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పరిసరాలలోనే కూరగాయలు పండించుకోవాలి

కొల్లూరు, అక్టోబరు 9 (ప్రభాతవార్త) : ఇంటి పరిసరాలలోనే ప్రజలందరూ కూరగాయలను పండించుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తల ఆదిలక్ష్మి అన్నారు. గురువారం కొల్లూరు గౌడ్‌పాలెం



అంగన్‌వాడీ కేంద్రంలో 8వ జాతీయ పోషక కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు తల్లులకు పోషకాహార విలువలపై ఆదిలక్ష్మి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆదిలక్ష్మి మాట్లాడుతూ రసాయనిక ఎరువులు వాడకం లేని కూరగాయలు ఆకుకూరలను సేంద్రీయ పద్ధతిలో అంగన్‌వాడీ కేంద్రాల సహకారంతో ప్రతి ఒక్కరూ ఇంటి వద్దనే పండించుకోవాలన్నారు. ఆకుకూ రలు, కూరగాయలను పండించుకోవడం వలన కుటుంబానికి కూరగాయలు ఖర్చు తగ్గడమే కాకుండా ఆరోగ్యకరమైన ఉత్పత్తులను కూడా పొందవచ్చు అన్నారు. గర్భవతులు ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకుంటూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషక పదార్థాలను తప్పక తీసుకుని వాడుకోవాలని అన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజలందరూ బాగస్వాములు కావాలన్నారు. పిల్లలను క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్ర పరిసరాలలో పోషణలో భాగంగా పండించిన తోటకూర, గోంగూరలను గర్భవతులకు తల్లులకు అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదిలక్ష్మి పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గర్భవతులు పాల్గొన్నారు.

## క్రాప గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మైనేని మురళీకృష్ణ, వేమూరు సిఐ

కొల్లూరు, అక్టోబరు 9 (ప్రభాతవార్త) : మండల పరిధిలోని క్రాప గ్రామంలో గురువారం కీర్తి శేషులు తలశిల సీతారాంబాబు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం నందు గ్రూఫ్ హాస్పిటల్ విజయవాడ మాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి హాస్పిటల్ హెచ్‌సిజి క్యాన్సర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత వైదయ శిబిరంను ప్రారంభించిన కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ,




వేమూరు పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పసుపులేటి వీరాంజనే యులు, కొల్లూరు పోలీస్ స్టేషన్ ఎస్సై జానకి అమర్వర్ధన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ నిరుపేదల ఆరోగ్యానికి ఉచిత మెగా వైద్య శిబిరాలు దోహదపడతాయని ఆయన అన్నారు. ఈ శిబిరం నందు గుండె వైద్య నిపుణులు, నరాలు మరియు వెన్నెముక శాస్త్ర చికిత్స వైద్య నిపుణులు స్త్రీలు మరియు పిల్లల వైద్య నిపుణులు ఈ వైద్య సేవలో పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. దీనిలో 500మంది రోగులు పాల్గొని వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మునిమ్మ, తెలుగుదేశం పార్టీ పిఏసిఎస్ సొసైటీ బ్యాంక్ క్రాప చైర్మన్ కోగంటి హరిబాబు, కోపల్లె సత్యనారాయణ, పరంజ్యోతి, వైద్య సిబ్బంది, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గించటంతో సామాన్యలకు భారం ఉండదు: ఎంపీడీఓ విజయలక్ష్మి



కొల్లిపర,అక్టోబరు 9 ప్రభాతవార్త: జీఎస్టీ తగ్గించినందున సామాన్య ప్రజలకు ఎటువంటి భారం పడదని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు.గురువారం మండల పరిధిలోని మున్నంగి గ్రామంలో వైద్యాధికారులు,వివిధ శాఖాధికారులు సూపర్ జీఎస్టీపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు జీఎస్టీపై అవగాహన కలిగించారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఏ వస్తువు కొనుగోలు చేసినా తగ్గింపు ధరకు వస్తుందన్నారు.సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్‌తో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణి,వైద్యాధికారులు సుప్రియ,మణికంఠ,మాధురిలత,ఆరోగ్య సిబ్బంది సువర్ణకుమారి,ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# చక్రధర్ డిగ్రీ కళాశాలలో జీఎస్టీపై అవగాహన సదస్సు



మాచర్ల, అక్టోబరు 9 ప్రభాతవార్త: స్థానిక చక్రధర్ డిగ్రీ కళాశాలలో జీఎస్టీ అవేర్‌నెస్ సెమినార్ కార్యక్రమం గురువారం జరిగింది. ట్రేడర్ తుమ్మేపల్లి సాంబశివరావు, సీనియర్ కామర్స్ లెక్చరర్ చెక్క గురవయ్య విద్యార్థులకు జీఎస్టీ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.సాయి మార్కొండారెడ్డి, డైరెక్టర్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులు పి.ఆదర్శ్, దేవి, లక్ష్మానారాయ్, కౌశిక్‌నాయక్, ఎస్‌కే సమీరా, వెంకట నరసింహారావు, ఎం.జూబెల్, శ్రావణ లక్ష్మిలకు బహుమతులు అందజేశారు.

## దైవ సేవకుల నూతన కమిటీ ఎంపిక

మాచర్ల, అక్టోబరు 9 ప్రభాతవార్త: పల్నాడు దైవ సేవకుల సహవాసం ఆధ్వర్యంలో పట్టణంలోని చెన్నకేశవ కాలనీలో హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చిలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నూతన వర్కింగ్ కమిటీ ఎంపిక చేసినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు జాన్‌వెస్లీ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాస్టర్ రాజారావు హాజరవగా, వ్యవస్థాపక ఉపాధ్యక్షులు



ఎలీషా దైవసేవకులకు సందేశం అందించారు. నూతన కమిటీలో అధ్యక్షునిగా మోహన్‌బాబు, ఉపాధ్యక్షుడు సుందరరావు, కార్యదర్శి జాషువా, ట్రెజరర్ లాజరు, సహాయ కార్యదర్శి డేవిడ్‌రాజు, కార్యనిర్వాహక సభ్యులుగా సిలువరాణి, పీటర్‌పాల్ ఎన్నికైనట్లు కోర్ కమిటీ ప్రకటించింది. నూతన కమిటీకి సభ్యులందరూ అభినందనలు తెలిపారు. రానున్న కాలంలో పల్నాడు ప్రాంత ఆత్మీయ అభివృద్ధికి దోహదపడతామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాస్టర్ రమేష్‌తోపాటు నియోజకవర్గానికి చెందిన పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలో జీఎస్టీపై అవగాహన సదస్సు



కారంపూడి, అక్టోబరు 9 ప్రభాతవార్త: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డా॥ సీహెచ్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ మందులు, ప్రాణ రక్షక మందులు, టెస్టింగ్ కిట్లు వంటి వాటిపై 12 శాతం నుంచి 5 శాతానికి జీఎస్టీ తగ్గిందన్నారు. వైద్యఆక్సిజన్ 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గిందని తెలియజేశారు. శెట్టి హనుమంతరావు మాట్లాడుతూ హెల్త్ ఇన్సూరెన్సు పాలసీలలో వార్షిక ప్రీమియం 11,800 నుంచి 10 వేల వరకు తగ్గిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి సరస్వతి బాలునాయక్, బీజేపీ నాయకులు శెట్టి హనుమంతరావు, మెడికల్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు శ్రీనివాసరావు, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ కె.సుబ్బారావు, సూపర్‌వైజర్ కె.మల్లయ్య, లాలునాయక్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో 25 మంది గర్భిణులకు రక్తపరీక్షలు, మూత్రపరీక్షలు, షుగర్ పరీక్షలు నిర్వహించి చికిత్స చేశారు.

## సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అన్నదానం

వేమూరు, అక్టోబర్ 9, ప్రభాతవార్త: పేద వర్గాలను ఆదుకునేందుకు రాయల్ ఇండస్ట్రీస్ అధినేత పాముల అనిల్ చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ జరీనా పర్వీన్ పేర్కొన్నారు. గురువారం పాముల అనిల్ తనయుడు పాముల భవిష్ రాయల్ పుట్టినరోజు పురస్కరించుకుని వేమూరు



సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి జరీనా పర్వీన్ మాట్లాడుతూ పాముల అనిల్ తన సంస్థ ద్వారా ఈ ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని గతంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులు కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేయటం జరిగిందని, వేసవిలో ఆరోగ్య కేంద్రం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి అనేక మంది దాహార్తిని తీర్చినట్టు గుర్తు చేసుకున్నారు. అదే రీతిలో తన కుమారుని పుట్టినరోజులు పురస్కరించుకుని ప్రతి బుధవారం రోగులకు గర్భిణీ స్త్రీలకు నిరంతరం అన్నదాన కార్యక్రమం చేసేందుకు చర్యలు తీసుకోవడం సంతోషదాయకమన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించే విధంగా పాముల అనిల్ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. రాయల్ ఇండస్ట్రీస్ అధినేత పాముల అనిల్ మాట్లాడుతూ సామాజిక దృక్పథంతో తనకున్నంతలో పేద వర్గాలను ఆదుకునేందుకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ సుశీల, ఎంపీడీవో పి.రవికుమార్, దళిత నాయకుడు బుస్సా నాగరాజు, సామాజిక కార్యకర్త అనే సుశీల, ఏపిఎం శోభన్, ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి పట్ల రోగులకు అవగాహన కల్పించాలి



వేమూరు, అక్టోబర్ 9, ప్రభాతవార్త:కుష్టు వ్యాధి రోగులకు వ్యాధి పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా లెప్రసీ అధికారి కృష్ణారెడ్డి తెలియజేశారు. గురువారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు సిబ్బందికి లెప్రసీ వ్యాధి పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ జరీనా పర్వీన్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధిని ముందుగానే గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. కొందరు రోగులకు వ్యాధిపై అవగాహన లేకుండా ఉండుట వల్ల వ్యాధిని ముందుగానే గుర్తించలేకపోతున్నారన్నారు. వ్యాధిని ముందుగానే గుర్తించలేకపోతున్నారన్నారు. వ్యాధిని ముందుగా గుర్తించినట్లయితే నివారణ సులువుగా జరుగుతుందని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధి గుర్తించే విధానంపై వైద్యులకు అవగాహన కల్పించారు. సమావేశంలో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సిబ్బంది ఉన్నారు.

## వైకాపా గ్రామ కమిటీల నియామకాన్ని పూర్తి చేయాలి

వేమూరు, అక్టోబర్ 9, ప్రభాతవార్త: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు పార్టీని గ్రామస్థాయిలో పునర్నిర్మాణం చేసుకునేందుకు గ్రామ పార్టీ కార్యవర్గాలను త్వరితగతిన పూర్తి చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు తెలియజేశారు. గురువారం పెరవలి గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వేమూరు నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు దాది సుబ్బారావు



అధ్యక్షతన జరిగిన సమావేశంలో అశోక్‌బాబు మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీ పునర్నిర్మాణం కోసం గ్రామ పార్టీ పరిశీలకులను నియమించడం జరిగిందన్నారు. పార్టీ అధినేత పార్టీ కార్యకర్తల కోసం ఏర్పాటు చేసిన డిజిటల్ బుక్‌లోగును ఆవిష్కరించారు. పార్టీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు గోపాలం రాము, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, గాజుల చిన్నభాను, లంక శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాత్రికేయుడు సురేష్ బాబు స్మారకార్థం అన్నదానం



తెనాలిటౌన్, అక్టోబర్ 9, ప్రభాతవార్త: ఇటీవల అనారోగ్యంతో మరణించిన, పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ పాత్రికేయుడు బచ్చు సురేష్ బాబు జ్ఞాపకార్థంగా, వారి కుటుంబ సభ్యులు మరియు మిత్రుల సహకారంతో, శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవాసమతి అధ్యక్షులు కుర్రా శ్రీను పర్యవేక్షణలో,స్థానిక రైల్వే స్టేషన్ వద్ద నిరాశ్రయులు, పేదలు,వికలాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా సురేష్ బాబుతో తమకు ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు.పట్టణంలో సీనియర్ పత్రికేయులుగా పనిచేస్తూ,సమస్యలకు తక్షణమే స్పందించే తత్వం కలిగిన వ్యక్తిగా,అందరికీ నిజమైన స్నేహాన్ని పంచుతూ, వృత్తిలో రాణిస్తూ, అందరి మన్ననలను పొందిన సురేష్ బాబు మృతి చెందటం బాధాకరమన్నారు.ఈ సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్ బాబు కుటుంబ సభ్యులు మరియు మిత్రులు కటారి సత్యం,షేక్ మోలాలి, మేడ కృష్ణ మరియు సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాలలో దొంగతనాలకు పాల్పడిన నిందితుని అరెస్ట్

## -రూ.8లక్షల విలువైన సొత్తు స్వాధీనం
## -సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల,అక్టోబర్ 9,ప్రభాతవార్త: రెండు తెలుగు రాష్ట్రాలలో దొంగతనాలకు పాల్పడిన ముద్దాయిని అరెస్ట్ చేసి రూ.8 లక్షల విలువ గల దొంగిలించిన సొత్తు స్వాధీనంచేసుకున్నామని సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్ తెలిపారు. మండల పరిధిలోని వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్లో గురువారం సాయంత్రం జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు ముద్దాయి అరెస్ట్ కు సంబందించిన వివరాలను విలేకరుల సమావేశంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్ గారు వెల్లడించారు. ఈ సందర్భంగా సిసిఎస్ డిఎస్పీ జగదీష్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాయడ్లపాడు గ్రామానికి చెందిన



కోడిరెక్క విజయ్ కుమార్తెలుగు రాష్ట్రాలలో గతంలో 8 దొంగతనం కేసులలో రిమాండ్ కాబడిన నిందితుడన్నారు.బాపట్ల జిల్లాలో అద్దంకి, సంతమాగులూరు, మార్టూరు పోలీస్ స్టేషన్ పరిధిలలో వరుసగా 6 ప్రదేశాలలో దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. అద్దంకి, మేదరమెట్ల బైపాస్ రోడ్ జంక్షన్ వద్ద బాపట్ల జిల్లా సిసిఎస్ పోలీస్ అధికారులు నిందితుడిని చాకచక్యంగా అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. బాపట్ల జిల్లా చీరాల సబ్ డివిజన్ లోని అద్దంకి పోలీస్ స్టేషన్ పరిధిలో, బాపట్ల సబ్ డివిజన్ లోని సంతమాగులూరు, మార్టూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పగటిపూట వరుస దొంగతనాలకు జరిగాయి. వరుసగా పగటి పూట దొంగతనాలు జరుగుతుండడంతో జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ కేసుల ఛేదనకు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. బాపట్ల సీసీఎస్ డిఎస్పీ పి.జగదీష్ నాయక్ పర్యవేక్షణలో సీసీఎస్ ఇన్స్పెక్టర్ పి.శ్రీమయ్య నేతృత్వంలో ప్రాప్టీ కేసులను ఛేదించేందుకు పోలీస్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారన్నారు. నేరం జరిగిన ప్రదేశాల పరిధిలోని సిసి కెమెరాలను పరిశీలించి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అత్యంత చాక చక్యంగా వ్యవహరిస్తూ, సరైన నిఘా వ్యవస్థ సమాచారం ద్వారా ముద్దాయిని మధ్యవర్తుల సమక్షంలో అరెస్టు చేసి దొంగలించబడిన చోరీ సొత్తును రికవరి చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ముద్దాయి కోడిరెక్క విజయ్ కుమార్ స్వస్థలం పల్నాడు జిల్లాలోని యడ్లపాడు గ్రామం. ఇతడు బేల్దారి (తాపీ) పని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. దాని ద్వారా వచ్చిన డబ్బులు అతడి వ్యసనాలకు సరిపోకపోవడంతో సులభంగా అధికంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో పగటిపూట తాళాలు వేసి ఉన్న ఇళ్లను ఎంచుకొని దొంగతనాలు చేస్తూ ఉంటాడు. ఇతడు సుమారు గత ఐదు సంవత్సరాల నుంచి ఈరకమైన దొంగతనాలకు పాల్పడుతున్నాడు. గతంలో ఇతడు తెలంగాణ రాష్ట్రంలో 6 చోట్ల, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2 ప్రదేశాలలో మొత్తం 8 చోట్ల దొంగతనాలకు పాల్పడినాడు. 2022 వ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రంలోని చౌటుప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. బెయిల్ పై వచ్చిన అతడు యడ్లపాడు గ్రామంకి వచ్చి తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తూ 2023 వ సంవత్సరంలో చిలకలూరిపేట మరియు యడ్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనానికి పాల్పడినాడు ఆ కేసులలో చిలకలూరిపేట పోలీస్ అధికారులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపినారు. అంతరం బెయిల్ పై వచ్చిన అతడు మరల 2025 సంవత్సరంలో అద్దంకి పోలీస్ స్టేషన్ పరిధిలో అద్దంకి టౌన్ లో, సంతమాగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలలో 2 ప్రదేశాలలో, మార్టూరు పోలీస్ స్టేషన్ పరిధిలలో 3 ప్రదేశాలలో పగటి పూట ఇంటి దొంగతనాలకు పాల్పడినాడు. ఈ మేరకు ముద్దాయి అరెస్టు చేసి రూ.5లక్షల70వేల విలువైన బంగారు అభరణాలు,రూ.30వేల విలువైన వెండి అభరణాలు,రూ.1లక్షా15వేల నగదు,70వేల విలువైన ద్విచక్రవాహనం మొత్తం రూ.8లక్షల విలువైన సొత్తును స్వాదీనం చేసుకున్నామన్నారు. ఈమేరు నిందితుడ్ని చాకచక్యంగా అరెస్టు చేసిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ప్రత్యేకంగా అభినందించారు.సమావేశంలోఅద్దంకి పట్టణ సిఐ ఎ.సుబ్బారావు,సిసిఎస్ఎస్ఐ బి.రాంబాబు,సిసిఎస్ పోలీస్ సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

## శానిటేషన్ పనులను పరిశీలించిన చైర్పర్సన్

తెనాలి మునిసిపాలిటీ, అక్టోబర్ 9, ప్రభాతవార్త: పురపాలక సంఘం పరిధిలోని 14వ వార్డు నందు,గురువారం మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక శానిటేషన్ పనులను



పర్యవేక్షి ంచారు.అనంతరం మెయిన్ డ్రైవ్ మరియు స్పెషల్ శానిటేషన్ వర్క్ పనులను పర్యవేక్షణ చేసి,మునిసిపల్ అధికారులకు,శానిటేషన్ సిబ్బందికి తగు సూచనలు ఇచ్చిన చైర్ పర్సన్ రాధిక.ఈ కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ దాసరి వీరవసంత రావు,మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ముప్వా ఏసుబాబు ,టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సాంబశివరావు, ఇంచార్జి ఏఈ జానీబాషా,శానిటరీ ఇన్స్పెక్టర్ సచివాలయ సిబ్బంది, పురపాలక పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.


## జిఎస్టీ పై అవగాహన సదస్సు

తెనాలిటౌన్, అక్టోబర్ 9, ప్రభాతవార్త:ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన,నూతన పన్ను విధానం జిఎస్టి 2.0 గురించి ప్రజలకు వివరించేందుకు, తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో, అవగాహన సదస్సు నిర్వహించారు.పట్టణంలోని కొత్తపేటలో గల శ్రీ రామకృష్ణ కవి కళాభి కళాక్షేత్రంలో నిర్వహించిన ఈ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, గుంటూరు వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ గీతామాధురి, డిప్యూటీ కమిషనర్లు శ్రీనివాసరావు, మురళీకృష్ణ అలాగే తెనాలి వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ ముత్యాలరావు హాజరయ్యారు.ఈసందర్భంగా శాసనమండలి సభ్యులు ఆలపాటి



రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ,కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణతో, పేద మధ్యతరగతి వర్గాలకు పన్నుల భారం తగ్గటంలో తోడ్పడిందని,జీఎస్టీ భారాన్ని 18!! నుంచి 5!! వరకు తగ్గించటం కేంద్ర ప్రభుత్వం మధ్యతరగతి వర్గాలకు ఇచ్చిన బహుమతి అని, దీనివల్ల కేంద్ర ప్రభుత్వానికి నెలకు 70నుంచి 80వేలకోట్ల రూపాయల ఆదాయం పన్ను రూపంలో నష్టం వస్తుందని, అలాగే మన రాష్ట్రానికి కూడా సుమారుగా 7నుండి 8వేల కోట్లరూపాయలు పన్ను ద్వారా నష్టపోతున్నప్పటికీ,ప్రజల కోసం నష్టాన్ని భరించడానికి సిద్ధంగా ఉందని, అంతేకాకుండా మనం రోజువారి ఉపయోగించే నిత్యవసర సరుకులుగాని, ముఖ్యంగా రోగులకు కావలసిన మందులు,గతంలో 12!! ఉంటే ఇప్పుడు దాన్ని 7!! తగ్గించటం,దుస్తులుకానీ జీవిత బీమా పై గాని,ఈ జీఎస్టీ ప్రభావం ప్రజలకు ఎంతో ఆదా అవుతుందని,సుమారుగా ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 15వేల రూపాయల వరకు ఆదా అవుతుందని, వ్యాపారులకు అమ్మకాల్లో పెరుగుదల వుంటుందని,దానివల్ల ప్రజల ఆర్థిక అభివృద్ధికి దాహదపడుతుందని తద్వారా ప్రజలకు సంక్షేమం అందుతుందని ఆయన వివరించారు.అనంతరం అధికారులు నూతన జిఎస్టి విధానంలోని అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి ఈదర పూర్ణచంద్ తెనాలి నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు కొప్పురావు హరి కిషోర్ మరియు పట్టణ వాణిజ్య విభాగం అధ్యక్షులు ఫజల్ ఖాన్, పట్టణంలోని వివిధ వ్యాపార సంస్థల అధినేతలు పలువురు ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పేదవిద్యార్థికి ల్యాప్టాప్ బహూకరణ



పొన్నూరు, అక్టోబరు 9,ప్రభాతవార్త: పేద విద్యార్థుల ఉన్నత విద్యకు చేయూతనివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని టిడిపి సీనియర్ నాయకుడు పాములపాటి సాయికృష్ణ అన్నారు. నిడుబ్రోలు 15వ వార్డుకు చెందిన రాజవరపు శివాజీ కుమారుడు శ్రీకాంత్కు పాములపాటి సాయికృష్ణ ల్యాప్టాప్ను బహూకరించారు. శ్రీకాంత్ ఎన్ఐటి దుర్గాపూర్లో ఈఈసీట్ సాధించాడు. ఈ నేపథ్యంలో శ్రీకాంత్ ఉన్నత విద్యకు అవసరమైన ల్యాప్ టాప్ లేకపోవడంతో సాయికృష్ణ స్పందించి ల్యాప్టాప్ను అందజేశారు. శ్రీకాంత్ చక్కగా ఉన్నత విద్యాభ్యాసం చేసి పది మందికి ఉపయోగపడేవిధంగా తోడ్పాటునందించాలని సాయికృష్ణ ఆకాంక్షించారు.

# బాపట్ల జిల్లా వార్త



## పారదర్శకమైన ఎన్నికల ప్రక్రియ జరిగే విధంగా చర్యలు : కలెక్టర్

బాపట్ల,అక్టోబర్ 9,ప్రభాతవార్త: అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ప్రతిపాదనలు ఎన్నికల కమిషన్ కు పంపుతామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులతో గురువారం స్థానిక కలెక్టరేట్లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారదర్శకమైన ఎన్నికల ప్రక్రియ జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.. ప్రతి నెల రాజకీయ పార్టీల సమావేశం జరపాలని ఎన్నికల



కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల ప్రతిపాదనలు, అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. జిల్లాలో 6,30,352 మంది పురుష ఓటర్లు ఉన్నారన్నారు. అలాగే 6,62,557 మంది మహిళ ఓటర్లు ఉండగా, 79 మంది ఇతరులు ఉన్నారన్నారు. ఓటర్ల జాబితాలో సవరణలు, కొత్తగా ఓటు హక్కు కొరకు వచ్చిన దరఖాస్తులలో 252 పెండింగ్ లో ఉన్నాయన్నారు. వాటిని తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1,200 ఓటర్లు దాటిన ప్రాంతంలో కొత్తగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలనే అభ్యర్థనలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎన్నికలు, ఓటర్ల జాబితా తయారీ కి సంబంధించిన ప్రక్రియ పారదర్శకతతో సజావుగా సాగడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు షేక్ షఫీ, బిజెపి నాయకులు రామకృష్ణ, బాలాజీ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ డి.రవికుమార్, బీఎస్పీ రాజారావు, టిడిపి షేక్ ఫరీద్, వైసీపీ నాయకులు ఐ మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో అంతర్గత రహదారులను వేగంగా నిర్మించాలి

బాపట్ల,అక్టోబర్ 9,ప్రభాతవార్త: కలెక్టరేట్ లో అంతర్గత రహదారులను ఆర్ అండ్ బి అధికారులు వేగంగా నిర్మించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్లో నిర్మించనున్న అంతర్గత రహదారులు, ఏటీఎం గది ప్రతిపాదిత ప్రాంతాన్ని కలెక్టర్ గురువారం పరిశీలించారు. కలెక్టరేట్ లో అంతర్గత రహదారుల నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. జిల్లా మినరల్



ఫండ్ నుంచి రూ.47.9 లక్షల నిధులతో ప్రతిపాదించిన అంతర్గత రహదారి ప్రాంతాన్ని , పోలీస్ కవాతు మైదానాన్ని ఆయన పరిశీలించారు. కలెక్టరేట్ లో రహదారి, కాల్వ నిర్మాణం, ప్రహరీ గోడ ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిర్మాణాలు చేయాలన్నారు. రహదారి వెంట విరివిగా మొక్కలు నాటాలన్నారు. కలెక్టరేట్ భవనం మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రజలు, ఉద్యోగులకు అసౌకర్యం కలగకుండా, వాహనాలకు ఇబ్బంది లేకుండా నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్, ఆర్ అండ్ బి డిఈ అరుణకుమారి, మైన్స్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ ఒకటి నుంచి బ్రహ్మోత్సవాలు



పొన్నూరు, అక్టోబరు 9,ప్రభాతవార్త: పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవాలయం వద్ద వేంచేసియున్న శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి 65వ వార్షిక బ్రహ్మోత్సవాలు నవంబర్ 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జరుగుతాయని దేవాలయం ఛైర్మన్ కోట రవిశంకర్ తెలిపారు. ప్రతి ఉత్సవాలు జరిగే రోజుల్లో నిత్యం ఉదయం 6గంటలకు సుప్రభాతసేవ, 8గంటలకు గులాబీ పూలతో సహస్రనామార్చన, 10గంటలకు శాంతి కళ్యాణం జరుగుతాయన్నారు. 5వ తేదీన అన్న సమారాధన, రాత్రి 6గంటలకు ఊంజల్సేవ, కర్పూరజ్యోతి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 6వ తేదీ రాత్రి 6గంటలకు స్వామివారి గ్రామోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు. పూర్తి వివరాల కోసం దేవాలయం కార్యాలయంలో సంప్రదించాలని రవిశంకర్ సూచించారు.

## జీఎస్టీపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి

పొన్నూరు, అక్టోబరు 9,ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఫిరోజ్ఖాన్ సూచించారు. సూపర్ జిఎస్టీ-సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమంలోపై గురువారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిరోజ్ఖాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తగ్గించిన, పూర్తిగా తొలగించిన జిఎస్టీ పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.




తగ్గించిన జిఎస్టీ పేదల జీవితాల్లో వెలుగు నింపుతుందన్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో చక్కగా జీవించాలంటే జీఎస్టీని తొలగించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడి ఆలోచిన చేసి జీఎస్టీని తగ్గించడం జరిగిందన్నారు. నిత్యావసర వస్తువులపై పూర్తిగా జీఎస్టీని తొలగించడం జరిగిందన్నారు. ప్రజలందరూ జిఎస్టీపై అవగాహన కలిగి కొనుగోలు చేసే వస్తువులకు సంబంధించి ఎక్కడైనా అక్రమంగా జీఎస్టీ వసూలు చేస్తుంటే సంబంధిత శాఖాధికారులు ఫిర్యాదు చేయాలని కోరారు. విద్యావంతులు జీఎస్టీ గురించి పేదలకు వివరించి వారు మోసపోకుండా చేయాల్సిన బాధ్యతలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ చంద్రకాంత్, హెడ్ నర్స్ శ్రీదేవి, మునిసిపల్ మేనేజర్ సుబ్బారావు, అభివృద్ధి కమిటి సభ్యులు ముజీర్, లతశ్రీ, జీఎస్టీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డిఎంఎఫ్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులలో
# ప్రతివారం పురోగతి కనిపించాలి

బాపట్ల,అక్టోబర్9,ప్రభాతవార్త: డి ఎం ఎఫ్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులలో ప్రతివారం పురోగతి కనిపించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, ఆర్ డబ్ల్యు ఎస్, సమగ్ర శిక్ష అభియాన్ పబ్లిక్ హెల్త్, సిపిఓ, విద్యుత్, భూగర్భ ఘనులశాఖ ఇంజినీరింగ్ అధికారులతో గురువారం స్థానిక కలెక్టరేట్ లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ అధికారులు బృందంగా ఏర్పడి, సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. పనితీరులో నాణ్యత ఉండాలన్నారు. బాపట్ల జిల్లా అభివృద్ధి కొరకు చక్కని ప్రణాళిక, బాధ్యత కలిగి ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు సమగ్ర ప్రణాళికలతో లక్ష్య సాధన వైపు అడుగులు వేయాలన్నారు. వివిధ శాఖల ద్వారా బాపట్ల జిల్లా ఏర్పడిన నాటికి రూ.35 కోట్లు డి ఎం ఎఫ్ (జిల్లా మినరల్ ఫండ్) నిధులు ఉన్నాయన్నారు. అప్పటినుండి మూడున్నర ఏళ్లలో మరొక రూ.16 కోట్లు జిల్లాకు వచ్చాయన్నారు. మొత్తంగా రూ.51 కోట్ల నిధి జిల్లా మినరల్



ఫండ్ కింద ఉండగా వివిధ శాఖల ద్వారా వివిధ ప్రాంతాలలో అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. 31 అభివృద్ధి పనులు చేపట్టడానికి రూ.48.28 కోట్లు అధికారికంగా మంజూరు అయ్యాయన్నారు. ఇప్పటివరకు కేవలం రూ.5.77 కోట్లు పనులు మాత్రమే జరగడమేమిటిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంజినీరింగ్ అధికారులు చేపడుతున్న పనులకు చెక్ లిస్ట్ ఉండాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులే తమకు తాము లక్ష్యాలను నిర్దేశించుకుంటూ వాటిని సకాలంలో పూర్తి చేయాలన్నారు.ప్రజా ప్రయోజనాలే ప్రాముఖ్యంగా భావించి ఇంజినీరింగ్ అధికారులు పనిచేయాలన్నారు. జిల్లాలో ఉన్న 61 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో తాగునీటిని పరీక్షించాలన్నారు. తాగునీరు కలుషితం గాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్వో ప్లాంట్లు అన్ని వినియోగంలో ఉండాలన్నారు. ఆయా ప్రాంతాలలో మంజూరు చేసిన ఆర్ఓ ప్లాంట్లు 15 రోజుల్లో ఏర్పాటు కావాలన్నారు. బీచ్ ల వద్ద మంజూరు చేసిన సామాజిక మరుగుదొడ్లు, సీసీ రోడ్లు, ఆయా గ్రామాలలో ఆరో ప్లాంట్లు, రేపల్లెలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, అంతర్గత రహదారుల నిర్మాణ పనులు, చెరువుల మరమ్మతు పనులు మొదలు పెట్టాలన్నారు. అభివృద్ధి పనులపై ప్రతినెల తప్పనిసరిగా సమీక్ష ఉంటుందన్నారు. నవంబర్ నెలలో జరగనున్న సమావేశానికి సమగ్ర సమాచారంతో ఇంజినీర్లు హాజరు కావాలన్నారు. మినరల్ ఫండ్ నిధులతో చేపట్టే పనులపై పంచాయితీ పి ఆర్ ఎస్ఈ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు విధిగా పాటించాలన్నారు. పనుల వివరాలు, కొనుగోలు కొరకు ఇంజినీర్లు జమ్ పోర్టల్ ను వినియోగించుకోవాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులు ఒత్తిడికి గురి గాకుండా ప్రశాంతంగా పనిచేయాలన్నారు. చీరాల ఓడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు నిర్మిస్తున్న 167ఏ జాతీయ రహదారిని త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. 47 కిలోమీటర్ల పొడవున నిర్మించే ఈ రహదారి బాపట్ల జిల్లాలో 35 కిలోమీటర్లు ఉందన్నారు. రూ.1,065 కోట్ల నిధులతో నిర్మిస్తున్న రహదారి పనులు బాపట్ల జిల్లాలో 95 శాతం పూర్తయ్యాయని, నవంబర్ నెలాఖరకు ముగించాలన్నారు. రహదారి వెంట రోడ్డు భద్రతపై సూచిక బోర్డులు ఉండాలని, మొక్కలు నాటాలనారు. జల జీవన్ మిషన్ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ప్రధానమంత్రి సడక్ యోజన కింద మంజూరు చేసిన పనులు త్వరగా ముగించాలన్నారు. పీఎం కుసుమ్, పి ఎం సూర్యఘర్, అమృత్ పథకాలను వేగంగా లక్ష్యాలను మేరకు పూర్తి చేయాలన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాల్సి ఉంటుందని కలెక్టర్ చెప్పారు. పాఠశాలల్లో తరగతి గదులు, గ్రామాలలో సిసి రోడ్లు, ఆర్ఓ ప్లాంట్లు, తదితర భవన నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ అనంతరాజు, గృహ నిర్మాణ శాఖ పిడి వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసి నాగిరెడ్డి, సిపిఓ షాలేమ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

తెనాలిటౌన్, అక్టోబర్ 9, ప్రభాతవార్త: ఆల్ఇండియా కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర కాంగ్రెస్ పిలుపుమేరకు, తెనాలి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో,గురువారం "ఓట్ చోర్ గద్దె చోడ్" పేరుతో మున్సిపల్ కార్యాలయం ఎదుట సంతకాల సేకరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెనాలి అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ,




కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఓట్ల చోరీకి పాల్పడిందని, బిజెపి కేంద్ర ప్రభుత్వంలో కొనసాగే అర్హత కూలిపోయిందని, డాక్టర్ సాంబశివుడు ఘాటుగా విమర్శించారు. ఓట్ల చోరీ అంశంపై తమ పార్టీ అధినేత రాహుల్ గాంధీ మాట్లాడితే కేంద్ర ప్రభుత్వ పెద్దలు తట్టుకోలేకపోతున్నారని, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలను అణగదొక్కాలని చూడటం బిజెపి ప్రభుత్వ విధానమన్నారు.గతంలో ఎన్నికలు జరిగిన మహారాష్ట్ర లో గాని, కర్ణాటకలో గాని అలాగే త్వరలో ఎన్నికలు జరగబోయే బీహార్ లోగాని పెద్ద ఎత్తున ఓట్ల అక్రమాలు పాల్పడింది బిజెపి అని, ఆయన దుయ్యబట్టారు. సుమారుగా 5 లక్షల మంది కొత్త ఓటర్లుగా నమోదు చేసుకుంటే అందులో 70 నుంచి 80 వేలమంది ఓట్లు అక్రమంగా నమోదు చేసి,ఈ రకమైన ఓట్ల చోరీతో గద్దెనెక్కిన బిజెపి ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందని,ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెంటనే గద్దె దిగాలని కాంగ్రెస్,వామపక్ష పార్టీల తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు బాబు ప్రసాద్,షేక్ హుస్సేన్ వలి మరియు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొన్నూరు నాగ సూర్య శశిధర్ రావు,పార్టీ నాయకులు పెనుగొండ శివకుమార్, మాదాల పూర్ణచంద్రరావు, భీమా రమేష్,చందు అయ్యప్ప,కోటేశ్వరరావు,పులే రామ్,శ్రీను,మల్లికార్జున రావు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## డాక్టర్ అంబేద్కర్ విగ్రహం ఘటనపై
## వైసిపి దిగజారుడు రాజకీయాలు: టిడిపి రాష్ట్ర మైనారిటీ నేత ఫైజాన్

ఎ కొండూరు, అక్టోబర్ 9, ప్రభాతవార్త :భారతరాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి ప్రమాదవశాత్తు జరిగిన నిప్పంటుకున్న ఘటనను వైసిపి కూటమి ప్రభుత్వంపై ఆపాదిస్తూ నిందలు మోపటం వైసిపి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మైనార్టి సెల్ జనరల్ సెక్రటరీ ఎస్.ఎం.ఫైజాన్ మీడియా సమావేశంలో విమర్శించారు. భారత రాజ్యాంగ నిర్మాతను సైతం వైసిపి నాయకులు, అరాచక మూకలు తమ స్వార్థ రాజకీయాలకోసం



వాడుకోవాలని ప్రయత్నించడం హేయమైన చర్య అని ఇటువంటి చర్యలు భారతదేశ సమైక్యత, సమగ్రతకు, లౌకిక విధానానికి ప్రమాదకరమని, వైసిఇ నాయకులు ఇటువంటి స్వార్థ రాజకీయాలకోసం, స్వార్థ ప్రయోజనాలకోసం దిగజారడం వారి రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని, ఇకనైనా వైసిపి నాయకులు ఆత్మ పరిశీలన చేసుకొని దేశ సెక్యులర్ వ్యవస్థను కాపాడి అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని ప్రపంచ దేశాల్లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి వున్న విలువలు అమోఘమని, ప్రపంచ దేశాల్లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్కు వున్న ప్రతిష్టను మనం కాపాడుకోవాలని వైసిపి లాంటి అరాచక, నీచమైన చర్యలను ప్రతి ఒక్క భారతీయుడు ఖండించి రాజ్యాంగ విలువలను కాపాడుకోవాలని ఫైజాన్ ఈ సందర్భంగా కోరారు.

## నేడు అతావుల్లా బాబా దర్బార్ అండ్ దర్గాలో అతానిజాంబాబా గ్యార్వీ పండుగ

ఎ కొండూరు, అక్టోబర్ 9, ప్రభాతవార్త : ఇరాక్దేశంలోని బగ్దాద్ షరీఫ్లో వున్న హజరత్ గౌసెపాక్ బడే పీర్ మహాత్ముల గ్యార్వీ పండుగను ఎన్టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ. కొండూరు మండలం చీమలపాడు గురుదేవులు హజరత్ అతావుల్లా బాబా దర్బార్ అండ్ దర్గా ప్రాంగణంలో శుక్రవారం ఈనెల 10న అత్యంత భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా అలుపెరుగని అన్నదాత




అతావుల్లాబాబా వారి దివ్య ఆశీస్సులతో పాటు అనుమతి ఆజ్ఞానుసారం ద్వారా ఘనంగా నిర్వహిస్తున్నట్లు గుంటూరు జిల్లా వేమూరు నియోజకవర్గం వేమూరు మండలం జంపని ఎ.ఎ.బిఎస్.టిఎ దర్బార్ నిర్వహకులు అతా ముహమ్మద్ నిజాముద్దీన్ నిజామ్ షాతాజ్ ఖాదరి (అతా నిజాంబాబా) గురువారం సాయంత్రం చరవాణి ద్వారా ప్రభాతవార్తకు తెలిపారు. ఈ సందర్భంగా జెండా గంధమహోత్సవంతో పాటు కులమతాలకతీతంగా భారతదేశం నలుమూలల నుండి వచ్చే బాబా భక్తులకు మటన్ బిర్యాని ప్రసాద వితరణ దిగ్విజయంగా నిర్వహిస్తున్నట్లు ఎ.ఎ.బి. ఎస్టి.ఎ. దర్బార్ నిర్వహకులు అతా నిజాంబాబా ఈ సందర్భంగా తెలిపారు.

# పల్నాడు జిల్లా వార్త



## ప్రతినెలా టౌన్‌హాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు : ఎమ్మెల్యే డాక్టర్ 'చదలవాడ'



నరసరావుపేట, అక్టోబర్ 9 ప్రభాతవార్త : టౌన్‌హాల్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో కమిటీ సభ్యులు అంకమ్మచౌదరి, పాషా తదితరులు ఎమ్మెల్యే అరవింద్‌బాబును కలిసి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి చర్చించారు. ప్రతి నెలలో మూడవ శనివారం లేక ఆదివారం ప్రేక్షకులను అలరించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. నాటకాలు, నృత్యాలు, డ్రామాలు, సంగీత విభావరి వంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తామని తెలియజేశారు. ప్రేక్షకుల అభిరుచుల మేరకు ఆయా కార్యక్రమాలను టౌన్ కమిటీ సభ్యులు క్రమం తప్పకుండా నిర్వహించి కళలను ప్రోత్సహించి కళాకారులకు సహకారం అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు సూచించారు.

## పట్టణంలో ప్రపంచ దృష్టి దినోత్సవ ర్యాలీ



నరసరావుపేట, అక్టోబర్ 9 ప్రభాతవార్త : డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్స్ విజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీకార్యక్రమంలో డాక్టర్ రామలింగారెడ్డి, డాక్టర్ చెంచురెడ్డి, డాక్టర్ శాంతిశ్రీ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక గుంటూరు రోడ్డులోని హాస్పిటల్ నుండి ప్రారంభమైన ర్యాలీ మల్లమ్మ సెంటర్, కోట సెంటర్, మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్‌ల మీదుగా ప్రధాన వీధులలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామలింగారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దృష్టి దినోత్సవ ప్రాధన్యతను వివరించారు. ప్రతి ఒక్కరు కంటి చూపుకు సంబంధించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే విధంగా కళ్లకు ఏ విధమైన ఆహారం మేలు చేస్తుందో తెలిపారు. కంటి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలను వివరించారు.

## మ్యాక్సికేర్ సాయి తిరుమల హాస్పటల్లో సాలిడ్ స్టేట్ మానో మిటరి పరీక్ష పరికరం



నరసరావుపేట, అక్టోబర్ 9 ప్రభాతవార్త : మ్యాక్సికేర్ సాయి తిరుమల సూపర్ స్పెషాలిటీ హాస్పటల్లో సాలిడ్ స్టేట్ మానో మిటరి పరీక్ష పరికరాన్ని మొదటిసారిగా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు డాక్టర్ మన్నే గౌతమ్ గురువారం తెలియజేశారు. ఈ పరికరం గురించి వివరాలను తెలియజేశారు. అనేక రకాల వ్యాధులను గుర్తించడంలో పరికరం ఉపయోగపడుతుందన్నారు. ముటిలిటి డాసార్డర్ అకిలేసియా కార్డియా, యాసిడ్ రిఫ్లక్సన్ అను పరీక్షలను సులభంగా చేయవచ్చన్నారు. దీర్ఘకాలంగా మింగుడు పడకపోవడం, తిన్నది గొంతులోనే ఉన్నట్లు అనిపించడం, వాంతులు అవుతున్న లక్షణాలు, గుండె మంటగా ఉన్నవారికి పరీక్షలు ఖచ్చితంగా నిర్ణయించవచ్చన్నారు. అదే విధంగా మలబద్ధకం ఉన్నవారికి ఖచ్చితమైన ఇబ్బందులను గుర్తించి చికిత్స అందించవచ్చని డాక్టర్ మన్నే గౌతమ్ తెలియజేశారు.

## అండర్-19 కబడ్డీ, బ్యాడ్మింటన్ స్టేట్ మీట్‌కు 'వాగ్దేవి' విద్యార్థుల ఎంపిక

నరసరావుపేట, అక్టోబర్ 9 ప్రభాతవార్త : అండర్-19 ఎస్‌జిఎఫ్ కబడ్డీ, బ్యాడ్మింటన్ స్టేట్ మీట్‌కు వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. వివరాలను గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావులు తెలియజేశారు. సత్తెనపల్లిలో ఈ నెల 7వతేదీన జిల్లా సెలక్షన్స్‌లో వాగ్దేవి విద్యార్థులు పది మంది ప్రాతినిధ్యం వహించి నలుగురు కబడ్డీ టీమ్‌కు, ఒకరు బ్యాడ్మింటన్ టీంకు ఎంపికైనట్లు తెలిపారు. బాలుర విభాగంలో త్రినాధ్, ఎం.రమణయ్య, మహ్మద్ నిసార్‌లు ఎంపికయ్యారన్నారు. బాలికల విభాగంలో లక్ష్మిసరిత, అనూహ్య లు ఎంపిక కావడం జరిగిందన్నారు. వినుకొండలో జరగబోయే రాష్ట్ర మీట్‌కు తమ విద్యార్థులు ప్రతినిధ్యం వహిస్తారని రాయల శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు రామకోటేశ్వరరావు, కపలవాయి రాజేంద్రప్రసాద్, పి.కృష్ణారావు, అచ్యుతరావు, పి.డి.రాయల ఆంజనేయులు పాల్గొన్నారు.



## రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతోంది : డాక్టర్ గోపిరెడ్డి విమర్శ



నరసరావుపేట, అక్టోబర్ 9 ప్రభాతవార్త : రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతుందని పల్నాడు జిల్లా వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎంపికైన పాలపర్తి వెంకటేశ్వరరావును అభినందించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమైందని విమర్శించారు. రూ.48 కోట్ల బాటిళ్లు కల్తీ మద్యం పంపిణీ జరుగుతుందన్నారు. 70 వేల బెల్టుషాపులు పెట్టిన ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. రాష్ట్రంలో మంచినీరు దొరక్కపోయినా మద్యం మాత్రం ఏరులై పారుతుందన్నారు. జీఎస్టీ కేంద్ర ప్రభుత్వం తగ్గిస్తే రాష్ట్రంలో తమ వల్ల జీఎస్టీ తగ్గిందని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇతర రాష్ట్రాల కంటే రూ.9 లు అదనంగా డీజిల్, పెట్రోల్ ధరలు అమ్ముతున్నారని విమర్శించారు. మున్సిపల్ పన్నులు, వాయిర్ ట్యాక్స్‌లు ఇష్టానుసారం పెంచారన్నారు. ఆరోగ్యశ్రీని అనారోగ్యంగా చేశారని విమర్శించారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్తారని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు.

## 'ఎన్‌సిసి క్యాడెట్ల సేవలు అభినందనీయం'



నరసరావుపేట, అక్టోబర్ 9 ప్రభాతవార్త : ఎన్‌సిసి క్యాడెట్ల సేవలు అభినందనీయమని ఎస్‌కెఆర్ కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు అన్నారు. ఆలిండియా థాల్ సైనిక్ క్యాంప్‌లో ప్రతిభ చూపిన ఎన్‌సిసి డైరెక్టరేట్‌లను ఘనంగా సత్కరించారు. మేజర్ వై.అంజిరెడ్డి, మేజర్ బి.ఎస్.ఆర్.కె.రాజు, సుబేదార్ బలివేంద్రసింగ్, హవల్దార్ శంషేర్‌సింగ్‌లను సత్కరించారు. సన్మాన గ్రహీతలు సి.హెచ్.మణికుమార్, లిఖిత నందినిలను అభినందించారు. క్యాడెట్లు వారి అనుభవాలను, కృషిని, విజయాలను వివరించారు. ప్రిన్సిపాల్ వై.వెంకటేశ్వర్లు, ఎన్‌సిసి అధికారి ఎ.రాజేష్‌బాబు, పి.డి. కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీల్లో ఉప్పలపాడు విద్యార్థుల ప్రతిభ



నకరికల్లు, అక్టోబర్ 9 ప్రభాతవార్త : మండలంలోని ఉప్పలపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థులు వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలలో మంచి ప్రతిభ చూపారు. వివరాలను హెచ్‌ఎం ఎం.సుధీర్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.హెచ్.కోటేశ్వరరావు వివరాలను తెలియజేశారు. డివిజనల్ స్థాయి వాలీబాల్ పోటీలకు పాఠశాలకు చెందిన వెంకటసాయి, ఏసోబు, ప్రశాంత్, మణికంఠ, అంకమ్మరావు ఎంపికయ్యారన్నారు. షాట్‌పుట్‌లో చంద్ర ప్రథమస్థానం సాధించారన్నారు. జావలిన్‌త్రోలో తృతీయస్థానాన్ని సాధించారని హెచ్ఎం కోటేశ్వరరావులు తెలియజేశారు.

## మహంకాళి అమ్మవారి ఆలయానికి రూ.లక్ష విరాళం



నకరికల్లు, అక్టోబర్ 9 ప్రభాతవార్త : నరసరావుపేట మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో వేంచేసియున్న మదిర వాస్తవ్యులు జంగా రాంభూపాల్‌రెడ్డి - సుమప్రతిమ, కుమారుడు ఇసానిరెడ్డిలు అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. గురువారం ఆలయ కార్య నిర్వాహణాధికారిణి నలబోతు మాధవదేవి వివరాలను తెలియజేశారు. నూతన ఆలయానికి రూ.లక్ష విరాళం అందజేసిన రాంభూపాల్‌రెడ్డి కుటుంబసభ్యులకు అమ్మవారి దర్శనంతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేయడం జరిగిందన్నారు. అదే విధంగా వారిని సత్కరించడం జరిగిందన్నారు. నిర్మాణానికి దాతలు అందించే విరాళాలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందని ఈ సందర్భంగా ఈవో మాధవదేవి తెలియజేశారు.

## జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమం



రాజుపాలెం, అక్టోబరు 9 ప్రభాతవార్త : రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లో గురువారం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ తగ్గింపు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వి.రవితేజానాయక్ మాట్లాడుతూ ప్రజా ఆరోగ్య విషయంలో సూపర్ గిఫ్ట్‌ను ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి కమర్షియల్ ట్యాక్స్ అధికారి గోపాలరావు మాట్లాడుతూ ప్రజలకు వివిధ రకాల వస్తువులపై అనేక సేవింగ్స్ జరిగాయని తెలిపారు. అధికారులు వసంతరావు, ఉషారాణి, జీవనరావు, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

## వినుకొండలో 'ఐటి' దాడులు.. సంచలనం

### -రూ.కోట్లల్లో పప్పు స్కామ్ బహిర్గతం
### -కందిపప్పు వ్యాపారుల గుండెల్లో గుబులు

వినుకొండ, అక్టోబర్9, ప్రభాతవార్త: గుంటూరు, వినుకొండ తదితర ప్రాంతాల్లోని కందిపప్పు వ్యాపారులపై గత మూడు రోజులుగా జరుగుతున్న ఆదాయపన్ను శాఖ సోదాలు ఆ వ్యాపారవర్గాల గుండెల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. గురువారం మరింత వేగంగా 30 బృందాలతో వినుకొండ పట్టణంలోని కందిపప్పు వ్యాపారులపై ఐటి దాడులు కొనసాగాయి. పట్టణానికి చెందిన ప్రముఖ పప్పు వ్యాపారి ఓ.శ్రీనివాసరావుకు సంబంధించిన నివాసం, మిల్లు, కార్యాలయాల్లో విస్తృత సోదాలు చేశారు. పెద్ద మొత్తంలో పత్రాలు, డిజిటల్ పరికరాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.




గత ప్రభుత్వ హయాంలో పౌరసరఫరాల శాఖ ద్వారా కందిపప్పు సరఫరా చేయకుండానే చేసినట్లు రికార్డులు చూపి నిధులు కాజేసినట్లు వచ్చిన ఫిర్యాదులపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టింది. అందులో భాగంగా ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వానికి కందిపప్పుతో పాటు పలు నిత్యావసర వస్తువులు ఇతర శాఖలకు వివిధ రకాల వస్తువుల సరఫరాలో కీలక భూమిక పోషించిన హిందూస్థాన్ ట్రేడర్స్ కేంద్రంగా పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు ఐటి అధికారులు గుర్తించారు. అక్రమాలు వెలుగు చూడటంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ సంస్థ కార్యాలయాలు, అనుబంధ వ్యాపార సంస్థలు, నివాసాలపై ఐటి దాడులు కొనసాగిస్తున్నారు.

## క్రీడల్లో జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థుల ప్రతిభ



వినుకొండ, అక్టోబర్9, ప్రభాతవార్త: స్థానిక ఎన్నెస్పీ కాలనీలోని జెడి ్ర స్కూల్ నందు జరుగుతన్న ఆటల పోటీల్లో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వాలీబాల్, కబడ్డీ, యోగ, షటిల్, బాడ్మింటన్ విభాగాల్లో సత్తా చాటి మండలస్థాయికి ఎంపికైనట్లు ఆ స్కూల్ హెచ్ఎం వెంకటేశ్వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూల్ ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఎంపికైన వారు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

## జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే 'కన్నా'



సత్తెనపల్లి, అక్టోబరు 9 ప్రభాతవార్త : జిల్లా ఎస్పీ బి.కృష్ణారావును గురువారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ కృష్ణారావుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. పల్నాడు జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన వారికి శాంతిభద్రతల పర్యవేక్షణకు సంబంధించి తగిన సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. తమ నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను ఎస్పీతో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడారు. కన్నా వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

## నాగోతు శౌరయ్య కుటుంబానికి ఎమ్మెల్యే కన్నా పరామర్శ



సత్తెనపల్లి, అక్టోబరు 9 ప్రభాతవార్త : శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ గురువారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు శౌరయ్యను, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. నాయకులు శౌరయ్య మాతృమూర్తి చిన్నమ్మ వయస్సురీత్యా బుధవారం కనుమూశారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వారి గ్రామానికి చేరుకొని శౌరయ్య మాతృమూర్తి చిన్నమ్మ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె మృతిపట్ల సంతాపాన్ని తెలియజేశారు.

## నందిగామ వద్ద రోడ్డు ప్రమాదం



సత్తెనపల్లి, అక్టోబరు 9 ప్రభాతవార్త : సత్తెనపల్లి పరిధిలోని నందిగామ అడ్డరోడ్డు వద్ద గురువారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కారసాని ప్రమోద్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఆర్టీసీ బస్సును ఓవర్‌టెక్ చేయబోయి ఎదురుగా వస్తున్న బొలిరో వాహనాన్ని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ప్రమోద్‌ను సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం అక్కడి నుండి మెరుగైన చికిత్స నిమిత్తం గఉంటూరు జిజిహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పెదకూరపాడు రైల్వేస్టేషన్‌లో మాక్‌డ్రిల్



పెదకూరపాడు, అక్టోబరు 9 ప్రభాతవార్త : పెదకూరపాడు రైల్వేస్టేషన్‌లో మాక్‌డ్రిల్‌ను రైల్వే అధికారులు నిర్వహించారు. ప్రమాదం జరిగిన సందర్భంలో రైలులో ప్రయాణించే ప్రయాణికులు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వివరించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది ప్రమాదాల సమయంలో తాము అందించే సహాయక చర్యలను వివరించారు. స్థానిక ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఏర్పాటు చేసే మెడికల్ క్యాంపుల గురించి వివరించారు. మాక్‌డ్రిల్‌లో 108 వాహనాన్ని అందుబాటులో ఉంచారు.

## గ్రామీణ ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపిడివో



పెదకూరపాడు, అక్టోబరు 9 ప్రభాతవార్త : మండలంలోని లగడపాడు గ్రామంలో గ్రామీణ ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రంలో వికేంద్రీకృత కార్యక్రమాన్ని ఎంపిడివో గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత వైపు ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలన్నారు. సర్పంచ్ వేమవరపు నాగేశ్వరరావుమాట్లాడారు. గ్రామ పంచాయితీకి ఆదాయం కల్పించుకునే విధంగా ఘన వ్యర్థాలను నిర్వహించే కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. గ్రామ పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

## మండలస్థాయి టోర్నమెంట్ ఎంపికల క్రీడా పోటీల నిర్వహణ

యడ్లపాడు, అక్టోబర్ 9, ప్రభాతవార్త : మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సొలస నందు బుధవారం ఎస్‌జిఎఫ్ అధ్వర్యంలో మండల స్దాయి టోర్నమెంట్ మరియు ఎంపికల క్రీడలు నిర్వహించారు. ప్రారంభ సమావేశానికి పాఠశాల హెచ్‌ఎమ్ అవుల మంద వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిధిగా ఎంఇవో ఒన్ నాగరత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ క్రిడలలో మంచిగా రాణించి మండలానికి పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని అకాంక్షించారు. యూ 14 మరియు 17, బాల బాలికల విభాగాలలో సుమారు మండలంలోని వివిధ పాఠశాలల నుండి 300మంది క్రీడా కారులు పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, చెస్, ఖో ఖో, యోగ మరియు అద్లెటిక్స్ నందు పోటీలు మరియు మండల స్దాయి టీమ్ల సెలక్షన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు జిల్లా గౌరవ అధ్యక్షులు పుల్లగూర పాల్ సుధాకర్, యడ్లపాడు మండల ఎస్‌జిఎఫ్ కోఅర్డినేటర్ కారుచోల మధుబాబు, మండల వ్యాయామ ఉపాధ్యాయులు రాజేష్, శ్రీధర్, శ్రీనివాసరావు, వేమారెడ్డి, అనూజి, గ్రామ పెద్దలు వీరారెడ్డి, మద్దూరి బాల విజయ బాలచంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, స్కూల్ ఎస్ఎమ్‌సీ ఛైర్మన్ నాగళ్ళ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## 'ఆరోగ్యశ్రీ' బకాయిలు ఎగ్గొట్టడమేనా జగన్ పేదలకు అందించిన గొప్ప కార్పొరేట్ వైద్యం : ప్రత్తిపాటి



చిలకలూరిపేట, అక్టోబర్ 9, ప్రభాతవార్త: జగన్ నర్సీపట్నం పర్యటన మూడు అవమానాలు.. ఆరు నిరసనలు అన్న తీరుగా సాగింది. ఐదేళ్ల సాగించిన నిరంకుశ పాలన ప్రభావం జీవితాంతం తనను వదలవనే నిజాన్ని జగన్ ఇప్పటికైనా గ్రహించాలి. ప్రజాదరణ లేని పర్యటనలు.. ఉబుసుపోని రాజకీయాలతో అనుకూల మీడియాకు అదనపు పని.. ప్రజల్లో జగన్ కు హేళనలే మిగులుతాయని నర్సీపట్నం పర్యటనతో రుజువైంది. గో బ్యాక్ జగన్ నినాదాలు, దళితసోదరుల నిరసనలతో ఏం మాట్లాడాలో తెలియని స్థితిలో వైద్య కళాశాలలపై జగన్ చెప్పిన అబద్ధాలే మళ్లీ చెప్పారు. టీడీపీ నేతలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా తాను అనుకున్నదే నిజమని భావించడం జగన్ కు మాత్రమే తెలిసిన అజ్ఞానవిద్య. జాతీయ ఆరోగ్య మిషన్ నిధుల్ని దారిమళ్లించి.. జనం ఆరోగ్యం కాపాడానని చెప్పడం జగన్ కే చెల్లింది. నెట్ వర్క్ ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ బకాయిలు ఎగ్గొట్టిన జగన్ పేదలకు కార్పొరేట్ వైద్యం అందించానని చెప్పడం సిగ్గుచేటు. మెరుగైన వైద్యసేవలతో జగన్ నిజంగా పేదల్ని ఉద్ధరించి ఉంటే గతంలో చంద్రబాబు ప్రవేశపెట్టిన 33 వైద్యపథకాలను ఎందుకు రద్దుచేశాడో సమాధానం చెప్పాలి. జగన్ చర్యలతో రాష్ట్రంలో పేద, మధ్యతరగతి వర్గాల సగటు వైద్య ఖర్చు పెరగడం నిజం కాదా? ప్రభుత్వ ఆసుపత్రులు నరక కూపాల్లా మారి, కనీసం సిరంజిలు..సూదులు కూడా లేక రోగులు అవస్థలు పడలేదా? జాతీయ ఆరోగ్య మిషన్ నిధుల్ని దారిమళ్లించి.. జనం ఆరోగ్యాన్ని కాపాడానని చెప్పడం జగన్ మార్క్ అబద్ధం. 108 104 ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా రోడ్లెక్కిచడమేనా జగన్ వైద్యరంగంలో చేసిన అభివృద్ధి? భూములిచ్చి శంఖుస్థాపనలు చేస్తే కాలేజీలు పూర్తవుతాయనుకోవడం జగన్ అవివేకం.. అజ్ఞానం. అధికారంతో పాటు మెడికల్ కాలేజీలనే బంగారు బాతుల్ని కోల్పోయానన్న అక్కసుతోనే జగన్ ప్రభుత్వంపై బురద జల్లుతున్నాడు. చంద్రబాబును ప్రశ్నించే ముందు కాలేజీలకు కేంద్రమిచ్చిన సొమ్మును ఏం చేశాడో జగన్ చెప్పాలి. వ్యక్తిగత విలాసాలకు వందలకోట్ల ప్రజాధనం దుబారా చేసినప్పుడు జగన్ కు మెడికల్ కాలేజీలు కట్టాలనిపించలేదా? భూములిచ్చి శంఖుస్థాపనలు చేస్తే కాలేజీలు పూర్తవుతాయనుకోవడం జగన్ అవివేకం.. అజ్ఞానమే. ప్రజల ఖర్మకాలి జగన్ మళ్లీ గెలిచుంటే వైద్య కళాశాలల స్థానంలో భారీ ప్యాలెస్ లు..వైసీపీనేతల రిసార్ట్ లు.. పేకాట క్లబ్ లు రియల్ ఎస్టేట్ వెంచర్లు ఉండేవి. కట్టుకథలు.. గల్లీ రాజకీయాలతో ప్రజల్ని మభ్యపెట్టి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలనుకున్న జగన్ పాచికలు పారలేదు." అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయం: డాక్టర్ ముప్పాళ్ల



చిలకలూరిపేట, అక్టోబర్ 9, ప్రభాతవార్త: పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ ద్వారా మెడికల్ కళాశాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్యుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ముప్పాళ్ళ.హనుమంతరావు అన్నారు. గురువారం పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రం త్వరిత గతిన అభివృద్ధి చెందేందుకు ఈ విధానం సరియైనదని డా.ముప్పాళ్ళ అన్నారు. దీనిపై ప్రజల్లో అనేక అపోహలు ఉన్నాయని, అవన్నీ తొలిగించుకోవాలని ఆయన సూచించారు. మెడికల్ కళాశాలలను ట్రిపుల్ పీ పద్ధతిలో అభివృద్ధి చేస్తే పేదలకు కార్పొరేట్ వైద్యం చౌకగా లభిస్తుందని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి మాత్రమే ఈ వైద్య శాలలు నడుస్తాయి కాబట్టి పేదలకు ఇప్పుడున్న సౌకర్యాలన్నీ ఉంటాయన్నారు. ఇంకా మెరుగైన సౌకర్యాలు కూడా కల్పించబడతాయన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో ముందు చూపుతో ఈ పద్ధతి సృష్టించారన్నారు. గడువు పూర్తయిన తర్వాత ఆ ఆస్తులన్నీ ప్రభుత్వ పరమవుతాయి కాబట్టి ప్రభుత్వానికి మేలు జరుగుతుందన్నారు. వైద్య శాలల్లో సీట్లు భర్తీ ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉంటుంది కాబట్టి ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగదన్నారు. దీనిపై ప్రతిపక్షాలు చెబుతున్నవన్నీ అవాస్తవాలని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలని డా.ముప్పాళ్ళ కోరారు.

## అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనపై తెదేపా శ్రేణుల ఖండన

చిలకలూరిపేట, అక్టోబర్ 9, ప్రభాతవార్త: చిలకలూరిపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు, శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చిత్తూరు జిల్లాలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనపై చిలకలూరిపేట తెలుగుదేశం పార్టీ శ్రేణులు తీవ్రంగా



ఖండించారు. దళితులను రెచ్చగొట్టి రాష్ట్రంలో అలజడులు సృష్టించాలనే దురుద్దేశంతో ఈ చర్యలు జరుగుతున్నాయని వారు పేర్కొన్నారు."అంబేడ్కర్ విగ్రహం అంటే దేశ గౌరవం దానిపై దాడి చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేసినట్టే" అని టీడీపీ నాయకులు తీవ్రంగా స్పందించారు. ఈ దారుణ ఘటనకు బాధ్యులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని, గత ప్రభుత్వంలో డాక్టర్ సుధాకర్ బాబు పై దాడి జరిగినప్పుడు దళితులపై జరిగిన దాడులపై ఒక్క మాట మాట్లాడని నాయకులు ఇవాళ దళితులను ఉద్ధరించినట్టుగా మాట్లాడటం హాస్యాస్పదమని వారు పేర్కొన్నారు. దళితులపై దాడి చేసిన వారిని ప్రమోషన్ ఇచ్చి పక్కన కూర్చోబెట్టుకొని సెల్ఫీలు దిగిన జగన్ కూడా ఈ రోజు దళితుల గురించి మాట్లాడుతుంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదని టీడీపీ నాయకులు విమర్శించారు. ఈ ఘటనలో జగన్‌ను కూడా తి2 నిందితుడిగా చేర్చాలని చిలకలూరిపేట టీడీపీ శ్రేణులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్ గారు, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి గారు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఇనగంటి జగదీష్ గారు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొండా వీరయ్య గారు, చిలకలూరిపేట మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ పిల్లి కోటేశ్వరరావు గారు, దళిత ముఖ్య నాయకులు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## టౌన్ ప్లానింగ్‌లో నిర్లక్ష్యాన్ని సహించం : కమిషనర్ హెచ్చరిక




చిలకలూరిపేట, అక్టోబర్ 9, ప్రభాతవార్త: చిలకలూరిపేట పురపాలక సంఘంలో పట్టణ ప్రణాళిక, ఆక్రమణలు, అనధికార నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలో ఎల్.ఆర్.ఎస్. (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) పథకాన్ని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో ఉన్న ఆక్రమణలు మరియు అనధికార నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, వాటిని తక్షణమే తొలగించాలని కమిషనర్ సూచించారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా, రోడ్ల మార్కింగ్ బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు మాట్లాడుతూ, "టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన ఉద్యోగస్తులు ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము. పట్టణ ప్రణాళికకు సంబంధించిన పనులను త్వరతిగతిన పూర్తి చేయాలి," అని హెచ్చరించారు. పట్టణ అభివృద్ధిలో టౌన్ ప్లానింగ్ విభాగం కీలక పాత్ర పోషిస్తుందని, పనులు ఆలస్యం కాకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉద్యోగులందరిపై ఉందని కమిషనర్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ టిపిఎస్, టిపిబివో, లారెన్స్ సెక్రటరీలో తదితరులు ఉన్నారు.

## సచివాలయ ఉద్యోగినిపై అత్యాచారయత్నం



యడ్లపాడు, అక్టోబర్ 9, ప్రభాతవవార్త : విధి నిర్వహణలో ఉన్న సచివాలయ ఉద్యోగినిపై అత్యాచారయత్నానికి వ్యక్తి పూనుకున్నాడు. పోలీసులు, బాధితురాలి కథనం మేరకు పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కారుచోలకు చెందిన జాజుల పెద తిరుపతయ్య గురువారం తన గేదెదూడకు పశువైద్యం చేయాలని సచివాలయ ఉద్యోగిని వద్దకు వెళ్లి కోరాడు. దీంతో అమె తిరుపతయ్య ఇంటికి వెళ్లి దూడకు ఇంజక్షన్ చేయడం జరిగింది. పశువుల దాణా నాణ్యతను పరిశీలించాలంటూ తిరుపతయ్య అమెను ఇంట్లోకి పిలిచుకొని వెళ్లి లోపలకు వెళ్లగానే అమె చేయి లాగి అసభ్యంగా ప్రవర్తించాడని, తప్పించుకుని బయటకు పరుగు తీసి కేకలు వేయటంతో చుట్టపక్కల వారు అక్కడికి చేరుకుని బాధితురాలి ద్వారా విషయం తెలుసుకుని తిరుపతయ్యకు దేహశుద్ధి చేయటం జరిగిందన్నారు. ఎస్సై శివరామకృష్ణ ఘటనా స్దలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాదితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సూపర్ జిఎస్‌టి, అరోగ్యం, జీవితం కోసం సూపర్ ఆదా కార్యక్రమం నిర్వహణ



యడ్లపాడు, అక్టోబర్ 9, ప్రభాతవార్త : మండల ప్రాథమిక అరోగ్య కేంద్రం నందు మరియు మండలంలోని అన్ని సచివాలయ పరిధిలో ఉన్న సచివాలయాలలో సూపర్ జిఎస్‌టి అరోగ్యం, జీవితం కోసం సూపర్ అదా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రభుత్వం వారిచే జిఎస్టీ 2.0సంస్కరణలు తీసుకువచ్చి అన్ని నిత్యఅవసర వస్తువులు, మందులు, ఇతర ఉపకరణాలపై పన్నులు తగ్గించుట ద్వారా ప్రజలకు అర్ధికంగా అత్యంత మేలు చేకూర్చుట జరిగిందని, జిఎస్టీ పన్ను తగ్గుట వలన సాధారణ మందుల ధరలతో పాటు ప్రాణాంతక వ్యాధులైన క్యాన్సర్, షుగర్, బిపి గుండె సమస్యల తాలూక మందుల ధరలు గణనీయంగా తగ్గాయని అలాగే అరుదైన వ్యాధులు, అవయవ మార్పిడి తాలూకా ఔషదాలపై అరోగ్య భీమా, జీవిత బీమాలపై జిఎస్టీ పన్ను పూర్తిగా తగ్గించడమైనదన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌వో పున్నారావు, వైద్యులు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

# వస్తుందో.. రాదో!

## నోబెల్ 'శాంతి' పై ట్రంప్ నిర్వేదం



**వాషింగ్టన్, అక్టోబరు 9:** ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి ప్రకటనకు ఒక్క రోజు ముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఏడు ప్రపంచ స్థాయి వివాదాలను పరిష్కరించానని చెప్పుకుంటూనే, ఆ పురస్కారం తనకు దక్కకపోవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. తనకు బహుమతి ఇవ్వకుండా ఉండేందుకు నార్వే నోబెల్ కమిటీ ఏదో ఒక కారణాన్ని వెతుకుతుందని ఆయన జోస్యం చెప్పారు. గురువారం వైట్ హౌస్‌లో ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ట్రంప్ స్పందించారు. నాకు నోబెల్ బహుమతి వస్తుందో లేదో తెలియదు. మేం ఏడు యుద్ధాలను పరిష్కరించామని విదేశాంగ మంత్రి మార్కో రూబియో చెబుతారు. ఎనిమిదో వివాదం పరిష్కారానికి కూడా చాలా దగ్గరగా ఉన్నాం. రష్యా సమస్యను కూడా మేమే పరిష్కరిస్తామని భావిస్తున్నాను. చరిత్రలో ఏ నాయకుడూ ఇన్ని వివాదాలను పరిష్కరించి ఉండడు అని ట్రంప్ అన్నారు. అయితే, నోబెల్ కమిటీ మాత్రం తనకు పురస్కారం ఇవ్వకపోవడానికి ఏదో ఒక కారణం వెతుకుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ట్రంప్ ఇలా అనుమానాలు వ్యక్తం చేస్తుండగా, వైట్ హౌస్ మాత్రం ఆయన్ను ది పీస్ ప్రెసిడెంట్ (శాంతి అధ్యక్షుడు) అంటూ అభివర్ణిస్తూ ఒక చిత్రాన్ని పంచుకుంది. ఇది ట్రంప్ వ్యాఖ్యలకు పూర్తి భిన్నంగా ఉండటం గమనార్హం. ఇటీవల ఇజ్రాయెల్‌హమాస్ మధ్య తొలి దశ కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో ట్రంప్ కీలక పాత్ర పోషించినట్లు ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. గతంలో భారత్‌పాకిస్థాన్ మధ్య నెలకొన్న సైనిక సంక్షోభాన్ని కూడా తానే పరిష్కరించానని ట్రంప్ పలుమార్లు చెప్పుకున్నారు. ఈ కారణంగానే పాకిస్తాన్ ఆయన పేరును నోబెల్ శాంతి బహుమతికి సిఫార్సు చేసింది. అయితే, అమెరికా జోక్యం వల్లే కాల్పుల విరమణ జరిగిందన్న వాదనను భారత్ తీవ్రంగా ఖండించింది. పాకిస్థాన్ డీజీఎంఓ అభ్యర్థన మేరకే కాల్పుల విరమణకు అంగీకరించామని, ఇందులో అమెరికా పాత్ర ఏమీ లేదని న్యూఢిల్లీ స్పష్టం చేసింది. తనకంటే ముందు బరాక్ ఒబామాకు నోబెల్ బహుమతి రావడంపై పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేసిన ట్రంప్, ఈసారైనా తనకు ఆ పురస్కారం దక్కాలని బలంగా ఆకాంక్షిస్తున్నారు.

# ఇక 'జైషే' మహిళా ఉగ్రవాదులు!

## పంథాను మార్చుకున్న అంతర్జాతీయ ఉగ్రసంస్థ



**ముజఫరాబాద్, అక్టోబరు 9:** ఆపరేషన్ సిందూర్ దెబ్బకు ఛిన్నాభిన్నమైన పాక్ ఉగ్ర సంస్థ జైషేమహ్మద్ కొత్త పన్నాగానికి తెర తీసింది. ఉగ్రకార్యకలాపాల్లో తొలిసారిగా మహిళలను రంగంలోకి దింపేందుకు సిద్ధమైంది. ఐసీస్, బోకో హారమ్, హమాస్, ఎల్‌టీటీఈ వంటి సంస్థలు మహిళా ఉగ్రవాదులను ఆత్మాహుతి దాడులకు ఉపయోగిస్తాయి. అయితే, లష్కర్ ఏ తాయిబాతో పాటు జైష్ మాత్రం మహిళలను యుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉంచుతాయి. కానీ జైష్ తాజాగా తన పంథాను మార్చుకుంది. ఉగ్ర కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు మహిళలనూ రంగంలోకి దించేందుకు సిద్ధమైంది. ఇందుకు జైష్ అధినేత మసూద్ అజర్, అతడి సోదరు తల్హా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు .ఈ మహిళ ఉగ్రమూకల బృందానికి జమాత్ ఉల్ మోమినత్ పేరును ఖరారు చేశారు. ఈ దళానికి జైష్ అధినేత మసూద్ అజర్ సోదరి సాదియా అజర్ నేతృత్వం వహిస్తోంది. ఈ బృందంలో ఇప్పటికే జైషే ఉగ్రవాదుల భార్యలను చేర్చుకుంది. వీరితో ఆత్మాహుతి దాడులు చేయించేందుకు తర్ఫీదునిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత దళాలు జైష్ ప్రధాన కార్యాలయంపై జరిపిన దాడిలో సాదియా భర్త మరణించాడు. ఆర్థికంగా, సామాజికంగా బలహీన స్థితిలో ఉన్న మహిళలను జైష్ ఈ బృందంలో చేర్చుకుంటోంది. బహావల్‌పూర్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లీ, హరీపూర్, మాన్సేరా ప్రాంతాల్లోని తన కేంద్రాల్లో మహిళలను రిక్రూట్ చేసుకుంటోంది. వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కూడా రిక్రూట్‌మెంట్ చేసుకునేందుకు ట్రై చేస్తోంది. భారత్‌లో కూడా జమాత్ ఉల్ మోమినత్ కార్యకలాపాలు విస్తరించేందుకు సిద్ధమైన జైష్ ఆన్‌లైన్ వేదికల ద్వారా జమ్మూకశ్మీర్, యూపీలో తన ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. దక్షిణాదిలోని కొన్ని ప్రాంతాలను కూడా జైష్ టార్గెట్ చేసింది. మతం పేరిట నగరాల్లోని విద్యావంతులైన మహిళను ఉగ్రవాదం వైపు ప్రోత్సహించేలా మక్కా, మదీనాల ఫొటోలతో కూడిన సర్క్యులర్‌లను జారీ చేసింది. ఇక ఆపరేషన్ సిందూర్ దాడుల్లో తమ కుటుంబంలోని పది మంది మరణించారని జైష్ అధిపతి మసూద్ గతంలో ప్రకటించాడు. తన సోదరి, ఆమె భర్త, మరో బంధువు, అతడి భార్య, మేనకోడలు, మరో ఐదుగురు చిన్నారులు మరణించినట్టు తెలిపారు. భారత్ 1994లో మసూద్‌ను అరెస్టు చేసినా ఆ తరువాత ఎయిర్ ఇండియా ఐసీ 814 విమానం హైజాక్ నేపథ్యంలో అతడిని విడిచిపెట్టాల్సి వచ్చింది.



# చైనాలో 5.4 తీవ్రతతో భూకంపం

## భూటాన్‌లోనూ ప్రకంపనలు

**బీజింగ్, అక్టోబరు 9:** చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లో గురువారం తీవ్ర భూకంపం సంభవించింది. అయితే 5.4 తీవ్రతతో సంభవించిన భూకంపం ప్రాంతం పశ్చిమంలోని ఎత్తయిన ప్రాంతాల్లో ఒకటైన గాంజి అని చైనా భూకంప నెట్‌వర్క్ కేంద్రం తెలిపింది. ఈ భూకంపం దాటికి పొరుగున ఉన్న భూటాన్‌లోనూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. భూకంప కేంద్రం గాంజి ప్రాంతంలో పది కిలోమీటర్ల అడుగు ఉందని తెలిపింది. గాంజి ప్రాంతంలో జనసాంద్రత తక్కువగా ఉంటుంది. అయినప్పటికీ ఈ భూకంపం ధాటికి ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రాంతానికి దక్షిణ సరిహద్దులో యున్నాన్, పశ్చిమాన టిబెట్ ఉంది. ఎత్తయిన పర్వతాలతో నిండి కఠిన పరిస్థితులుండే గాంజి ప్రాంతమంటే పర్వతారోహకులకు, ప్రకృతి అన్వేషకులకు చాలా పరిచయమే. అయితే గత ఐదేళ్ల కాలంలో చైనాలో సంభవించిన భూకంపాల తీవ్రతల్లో గురువారం నాటి భూకంపం తీవ్రత ఎక్కువని చైనా భూకంప నెట్‌వర్క్ కేంద్రం వివరించింది.

# చెప్పు విసిరిన లాయర్‌కు సుప్రీంకోర్టులో నోఎంట్రీ!

## కోర్టు బార్ అసోసియేషన్ నిర్ణయం



**న్యూఢిల్లీ, అక్టోబరు 9:** సుప్రీంకోరు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ పై ఓ న్యాయ వాది చెప్పుతో దాడి చేసేందుకు యత్నించిన ఘటన దేశ వ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనను పలువురు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇక సీజేఐపై దాడికి యత్నించిన న్యాయవాది రాకేష్ కిశోర్‌ని సస్పెండ్ చేస్తున్నట్లు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో న్యాయవాది రాకేష్ కిశోర్‌కు సుప్రీంకోర్ట్ బార్ అసోసియేషన్ షాక్ ఇచ్చింది. రాకేష్ సభ్యత్వాన్ని రద్దు చేయడంతోపాటూ సుప్రీంకోర్టు పాంగణం లోకి ప్రవేశించకుండా ఆయన ఎంట్రీ కార్డును రద్దు చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపింది. సీజేఐపై న్యాయవాది రాకేష్ కిశోర్ చేసిన దాడి స్వతంత్ర న్యాయవ్యవస్థపై పవిత్రమైన కోర్టు గది కార్యకలాపాలపై జరిగిన ప్రత్యక్ష దాడిగా అభివర్ణించింది. ఈనెల 6వ తేదీన ఉదయం సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా సీజేఐ జస్టిస్ గవాయ్‌పై ఓ న్యాయవాది బూట్ విసిరేందుకు ప్రయత్నించాడు. లాయర్లు కేసుల గురించి ప్రస్తావిస్తున్నప్పుడు ఈ ఘటన జరిగింది. న్యాయవాది రాకేష్ కిశోర్ వేదిక వద్దకు వెళ్లి తన బూట్‌ను తీసి సీజేఐపైకి విసిరేందుకు ప్రయత్నించాడు. భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి అతడిని అడ్డుకొని అక్కడి నుంచి తరలించారు. ఈ సమయంలో అతడు 'సనాతన ధర్మానికి అవమానాన్ని సహించం' అని గట్టిగా అరిచారు. అయితే దీనిపై సీజేఐ గవాయ్ చలించకుండా వాదనలు కొనసాగించాలని న్యాయవాదులను కోరారు. 'ఇలాంటి వాటితో కలవరపడకండి. మేం కలవరపడలేదు. ఇలాంటివి నన్ను ప్రభావితం చేయవు' అని ఆయన వ్యాఖ్యా నించారు. ఈ ఘటనపై కోర్ట్ భద్రతా యూనిట్ విచారణ ప్రారంభించింది.



# భారత్ అభివృద్ధిపై యుకె పిఎం కీర్ స్టార్మర్ ప్రశంసలు

## డొనాల్డ్ ట్రంప్ డెడ్ ఎకానమీ వ్యాఖ్యలకు కౌంటర్

**న్యూఢిల్లీ, అక్టోబరు 9:** 'భారత్‌ది డెడ్ ఎకానమీ..' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవలే కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్న అక్కసుతోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ డెడ్ ఎకానమీ వ్యాఖ్యలకు యుకె ప్రధాని కీర్ స్టార్మర్ కౌంటర్ ఇచ్చారు. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న యుకె ప్రధాని.. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలను ప్రశంసించారు. భారత్ ఇటీవలే జపాన్‌ను అధిగమించి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని గుర్తు చేశారు. 2028 నాటికి భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా పయనిస్తోందంటూ ప్రశంసలు కురిపించారు. యుకె ప్రధాని కీర్ స్టార్మర్ భారత్ పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. '2028 నాటికి భారత్ మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు గానూ ప్రధాని మోడీ నాయకత్వానికి అభినందనలు. ఇక్కడికొచ్చి ఈ పరిస్థితులు చూస్తుంటే మీరు లక్ష్యాన్ని చేరుకునే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

# కౌంటర్ డ్రోన్ వ్యవస్థ 'సాక్షమ్' ఇక రంగంలోకి

## ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో రూపకల్పన



**న్యూఢిల్లీ, అక్టోబర్ 9:** సరిహద్దుల్లో శత్రు దేశాల నుంచి డ్రోన్ల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో, వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత సైన్యం మరింత ముందడుగు వేసింది. సంపూర్ణ దేశీయ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'సాక్షమ్' అనే అత్యాధునిక కౌంటర్ డ్రోన్ వ్యవస్థను కొనుగోలు చేసే ప్రక్రియను ప్రారంభించింది. ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో ఘజియాబాద్‌లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బిఇఎల్) ఈ వ్యవస్థను రూపొందించింది. ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ ప్రయోగించిన దాదాపు 400 డ్రోన్లను భారత భద్రతా దళాలు విజయవంతంగా నిర్వీర్యం చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత, డ్రోన్లను ఎదుర్కోవడానికి ఒక పటిష్టమైన వ్యవస్థ అవసరాన్ని సైన్యం గుర్తించింది. ఈ నేపథ్యంలోనే సాక్షమ్ కొనుగోలుకు ఫాస్ట్ ట్రాక్ ప్రొక్యూర్‌మెంట్ (ఎఫ్‌టీపీ) విధానంలో ఆమోదం తెలిపింది. రాబోయే ఏడాదిలోగా ఈ వ్యవస్థను అన్ని సైనిక క్షేత్రాలకు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో సైన్యం కేవలం భూభాగంపైనే దృష్టి సారించేది. కానీ ఆధునిక యుద్ధ తంత్రంలో భాగంగా, భూమికి 10,000 అడుగుల ఎత్తు వరకు ఉన్న గగనతలాన్ని కూడా వ్యూహాత్మక యుద్ధ క్షేత్రంగా పరిగణిస్తున్నారు. ఈ ప్రాంతంలో శత్రు డ్రోన్లు, విమానాలను గుర్తించి, వాటిని నాశనం చేస్తూనే మన వైమానిక దళాలకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడటమే సాక్షమ్ ప్రధాన లక్ష్యమని రక్షణ శాఖ అధికారులు వివరించారు. సాక్షమ్ వ్యవస్థ ఒక మాడ్యులర్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్‌గా పనిచేస్తుంది. ఇది శత్రు డ్రోన్లను సరైన సమయంలో గుర్తించడం, ట్రాక్ చేయడం, వాటిని నిర్వీర్యం చేయడం వంటి పనులను చేస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేసే ఈ వ్యవస్థ, ముప్పును ముందుగానే పసిగట్టి కమాండర్లకు వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు సహకరిస్తుంది. సెన్సార్లు, సాఫ్ట్‌కిల్, హార్డ్‌కిల్ ఆయుధ వ్యవస్థలను ఒకే గొడుగు కిందకు తెచ్చి, గగనతలంలో పూర్తి స్థాయి భద్రతను అందిస్తుంది. రష్యాఉక్రెయిన్, ఇజ్రాయెల్ పాలస్తీనా వంటి ఆధునిక యుద్ధాల్లో డ్రోన్ల పాత్ర పెరిగిన తరుణంలో, భారత సైన్యం ఈ వ్యవస్థను సమకూర్చుకోవడం వ్యూహాత్మకంగా ఎంతో కీలకమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# కోల్డ్రిఫ్ కంపెనీ యజమాని చెన్నైలో అరెస్టు



**చెన్నై,అక్టోబరు 9:** దగ్గు మందు అంటే భయపడేలా చేసిన కోల్డ్రిఫ్ కాఫ్ సిరప్‌ను తయారు చేస్తున్న కంపెనీ యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. తమిళనాడులోని చెన్నైలో శ్రేసన్ ఫార్మాస్యూటికల్స్ ఓనర్ రంగనాథన్‌ను మధ్యప్రదేశ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సిరప్ కారణంగా రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో ఇప్పటివరకు 20 మంది చిన్నారులు మరణించారు.చిన్నారుల మరణాలు, అస్వస్థత నేపథ్యంలో కాంచీపూరంలో ఉన్న శ్రేసన్ ఫార్మాస్యూటికల్స్‌లో ఈనెల 1, 2 తేదీల్లో మధ్యప్రదేశ్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్, తమిళనాడు డ్రగ్స్ కంట్రోల్ యూనిట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోల్డ్రిఫ్ సిరప్ తయారీ యూనిట్‌లో గ్యాస్ స్టవ్‌లపైనే రసాయనాలను వేడిచేయడం, తుప్పు పట్టిన పరికరాలు, మురికి పట్టిన పైపులు, గ్లౌజులు, మాస్కులు లేకుండా సిబ్బంది పదార్థాలను మిక్స్ చేయడం వంటివి అధికారులు గమనించారు. అక్కడున్న కార్మికుల్లో దాదాపుగా అనుభవం లేనివారేనని, స్వచ్ఛత పరీక్షలు జరుపకుండానే సిరప్‌ల కోసం నీటిని ఉపయోగిస్తున్నారని తేలింది. ఎయిర్ ఫిల్టర్లు, హెచ్‌ఈపీఏ వ్యవస్థలు లేకపోవడం వంటివి గుర్తించారు.

# అజర్‌బైజాన్ విమానంపై రష్యా క్షిపణుల మిస్‌ఫైర్

## ఉక్రెయిన్‌డ్రోన్లను మట్టుబెట్టే క్రమంలో ప్రమాదం

**మాస్కో, అక్టోబరు 9:** అజర్‌బైజాన్ విమానం కూల్చివేతలో రష్యా ప్రమేయం అనుకోకుండా జరిగిందని, అయితే తాము నేరుగా దాడులకు దిగలేదని, ఉక్రెయిన్‌కు చెందిన డ్రోన్లను మట్టుబెట్టే క్రమంలో తాము ప్రయోగించిన క్షిపణి శకలాలు తగలడం వల్లనే అజర్‌బైజాన్ విమాన ప్రమాదం జరిగిందని మాస్కో అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ పేర్కొన్నారు అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్ విమానం 8243కు క్షిపణి శకలాలు తలడంతో కూలిందని, ఉక్రెయిన్ మూడు డ్రోన్లు తమ సరిహద్దును దాటి రావడంతో వాటిని ట్రాక్‌చేసే క్రమంలో ఈ విమానం ప్రమాదానికి లోనయిందని పుతిన్ అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హాం హైదర్ ఓగ్లు అలియేవ్‌కు స్పష్టంచేసారు. సాంకేతిక లోపం తలెత్తడంతో ఉక్రెయిన్‌డ్రోన్‌పైచేసిన ప్రయోగం మిస్‌ఫైర్ అయిందన్నారు. రెండు క్షిపణులు ఈ ప్యాసింజర్ విమానానికి 33 అడుగుల దూరంలోనే పేలాయి. ఈ ప్రమాదానికి పూర్తి బాధ్యత తీసుకుని సంపూర్ణపరిహారం చెల్లిస్తామని రష్యా ప్రకటించింది.

# నాభర్త మృతి కారకులపై ఎఫ్‌ఐఆర్ నమోదుచేయాలి

## ముఖ్యమంత్రి నాయిబ్‌సింగ్ సైనికి ఐపిఎస్ భార్య లేఖ



**హర్యానా, అక్టోబర్ 09:** తన భర్త మృతికి బాధ్యులైన వారిపై వెంటనే ఎఫ్‌ఐఆర్ నమోదు చేయ్యాలని ప్రభుత్వాన్ని ఐపీఎస్ అధికారి వై. పూరన్ కుమార్ భార్య అమినిత్ పి కుమార్ డిమాండ్ చేశారు. ఆ క్రమంలో హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ కుమార్ సింగ్ సైనీకి ఆమె గురువారం లేఖ రాశారు. సదరు ఉన్నతాధికారులపై సస్పెన్షన్ వేటు వేయాలంటూ ఆ లేఖలో సీఎం సైనీకి ఆమె విజ్ఞప్తి చేశారు. లేకుంటే ఈ కేసు దర్యాప్తులో వారు జోక్యం చేసుకుంటారని సందేహం వ్యక్తం చేశారు. అలాగే సాక్ష్యాధారాలను వారు తారుమారు చేసే అవకాశం ఉందన్నారు. అదే విధంగా ఈ కేసు దర్యాప్తుపై వీరు ప్రభావితం చేస్తారని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. వారి నుంచి తమ కుటుంబానికి ముప్పు పొంచి ఉందని ఆందోళన చెందారు. వారి నుంచి తమకు బెదిరింపులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆ లేఖలో ఆమె స్పష్టం చేశారు. తన కుటుంబానికి రక్షణ కల్పించాలని సీఎం సైనీని ఆమె కోరారు. తన భర్త మరణించి రోజులు గడుస్తున్నా.. నేటికి ఆయనను వేధించి, అవమానించి, మానసిక హింసకు గురి చేసిన వారిపై ఎటువంటి చర్యలు చేపట్టలేదని విచారం వ్యక్తం చేశారు. అదీకాక తన భర్త మృతికి కారకులైన అధికారులంతా ఉన్నత స్థానాల్లో ఉన్నారని ఈ సందర్భంగా ఆమె ఆ లేఖలో వివరించారు. ఈ ఉన్నత స్థాయి శక్తివంతమైన ఈ అధికారులు తనతోపాటు తన కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేయడానికి ప్రయత్నిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ క్రమంలో శాఖ పరంగా లేకుంటే ఇతరత్రా తనను ఇరికించే ప్రయత్నాలు చేయవచ్చని ఈ సందర్భంగా ఆమె భయాందోళన చెందారు. తన భర్త ఆత్మహత్య గురించి తెలిసిన వెంటనేతన కుమార్తెను భర్త ఉన్న ప్రదేశానికి పంపానని ఆ లేఖలో చెప్పారు. ఆ సమయానికి తన భర్త ఇంటి బేస్‌మెంట్‌లో విగత జీవిగా పడి ఉన్నారని తన కుమార్తె వివరించిందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి వై పూరన్ కుమార్ హర్యానా కేడర్‌లో సీనియర్ ఐపీఎస్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన భార్య అమినిత్ పి కుమార్ సైతం అదే రాష్ట్రంలో సీనియర్ ఐఏఎస్ అధికారిగా పని చేస్తున్నారు. అయితే పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకున్న సమయంలో.. అమినిత్ పి కుమార్ జపాన్‌లో పర్యటిస్తున్నారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ బృందం జపాన్‌లో పర్యటిస్తుంది. ఆ బృందంలో ఆమె సైతం ఉన్నారు. హర్యానా పోలీస్ శాఖలో పూరన్ వై కుమార్ తీవ్ర కుల వివక్షకు గురైనట్లు తెలుస్తోంది. ఆ క్రమంలో బుధవారం తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. పూరన్ వై కుమార్ హర్యానాలో అడిషనల్ డీజీపీగా విధులు నిర్వహిస్తున్నారు.


# సంక్షిప్తంగా..

## విజయ్ ఇంటికి మరోసారి బాంబు బెదరింపు



**చెన్నై, అక్టోబరు 9:** ప్రముఖ తమిళ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ అధినేత విజయ్ ఇంటికి బాంబు బెదిరింపు రావడం చెన్నైలో తీవ్ర కలకలం సృష్టించింది. భవిష్యత్తులో బహిరంగ సభలు నిర్వహిస్తే ఆయన ఇంటికి బాంబు పెడతామని ఓ ఆగంతుకుడు పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి హెచ్చరించాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు నీలాంగరైలోని విజయ్ నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసుల కథనం ప్రకారం కన్యాకుమారి నుంచి ఓ వ్యక్తి అత్యవసర నంబర్ 100కు ఫోన్ చేసి ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. కరూర్‌లో తొక్కిసలాట జరిగి 41 మంది మరణించిన నేపథ్యంలో ఈ బెదిరింపు.

## రేసింగ్‌లో ప్రమాదం: నుజ్జునుజ్జయిన పోర్షేకారు



**ముంబయి, అక్టోబరు 9:** ముంబై మహానగరంలో లగ్జరీ కార్ల రేసింగ్ బీభత్సం సృష్టించింది. అత్యంత వేగంతో దూసుకెళ్లిన ఓ పోర్షే కారు అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జు కాగా, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నగరంలోని వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవేపై జోగేశ్వరి మెట్రో స్టేషన్ సమీపంలో గత అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఓ పోర్షే కారు, మరో బీఎండబ్ల్యూ కారు హైవేపై రేసింగ్‌కు దిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. గంటకు సుమారు 150 కిలోమీటర్ల వేగంతో ఈ రెండు కార్లు పోటీ పడుతుండగా, ఉన్నట్టుండి పోర్షే కారు డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు నేరుగా వెళ్లి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ఆ లగ్జరీ కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. రెండు కార్లు ఒకదానితో ఒకటి పోటీ పడుతూ వేగంగా వెళ్లాయి.

## అఫ్ఘాన్ విదేశాంగ మంత్రికి ఘనస్వాగతం

**న్యూఢిల్లీ, అక్టోబరు 9:** ఆఫ్ఘనిస్థాన్ విదేశాంగ శాఖ మంత్రి ఆమిర్ ఖాన్ ముత్తఖీ అధికారిక పర్యటన కోసం గురువారం న్యూఢిల్లీకి చేరుకున్నారు. ద్వైపాక్షిక సంబంధాలు, పలు ప్రాంతీయ అంశాలపై చర్చించేందుకు ఆయన వారం రోజుల పాటు భారతదేశంలో పర్యటించనున్నారు. ఢిల్లీకి చేరుకున్న ముత్తఖీకి భారత విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్వాగతం పలికింది. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. ఇరు దేశాల మధ్య సంబంధాలు, ప్రాంతీయ సమస్యలపై జరగనున్న చర్చల కోసం ఎదురుచూస్తున్నామని పేర్కొంది. ఈ పర్యటనలో భాగంగా ఆమిర్ ఖాన్ ముత్తఖీ భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సమావేశమయ్యే అవకాశాలున్నాయి. వాస్తవానికి ఈ పర్యటన కొన్ని వారాల క్రితమే జరగాల్సి ఉన్నప్పటికీ, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్‌ఎస్‌సీ) విధించిన ప్రయాణ నిషేధం నుంచి మినహాయింపు లభించకపోవడంతో వాయిదా పడింది.

## మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవు: కర్ణాటక కేబినెట్ నిర్ణయం

**బెంగళూరు, అక్టోబర్ 9:** మహిళా ఉద్యోగుల విషయంలో కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నెలకు ఒకరోజు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగినులతో పాటు వస్త్రపరిశ్రమ, బహుళజాతి సంస్థలు, ఐటి కంపెనీలు, ఇతర ప్రైవేట్ పరిశ్రమల్లో పనిచేసే వారికి ఈ సెలవు వర్తించనుందని ప్రభుత్వం వెల్లడించింది. శ్రామిక మహిళల ఆరోగ్యం, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నాం. నెలసరి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు మహిళలకు మానసిక, శారీరక సౌకర్యం అందించాలన్నదే మా ఉద్దేశం. ఈ నిర్ణయం ఉద్యోగినులకు ఎంతగానో ఉపకరించనుంది. ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాలు విజయవంతంగా అమలు చేస్తున్నాయి. అందుకే ఇక్కడా ఆ సెలవును ఇవ్వాలనుకున్నాం అని న్యాయశాఖ మంత్రి హెచ్ కె పాటిల్ వెల్లడించారు.

## 51 మందితో పికె తొలి జాబితా



**పాట్నా, అక్టోబరు 9:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలలో జన్ సురాజ్ పార్టీ ఒంటరిగానే బరిలోకి దిగుతోంది. 51 మంది అభ్యర్థులతో పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ గురువారంనాడు తొలి జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాలో వైద్యులు, మాజీ పోలీస్ అధికారులు, విద్యావేత్తల పేర్లున్నాయి. 1989లో భాగల్పూర్ అల్లర్లను నియంత్రించడంలో నిర్ణయాత్మక పాత్ర పోషించిన మాజీ ఐపీఎస్ అధికారి ఆర్‌కె మిశ్రా 'దర్భంగా' నుంచి పోటీ చేయనున్నారు. ప్రఖ్యాత గణిత శాస్త్రజ్ఞుడు కెసి సిన్హా 'కుమ్రార్' నుంచి. వీరితోపాటు వైద్య నిపుణుడు డాక్టర్ అమిత్ కుమార్ దాస్, పాట్నా హైకోర్టు సీనియర్ న్యాయవాది వైబి గిరి, మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ మనవరాలు జాగృతి ఠాకూర్, మాజీ ఐపీఎస్ అధికారి జైప్రకాష్ సింగ్, సామాజిక కార్యకర్త ప్రీతి కిన్నార్ పోటీచేయనున్నారు.

# శాంతి ప్రణాళికపై ఇజ్రాయెల్-హమాస్ సంతకాలు

## నెతన్యాహు బలమైన నాయకత్వానికి ప్రతిబింబం: మోడీ పోస్ట్



**జెరూసలేం, అక్టోబరు 9:** గత రెండేళ్లుగా సాగుతున్న ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం ముగింపునకు కీలక ముందడుగు పడింది. గాజాలో యుద్ధం ముగించేందుకు ఇజ్రాయెల్, హమాస్ మొదటి దశ శాంతి ఒప్పందానికి అంగీకరించాయి. శాంతి ఒప్పందంపై ఇరుపక్షాలు సంతకం చేసినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ట్రంప్ శాంతి ప్రణాళికకు సంబంధించి మొదటి దశ ఒప్పందాన్ని భారత్ స్వాగతించింది. హమాస్ చేతిలో బందీగా ఉన్నవారంతా త్వరలోనే విడుదల అవుతారని ఈ సందర్భంగా ట్రంప్ తెలిపారు. ఇజ్రాయెల్ తన బలగాలను వెనక్కి తీసుకుంటుందని ట్రంప్ ప్రకటించారు. ఈ చరిత్రాత్మక, అపూర్వ సంఘటన జరగడానికి యుఎస్‌తోపాటు కలిసి పనిచేసిన మధ్యవర్తులు ఖతార్, ఈజిప్ట్, తుర్కియేకు ట్రంప్ ధన్యవాదాలు తెలిపారు.మరోవైపు శాంతి ఒప్పందాన్ని హమాస్ సైతం ధ్రువీకరించింది. గాజాలో యుద్ధానికి ముగింపు పలికేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందని పేర్కొంది. గాజాలో యుద్ధం ముగింపునకు డొనాల్డ్ ట్రంప్ 20 సూత్రాల శాంతి ఫార్ములాను సూచించిన సంగతి తెలిసిందే. ట్రంప్ ఫార్ములాను భారత్ సహా పలు దేశాలు స్వాగతించాయి. ట్రంప్ ఫార్ములాకు ఇజ్రాయెల్, హమాస్ కూడా అంగీకారం తెలిపాయి. తాజాగా ఆ దిశగా తొలి అడుగు పడింది. ఇదిలా ఉండగా.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు బలమైన నాయకత్వాన్ని ప్రశంసిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఈ ఒప్పందం యుద్ధంతో దెబ్బతిన్న గాజా ప్రాంతంలో శాశ్వత శాంతికి మార్గం సుగమం చేస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. 'అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శాంతి ప్రణాళికలోని మొదటి దవ ఒప్పందాన్ని మేము స్వాగతిస్తున్నాం.

10-10pg6exHMNWJQE 10_10-10pg6exHMNWJQE.qxd 10/9/2025 10:38 PM Page 1





## నేడు నెల్లూరు జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన

### విశ్వ సముద్ర ఎథనాల్ ప్లాంట్, నందగోకులం లైఫ్ స్కూల్ ప్రారంభోత్సవం

**విజయవాడ, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం అమరావతి సచివాలయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి నేరుగా నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం, ఎడగాలి గ్రామానికి చేరుకుంటారు. అక్కడ నిర్మించిన నంద గోకులం లైఫ్ స్కూల్‌ను సీఎం ప్రారంభిస్తారు. పాఠశాల విద్యార్థులతో ముఖ్యమంత్రి మాట్లాడనున్నారు. అక్కడికి సమీపంలోనే గోశాలకు హాజరై నంది పవర్ ట్రెడ్ మిల్ మిషిన్, నంద గోకులం సేవ్ ద బుల్ ప్రాజెక్టు, ఎడగాలిలో నూతనంగా నిర్మించిన విశ్వసముద్ర బయో ఎనర్జీ ఎథనాల్ ప్లాంట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం సాయంత్రం సీఎం విజయవాడ చేరుకోనున్నారు.

# రోడ్ల మరమ్మతుల కోసం 1000 కోట్లు

### నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

### స్టేట్ హైవేస్‌లో 108 పనులకు రూ.400 కోట్లు, జిల్లా రహదారుల్లో 166 పనులకు రూ.600 కోట్లు

**విజయవాడ, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో రోడ్ల మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు పాలనాపరమైన అనుమతులను మంజూరు చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 274 రహదారుల మరమ్మతుల కోసం ఈ నిధులను కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. స్టేట్ హైవేస్‌లో 108 పనులకు రూ.400 కోట్లు, జిల్లా రహదారుల్లో 166 పనులకు రూ.600 కోట్లు మంజూరు చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఎనిమిది రాష్ట్ర రహదారులు, ఎనిమిది మేజర్ జిల్లా రహదారుల్లో గుంతలు పూడ్చడం, పూర్తిగా ధ్వంసమైన చోట రోడ్డు అభివృద్ధి చేసేందుకు రూ.108.7 కోట్లు మంజూరు చేసింది. రెండు విభాగాల్లో కలిపి 68.8 కిలోమీటర్ల మేర రహదారులు బాగు చేయనున్నారు. రాష్ట్ర రహదారుల విభాగంలో 52.3 కిలోమీటర్ల మేర మరమ్మతులకు రూ.36.8 కోట్లు, మేజర్ జిల్లా రహదారుల విభాగంలో 56.4 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.31.7 కోట్లు మంజూరు చేశారు. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, ప్రాజెక్ట్ పట్టాలెక్కించేలా అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రహదారి భవనాల శాఖ పరిధిలోని రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 2,104



కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి రూ.1000 కోట్లు కేటాయిస్తూ బుధవారం పరిపాలనా ఉత్తర్వులు జారీ చేసింది. దీనిలో భాగంగా కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, పెద్దాపురం, అమలాపురం, రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లలో రాష్ట్ర, మేజరు జిల్లా రహదారుల అభివృద్ధికి అదనపు ప్రణాళిక కింద నిధులు మంజూరు చేసింది. 27 రహదారులను 161.781 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు రూ.90.25 కోట్లు కేటాయించింది. ఈ ఏడాదిలోనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో నాబార్డు కింద, ప్లాన్ గ్రాంటుగా రోడ్ల అభివృద్ధికి రూ.88 కోట్లు మంజూరు చేసింది. వీటిలో నాబార్డు పనులకు టెండర్లు, ఒప్పందాలు పూర్తయ్యాయి. ప్లాన్ గ్రాంటు పనులకు టెండర్లు పూర్తి కాగా, ఇవి అగ్రిమెంట్ దశలో ఉన్నాయి. ఈ పనులు వచ్చే నెలలో చేపట్టే అవకాశం ఉంది. తాజాగా అదనపు ప్లాన్ కింద మంజూరు చేసిన నిధులకు సంబంధించిన పనులకు వచ్చే నెలలో టెండర్ల ప్రక్రియ చేపడతామని కాకినాడ సర్కిల్‌ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ జి.కంఠు తెలియజేశారు. రానున్న వేసవి నాటికి జిల్లాలోని రాష్ట్ర రహదారులు, మేజరు జిల్లా రహదారులు పూర్తి స్థాయిలో అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అలాగే ఉమ్మడి జిల్లా పరిధిలోని గుంతలు పూడ్చేందుకు వార్షిక ప్రణాళిక కింద రూ.40 కోట్లు ప్రతిపాదనలు పంపామని అన్నారు.



## పోషక్ మా అత్యుత్తమ కార్యక్రమం

### - రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు షేక్ రోఖయా బేగం

**చిత్తూరు, అక్టోబరు 9 ప్రభాతవార్త:** ఆరు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు వున్న పిల్లలు, గర్భిణీలు, కౌమార దశ బాలికలు, పాలిచ్చే తల్లులను లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 8వ రాష్ట్రీయ పోషక్ మా కార్యక్రమం అత్యుత్తమమైనదని రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు షేక్ రోఖయా బేగం పేర్కొన్నారు. చిత్తూరు కొంగారెడ్డిపల్లి గవర్నమెంటు ఐటిఐకి సమీపంలోని సిడిపిఓ కార్యాలయంలో గురువారం జరిగిన పోషక్ మాహ్ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు షేక్ రోఖయా బేగం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రం నుండి గర్భిణీలు, బాలింతలు, తక్కువ వయస్సు వున్న పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. గర్భిణీలు, పాలు ఇచ్చే బాలింతలు పూర్తి స్థాయిలో పౌష్టిక ఆహారంను తీసుకోవాలని, తద్వారా ఆరోగ్యకర పిల్లలు పుట్టి రాబోయే రోజుల్లో భావి భారత పౌరులుగా తీర్చిదిద్దబడతారన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరీ మాట్లాడుతూ జిల్లాలో పోషక్ మాహ్ కార్యక్రమం పక్కాగా అమలు చేసి అర్హులైన గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు పౌష్టికాహారంను అందిస్తున్నామన్నారు. గర్భిణీలు మంచి పౌష్టికాహారం తీసుకుని అనిమియా బారిన పడకుండా అహ్లాదకరమైన పరిస్థితులను కల్పించుకోవాలన్నారు. ఈ కార్యక్రమలో సిడిపిఓ సుగుణకుమారి, డిసిసిఓ సుబ్రమణ్యం, ఐసిడిఎస్ సూపర్‌వైజర్స్, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

## కాల్లో గౌరమ్మ.. నీటిలో గౌరమ్మ.. అట్లతద్దె ఆరట్లు.. ముద్దపప్పు మూడట్లు



**అంబాజీపేట, అక్టోబరు 9 ప్రభాతవార్త:** తెలుగువారి ముఖ్య మైన పండుగలలో అట్లతద్ది ఒకటి. ఆశ్రయుజ బహుళ తిదియ నాడు జరుపు కోవడం ఆనవాయితీగా వస్తుంది. అట్ల తద్దె ఆరట్లు... ముద్దపప్పు మూడట్లు.. అంటూ ఆడపడుచులకు, బంధువులకు ముత్తయిదువులకు వాయినాలివ్వడం పరిపాటి. అచ్చ తెలుగు సంప్రదాయానికి ప్రత్యేకగా ముత్తైదువులు, కొత్తగా పెళ్లయిన యువతులు పెళ్లి కాని యువతులు నిర్వ హించుకునే ఆరణాల తెలుగు మహిళ పండగ అట్ల తదియ. సాయం సమయ మందు ముత్తయిదువులకు 11 అట్లు, 11 ఫలాలు, పసుపు కుంకుమ, గాజులు, రవికల ముక్కలు వాయినాలను ఇస్తినమ్మ వాయనం.. పుచ్చుకుంట ి నమ్మ వాయనం.. అందించినమ్మ వాయనం.. అందుకున్నానమ్మ వాయనం.. అంటూ వాయినాలు అందించి, నైవైద్యాలు పూర్తిచేసుకుని గోపూజ చేసి, కాల్లో గౌరమ్మ.. నీటిలో గౌరమ్మ అంటూ పాటల పాడుతూ చెరువులు, కాలువలలో పెళ్లిరోజును కట్టుకున్న పట్టుచీరను ధరించి, మట్టిని, వరి దబ్బు లను, నవధాన్యాల తో మొలకెత్తిన మొక్కలను, దీపాలను వదిలి, చెట్లకు ఊయలలు కట్టి ఊగుతారు. ముత్తయిదువులు సౌభాగ్యం చేసుకొనే అట్లతద్ది వ్రతంలో చంద్రారాధన ప్రధానమైన పూజ. చంద్రకళలో కొలువైవున్న శక్తి అనుగ్రహం చేత సౌభాగ్యం పెరుగుతుందని, కుటుంబంలో సుఖశాంతులు వర్ధిల్లుతాయని శాస్త్రవచనం. ఈ అట్లతద్ది పండుగను ఉయ్యాల పండగ, గోరింటాకు పండగ అని కూడా అంటారు. కన్నెపిల్లలు పడుచు వాణ్ణి పతిగా పొందాలనుకుంటే తప్పక ఈ వ్రతంను ఆచరించాలని శాస్త్రం చెబుతోంది.

## మైనారిటీ యువతకు ఖతార్‌లో ఉద్యోగ అవకాశాలు

- 13న విజయవాడలో ఎంపిక ఇంటర్వ్యూలు
- నిరుద్యోగ మైనారిటీ యువత సద్వినియోగం చేసుకోవాలి
- రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి



**విజయవాడ, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని నిరుద్యోగ మైనారిటీ యువతకు ఖతార్ దేశంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలను కూటమి ప్రభుత్వం కల్పించడంలో భాగంగా ప్రత్యేకంగా ఎంపిక ఇంటర్వ్యూ లను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ గురువారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ప్రభుత్వం, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (ఓఎంసిఏపీ)ద్వారా ఖతార్ దేశంలోని దోహ్ ప్రాంతంలో హోమ్ కేర్ నర్స్ (రిజిస్టర్డ్ నర్స్) ఉద్యోగాల కొరకు అర్హులైన అభ్యర్ధుల నుండి దరఖాస్తులు ఆహ్వానించడం జరిగిందన్నారు. అర్హులైన మైనారిటీ వర్గాల యువతీ యువకులు ఈ క్రింద తెలపబడిన రిజిస్ట్రేషన్ లింక్ (http://naipunyam.ap.gov.in/) ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. హోమ్ కేర్ నర్స్ ఉద్యోగానికి దరఖాస్తు చేసే యువతీ యువకుల వయస్సు 21 నుంచి 40 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. బి.ఎస్సీ లేదా జి.ఎన్.యమ్ నర్సింగ్ విద్యార్హత ఉండి, అనుభవం కూడా ఉండాలన్నారు. ఎంపికైన వారికి నెలకు జీతము సుమారు రూ.1.20 లక్షలును ఆదాయపు పన్నును మినహాయించి పొందవచ్చునని, ఉచిత వసతి, రవాణా సదుపాయం కల్పించబడుతుందని తెలిపారు. ఆన్ లైన్ ద్వారా నమోదును ఈనెల 12వ తేదీ లోపు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలను 13 వ తేదీ నిర్వహించడం జరుగుతుందని, రిజిస్ట్రేషన్ చేసుకోలేక పోయినవారు అదే రోజు ఉదయం 10గంటలకు ఓ ఎం సి ఏ పి కార్యాలయం, గవర్నమెంట్ ఐ.టి.ఐ. కాంపస్, రమేష్ ఆసుపత్రి రోడ్డు, విజయవాడ 520008 నందు జరిగే ఇంటర్వ్యూకు నేరుగా హాజరు కావచ్చునని మంత్రి ఫరూక్ తెలిపారు. కూటమి ప్రభుత్వం నేతృత్వంలో మైనారిటీ వర్గాల అభివృద్ధికి అందించబడుతున్న ఈ అవకాశాన్ని బి.ఎస్సీ/నర్సింగ్ అర్హత కలిగిన మైనారిటీ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని మంత్రి సూచించారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు కోసం 9988853335, 8712655686, 8790118349, 8790117279 ఈ ఫోన్ నెంబర్లకు సంప్రదించడం ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

## లులుకు భూ కేటాయింపుపై హైకోర్టులో మాజీ మంత్రి వడ్డే పిల్

### రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ

**విజయవాడ, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో ఆర్టీసికి చెందిన 4.15 ఎకరాలను లులు అంతర్జాతీయ షాపింగ్ మాల్ సంస్థకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోతో పాటు బిడ్డింగ్ విధానాన్ని అనుసరించకుండా వివిధ సంస్థలకు భూ కేటాయింపు చేసేందుకు జారీ చేసిన జీఓను సవాలు చేస్తూ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టు స్పందించింది. వివరాలతో కౌంటర్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసి, లులు సంస్థ ఎండీకి నోటీసులు జారీ చేసింది. ఇదే వ్యవహారంపై గతంలో దాఖలైన పిటీషన్లతో ప్రస్తుత పిల్‌ను జతచేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. విచారణను డిసెంబరు 3కు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవిలతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. అంతకుముందు పిటీషనర్ తరపున సీనియర్ న్యాయవాది ఎ.సత్యప్రసాద్ వాదనలు వినిపిస్తూ బిడ్డింగ్ విధానంలో భూకేటాయింపులు జరిపేందుకు 2012లో ప్రభుత్వం పాలసీని తీసుకొచ్చిందన్నారు. దానికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో జీవో 1 జారీ చేసిందన్నారు. భారీ, అతి భారీ, మెగా ప్రాజెక్టులుగా వర్గీకరించి భూమి విలువలో 1శాతానికి 99ఏళ్ళ లీజుకు ఇచ్చేందుకు నిర్ణయించిందని తెలిపారు. అందులో భాగంగా లులు సంస్థకు ఆర్టీసికి చెందిన భూములు కేటాయించారని వివరించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... ప్రతివాదులు కౌంటర్లు దాఖలు చేశాక విచారణ జరుపుతామని పేర్కొంది.

# రైల్వే విద్యుదీకరణ 99 శాతం పూర్తి



**గుంతకల్లు రైల్వే, అక్టోబరు 9 ప్రభాతవార్త:** ప్రస్తుత 2025-26 తొలి అర్ధ సంవత్సరంలో రైల్వే విద్యుదీకరణ ప్రాజెక్టు పనులు 99శాతం మైలురాయిని దాటాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రైల్వే శాఖ రూ.6,150 కోట్ల బడ్జెట్‌ను విద్యుదీకరణకు కేటాయించింది. ఈఏడాది

### 69,894 కి.మీటర్లకు 69,248 కి.మీటర్ల విద్యుదీకరణ

సెప్టెంబర్ 30 నాటికి దేశవ్యాప్తంగా 25 రాష్ట్రాలలో (14 రైల్వే జోన్‌లలో) వంద శాతం మైలురాయిని అధిగమించింది. 1925-2025 మధ్య వందేళ్ళలో 69,894 కిలోమీటర్లకు గాను, 69,248 రూట్ కిలోమీటర్ల (ఆర్‌కెఎం )ను విద్యుదీకరించడం ద్వారా 99.1 శాతం మేర విద్యుదీకరణ పనులను రైల్వేశాఖ పూర్తిచేసింది. ఇప్పటికే వందశాతం రైల్వే విద్యుదీకరణ పూర్తి అయిన రాష్ట్రాలు: ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, బీహార్, చండీగఢ్, ఛత్తీస్‌గఢ్ ,ఢిల్లీ, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, జార్ఖండ్, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మేఘాలయ, నాగాలాండ్, ఒడిశా, పాండిచ్చేరి, పంజాబ్, తెలంగాణ, త్రిపుర, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్, మిజోరం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో సెప్టెంబర్ ఆఖరునాటికి విద్యుదీకరణ వందశాతం పూర్తికాగా, రాజస్థాన్‌లో 99శాతం, కర్ణాటక 96.49శాతం, తమిళనాడు 97శాతం, గోవా 91.44శాతం, అసోం 99శాతం చొప్పున మొత్తంగా 69,894 కిలోమీటర్లకు గాను, 69,248 ఆర్‌కెఎంల మేర పూర్తి చేసి 99.1శాతం మేర బ్రాడ్ గేజ్ రూట్ కిలోమీటర్ల లను విద్యుదీకరించగా, మిగిలిన 646 కిలో మీటర్ల రైలుమార్గాన్ని 2026నాటికి దేశవ్యాప్తంగా వంద శాతం విద్యుదీకరించ నున్నట్లు రైల్వే అధికారవర్గాలు తెలిపాయి. రైల్వే జోన్‌ల వారిగా పరిశీలిస్తే... సెంట్రల్ రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే, ఈస్ట్ సెంట్రల్ రైల్వే, కొంకణ్ రైల్వే, మెట్రో రైల్వే, నార్త్ సెంట్రల్ రైల్వే, నార్త్ ఈస్టర్న్ రైల్వే, నార్ధన్ రైల్వే, దక్షి ణ మధ్య రైల్వే, సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే, ఆగ్నేయ రైల్వే, వెస్ట్ సెంట్రల్ రైల్వే, వెస్టర్న్ రైల్వే జోన్‌లలో వందశాతం విద్యుదీకరణ పూర్తి కాగా, నార్త్ వెస్టర్న్ రైల్వేలో 98 శాతం, సదరన్ రైల్వే 98 శాతం, నైరుతి రైల్వే 95 శాతం, ఈశాన్య సరిహద్దు రైల్వేలో 94 శాతం మేర భారతీయ రైల్వేలో 99.1 విద్యుదీకరణ పూర్తి అయింది.




## బాణసంచా నిల్వలు, అమ్మకాలపై నిఘా పెట్టండి

### ఎన్టీఆర్ కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** బాణసంచా అక్రమ నిల్వలు, అమ్మకాలపై అధికారులు నిరంతరం నిఘా నిర్వహించాలని, నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిల్వలు, అమ్మకాలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా .జి.లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 21 నా దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచ నిల్వలు, అమ్మకాల పర్యవేక్షణపై గురువారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ నుండి రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ, మున్సిపల్, వైద్య ఆరోగ్యం, పౌర సరఫరాలు, విద్యుత్ తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీపావళి పండుగ దృష్టిలో పెట్టుకొని బాణసంచా అమ్మకం దారులు పెద్దయెత్తున అక్రమ నిల్వలు చేసే అవకాశం ఉంటుందన్నారు. బాణసంచా అక్రమ నిల్వలు అమ్మకాలు రవాణా పై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అనుమతి లేకుండా బాణసంచను నిల్వ ఉంచి, అమ్మకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అనుమతులకు మించి దుకాణం వద్ద అధిక స్టాక్ ఉంచే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, హెచ్ఎండిఆర్ఓ ఎం లక్ష్మీ నరసింహం, డీసీపీ కేజీవీ సరిత, అగ్నిమాపక అధికారి శంకర్‌రావు, వీఎంసీ అగ్నిమాపక అధికారి నరేష్, ఆర్డీవోలు కె.చైతన్య, కె.మాధురి బాలకృష్ణల్ డీఎంహెచ్‌వో ఎం. సుహాసిని, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఔషధ దుకాణాల్లో కాలం చెల్లిన, నిషేధిత మందులు విక్రయిస్తే కఠిన చర్యలు

ఔషధ దుకాణాల్లో కాలం చెల్లిన, నిషేధిత మందులు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ హెచ్చరించారు కలెక్టర్ లక్ష్మీశ కలెక్టర్ కార్యాలయంలో ఔషధ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఔషధ దుకాణాల కార్యకలాపాలపై ఆరా తీశారు. అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనముతో నిబంధనల మేరకు దుకాణాలు నిర్వహించేలా నిరంతర పర్యవేక్షణ అవసరమని స్పష్టం చేశారు. అనుభవం లేని వ్యక్తులు మందులు విక్రయిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని.. ఎప్పటికప్పుడు తనిఖీలకు సంబంధించి నివేదికలు అందించాలని ఆదేశించారు. సమావేశంలో ఔషధ నియంత్రణ పరిపాలన అసిస్టెంట్ డైరెక్టర్ కె. అనిల్ కుమార్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు హాజరయ్యారు.



దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

## రేపు దుర్గమ్మ ఆలయం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

**ఇంద్రకీలాద్రి, అక్టోబరు 9 ప్రభాతవార్త:** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ వారి ఆలయంలో ఆలయానికి ప్రభుత్వం నియమించిన నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం ఈనెల 11న నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. దుర్గమ్మవారికి ఈనెల 23వ తేదీ గాజుల అలంకారం నిర్వహిస్తామని చెప్పారు. దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన టి.ఈశ్వర దుర్గా నాగేంద్ర గురువారం వారి కుటుంబ పేరిట రు.5,89,055ల విరాళం అందించారు. అలాగే విజయవాడకు చెందిన డి రంగారావు తన తండ్రి డి లక్ష్మ్మయ్య జ్ఞాపకార్థం రు.2,02,116ల విరాళాన్ని అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు అందించారు.

## స్థానిక ఎన్నికల్లో లబ్ధి కోసమే తెలంగాణలో బిసి రిజర్వేషన్

### జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు లాకా వెంగళరావు



**విజయవాడ, అక్టోబరు 9 ప్రభాతవార్త:** బీసీ రిజర్వేషన్ల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికల లబ్ధి పొందడం కోసం దోబూచులాటాడుతోందని బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు లాకా వెంగళరావు యాదవ్ ప్రకటనలో ఎద్దేవా చేశారు. 45 సంవత్సరాల పైబడి ఈ దేశాన్ని, అనేక రాష్ట్రాలు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ బీసీలకు రిజర్వేషన్‌లు ఇచ్చి బీసీలను అభివృద్ధి చేసి న్యాయం చేయాలని కానీ బీసీలకు చట్టసభల్లో అవకాశం కల్పించాలి అని ఎక్కడ చేసిన సందర్భం లేదన్నారు. మరి నేడు తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో లబ్ధి పొందడం కోసం బీసీలకు 42 రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పేసి జీ.వో నెంబర్ నైన్ తీసుకొచ్చి వెనకవైపు నుండి పాలించే నాయకులే స్థానిక సంస్థల రిజర్వేషన్లు అమలు జరగకుండా తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేయించి అడ్వకేట్లు పెట్టించి వారే స్టే తీసుకొచ్చి దొంగాట ఆడుతున్నదని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని మరోసారి నిరూపితమైందన్నారు. జనాభా దామాషా ప్రకారం స్వాతంత్రం వచ్చి నాటి నుండి నేటి వరకు కూడా రాష్ట్రాలలో బిసిలకు అన్యాయం జరుగుతోందన్నారు. ప్రభుత్వాలు ఎన్ని వచ్చినా రాజ్యాధికారంలో బిసిలకు భాగస్వామి కల్పించడంలో ప్రభుత్వాలన్నీ ఘోరంగా విఫలం చెందాయని విమర్శించారు. కావున బీసీ సోదరులు ఎక్కడ న్యాయం జరుగుతుంది ఏ విధంగా బీసీలకు రాజ్యాధికారం వస్తుంది అనే ఆలోచన చేసి రాజ్యాధికారం కోసం పోరాటం చేయవలసిన ఆవశ్యకత ఉందని లాక వెంగళరావు యాదవ్ తెలియజేశారు.

## సదరం సర్టిఫికెట్ జారీకి లంచం డాక్టరుకు ఉద్వాసన

**విజయవాడ, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** సదరం సర్టిఫికెట్ జారీకి లంచం అడిగిన ఒక వైద్యున్ని ఏపీ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశాల మేరకు ఉద్యోగం నుంచి తొలిగించారు. మానసిక వైకల్యంతో బాధపడుతున్న ఒక యువతికి సదరం సర్టిఫికేట్ కోసం ఆమె తండ్రి నుంచి లంచం డిమాండ్ చేసిన ఒక ప్రభుత్వ వైద్యుడి పై ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్వయంగా ఏసీబీ విచారణ ఆదేశించారు. అనంతరం ఆ నివేదికపై మళ్ళీ మంత్రి విచారించారు. ఆపై వైద్యున్ని తక్షణమే విధుల నుండి తొలగించాలని మంత్రి గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఏప్రిల్ 2022లో జరిగిన ఈ సంఘటన జరిగింది. మానసిక సమస్యలతో బాధపడుతున్న ఒక బాలికకు సదరం సర్టిఫికెట్ జారీ చేయడానికి వైయస్సార్ కడప జిల్లా ప్రభుత్వ సర్వజనాసుపత్రి (జిజిహెచ్)లో పిల్లల మానసిక వైద్య నిపుణుడిగా పనిచేస్తున్న ఒక డాక్టరు ఆ బాలిక తండ్రి నుంచి రూ.10 వేలు లంచాన్ని అడిగారు. అంత ఇచ్చుకోలేనని, రూ.5 వేల వరకు ఇవ్వగలనని తండ్రి ప్రాధేయపడ్డారు. వైద్యుడు అంగీకరించకపోవడంతో దిక్కుతోచని ఆ తండ్రి చివరిగా రూ.7వేలు ఇచ్చేందుకు సిద్ధపడ్డాడు. ఆయినా రూ.10వేలు ఇవ్వాల్సిందేనని, అది కూడా రెండ్రోజుల్లో ఏర్పాటు చేయాలని ఆ వైద్యుడు గడువు పెట్టాడు. గతిలేని పరిస్థితుల్లో ఆ తండ్రి జిల్లా కలెక్టర్ నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. ఈ విషయాన్ని పరిశీలించాలని అధికారులు ఎసిబిను కోరగా, వారు విచారణ చేపట్టారు. సాక్షుల వాంగ్మూలాలు, లభించిన పత్రాల ఆధారంగా లంచం ఆరోపణ వాస్తవమేనని ఏప్రిల్ 2025లో ఎసిబి తన నివేదికలో స్పష్టం చేసింది. సదరు వైద్యుడు కాంట్రాక్ట్ సేవలందిస్తున్నందున అతనిపై తక్షణమే చర్యలు చేపట్టాలని సిఫారసు చేసింది. మానసిక సమస్యలతో సతమతమవుతున్న బాలిక దుస్థితిని గమనించకుండా తన స్వార్జన కోసం అడ్డదారులు తొక్కాలనుకున్న ఆ వైద్యుడి వైఖరిని తీవ్రంగా పరిగణించిన మంత్రి సత్యకుమార్ యాదవ్ అతనికి తక్షణమే ఉద్వాసన పలకాలని ఆదేశాలు జారీ చేశారు.




## రెడ్ క్రాస్ సేవలు ప్రశంసనీయం

**విజయవాడ, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** దసరా మహోత్సవాలలో రెడ్ క్రాస్ సంస్థ అందించిన సేవలు ప్రశంసనీయమైనవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. స్థానిక కలెక్టరేట్లో జరిగిన రెడ్ క్రాస్ వాలంటీర్ల అభినందన సభకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ. దసరా మహోత్సవాలలో వృద్ధులకు, దివ్యాంగులకు రెడ్ క్రాస్ వాలంటీర్లు మంచి సేవలు అందించారని చెప్పారు. ఉత్సవాలు 11 రోజులపాటు జరిగినా, లక్షలాది భక్తులు హాజరైనా రెడ్ క్రాస్ వాలంటీర్లు అలుపెరగకుండా రాత్రింబవళ్లు పనిచేశారని చెప్పారు. ఉత్సవాలు విజయవంతంగా ముగియడంలో రెడ్ క్రాస్ పాత్ర కూడా ఉందన్నారు. ఇదే సేవాభావంతో భవిష్యత్తులో మరిన్ని ప్రజోపయోగ కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని సూచించారు. ఉత్తమ సేవలు అందించిన రెడ్ క్రాస్ వాలంటీర్లకు జిల్లా కలెక్టర్ అభినందన పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఇ.చిట్టిబాబు, సిద్ధార్థ ఫార్మసీ కళాశాల, కేబీఎన్ కళాశాల, పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాలల రెడ్ క్రాస్ యూత్ వింగ్ వాలంటీర్లు, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

10-10P g7exHMNWJQE 11_10-10P g7exHMNWJQE.qxd 10/10/2025 12:12 AM Page 1



# 5 వర్సిటీలకు విసిల నియామకం

**విజయవాడ, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో అయిదు విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులు (వైస్ చాన్సలర్స్)లను ప్రభుత్వం నియమించింది. ఆయా వర్సిటీలకు వీసీలను నియమిస్తూ గవర్నరు జస్టిస్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విసిగా సామంతపూడి వెంకట సత్యనారాయణరాజు, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విసిగా తాతా నరసింగరావు, వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం విసిగా బి జయరామిరెడ్డి, జెఎన్‌టియు (విజయనగరం) విసిగా వెంకట సుబ్బారావును, యోగి వేమన విశ్వవిద్యాలయం (కడప) విసిగా బెల్లంకొండ రాజశేఖర్‌ను నియమిస్తూ గత రాత్రే విడివిడిగా గవర్నరు జస్టిస్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ విడుదల చేశారు.

# నిరుద్యోగుల గరిష్ఠ వయోపరిమితి 34 నుంచి 42 యేళ్లకు పెంపు

**విజయవాడ, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** నాన్ యూనిఫాం సర్వీసులలోని పోస్టులకు నిరుద్యోగుల గరిష్ట వయోపరిమితిని 34 ఏళ్ళ నుంచి 42 ఏళ్ళ వరకు ప్రభుత్వం పొడిగించింది. యూనిఫాం పోస్టులకు వచ్చేసరికి గరిష్ట వయోపరిమితిని రెండేళ్ళకు పెంచింది. దీనికి సంబంధించి వేర్వేరుగా రెండు ఉత్తర్వులను బుధవారం జారీ చేసింది. వచ్చే ఏడాది సెప్టెంబరు 30 వరకు ఈ సడలింపు వర్తిస్తుంది. ఏపీపీఎస్సీ,ఇతర నియామ సంస్థల ద్వారా ఇక నుంచి చేపట్టే నియామకాలకు ఈ గరిష్ట వయోపరిమితి పొడిగింపు వర్తిస్తుందని ప్రభుత్వం పేర్కొంది.

# కొల్లేరులో ఆక్రమణల తొలగింపుపై నిర్మాణాత్మక ప్రతిపాదన సమర్పణకు 4 వారాల గడువివ్వండి

## సుప్రీంకోర్టును కోరిన ఏపీ ప్రభుత్వం

**విజయవాడ, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** కొల్లేరు సరస్సులో ఆక్రమణల సమస్యకు పరిష్కారం చూపడానికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇందులో భాగంగా సరిహద్దుల నిర్ధారణ చేస్తున్నట్లు పేర్కొంది. దీనికి సంబంధించిన కేసు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం విచారించారు. ఈ సందర్భంగా రాష్ట్రప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు క్షేత్రస్థాయి పరిస్థితులను వివరించారు. మరింత నిర్మాణాత్మక ప్రతిపాదనలతో రావడానికి తమకు నాలుగు వారాల సమయం ఇవ్వాలని కోరారు. 'కొల్లేరులో 14 వేల ఎకరాల భూమిని ఆక్రమించిన రైతులను గుర్తించాం. వారందరినీ ఇతర ప్రాంతాలకు తరలించాల్సి ఉంది. అయితే వారంతా తమకు స్థానికంగానే ప్రత్యామ్నాయ భూములు కోరుతున్నారు. అది అసాధ్యంగా కనిపిస్తోంది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాల ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తోంది. అందువల్ల 4 వారాల సమయమిస్తే నిర్మాణాత్మక ప్రతిపాదనతో వస్తాం. ఇది చాలా లోతైన కసరత్తుతో కూడుకున్న పని అయినందున పరిష్కారానికి కొంత సమయం పడుతుంది' అని పేర్కొన్నారు. ఈ విజ్ఞప్తి పట్ల పిటీషనర్ మృత్యుంజయరావు తరపు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు 2006లో ఇచ్చిన తీర్పును ఇప్పటికీ అమలు చేయకుండా ప్రభుత్వం కోర్టును తప్పుదోవ పట్టిస్తోందని పేర్కొన్నారు. ఈ వాదనలను ప్రభుత్వ న్యాయవాది శేషాద్రి నాయుడు తోసిపుచ్చారు. సీఈసీ దీనిపై అధ్యయనం చేస్తోందని చెప్పారు. జస్టిస్ గవాయి స్పందిస్తూ క్షేత్రస్థాయి పరిస్థితులు, మానవ సంబంధ సమస్యలుంటాయి. వేల మందిని తరలించాల్సి ఉంటుంది' అని పేర్కొంటూ విచారణ ముగించారు. తదుపరి విచారణను నవంబరు 11కి వాయిదా వేశారు.



రజతోత్సవాల ప్రత్యేక సంచికను విడుదల చేసిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

# భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ఎంతో గొప్పవి

**సికింద్రాబాద్, అక్టోబరు 9 ప్రభాతవార్త:** భారతీయుల జీవన ప్రమాణాలు, సనాతన ధర్మం, సంస్కృతి సాంప్రదాయాలు ఎంతో గొప్పవని, అవి మన వేద విజ్ఞానంతో ముడిపడి ఉన్నాయని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మన ప్రాచీన సంస్కృతి, అసలైన దేశ చరిత్ర నేటితరం తెలుసుకోవాలని ఆయన సూచించారు. పద్మారావునగర్‌లోని స్కందగిరి సుబ్రమణ్య స్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీ జనార్ధనానంద సరస్వతి స్వామి సంస్కృతి ట్రస్ట్ రజతోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ వేద విద్వాన మహాసభల నిర్వాహకులను ఆయన అభినందించారు. రజతోత్సవాల ప్రత్యేక సంచికను ఆయన విడుదల చేశారు. శ్రీ స్కందగిరి సుబ్రమణ్య స్వామి ఆలయం చైర్మన్ ఎల్వీ సుబ్రమణ్యం, శ్రీ జనార్ధనానంద సరస్వతి స్వామి సంస్కృతి ట్రస్ట్ చైర్మన్ తూములూరి సాయినాథ శర్మ, కార్యదర్శి బ్రహ్మానంద శర్మ, చింతపల్లి సుబ్రమణ్యం, ఎన్వీ, శ్రావణ్ పాటు పలువురు ప్రముఖులు, వేద పండితులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



ఎపిజిఇఎ నర్సుల విభాగం రాష్ట్ర చైర్‌పర్సన్‌గా మంజులాదేవి

**విజయవాడ, అక్టోబరు 9 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎపిజిఇఎ) నర్సుల విభాగానికి రాష్ట్ర చైర్ పర్సన్‌గా డి. మంజులా దేవి నియమితులనట్లు గురువారం విజయవాడలోని ఎంపిజిఇఎ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో అధికారికంగా ప్రకటించారు. ఈ సమావేశానికి ఎంపిజిఇఎ రాష్ట్ర అధ్యక్షుడు కె. ఆర్. సూర్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ఎం. రమేష్ కుమార్, రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి జి. నాగసాయి ప్రధాన అతిథులుగా హాజరయ్యారు. విశాఖపట్నం, నెల్లూరు, కర్నూలు, విజయవాడ, తిరుపతి, చిత్తూరు జిల్లాల నుండి నర్సుల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నర్సింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న పలు సమస్యలు, సేవా సంబంధిత అంశాలపై చర్చ కూడా ఈ సందర్భంగా జరిగింది. ఈ సందర్భంలో సంఘం నాయకులు నర్సుల విభాగాన్ని మరింత బలోపేతం చేయడం, నర్సింగ్ సిబ్బంది సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డి. మంజులా దేవి మాట్లాడుతూ, ఈ బాధ్యతను ఇవ్వడం పట్ల ఏపీ జీఈఏ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని నర్సింగ్ సిబ్బంది సంక్షేమం కోసం కృషి చేస్తానని ఆమె తెలిపారు.

# పెరుగుతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలు

## 2024-25లో 1,19,187 మెట్రిక్ టన్నులు వ్యర్థాలు విడుదల యుపి, హర్యాన తర్వాత తెలంగాణంలో ఈ వేస్ట్ వ్యర్థాలు అత్యధికం



**హైదరాబాద్, అక్టోబరు 9 ప్రభాతవార్త:** సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో అంతకు రెట్టింపు వేగంతో ఎలక్ట్రానిక్స్ వ్యర్థాలు (ఈ వేస్ట్) విడుదల అవుతున్నాయి. సెల్ ఫోన్, కంప్యూటర్, ల్యాప్టాప్, రిఫ్రిజిరేటర్ ఎన్ ప్రింటర్లు ఇలా ప్రతి ఎలక్ట్రానిక్ ఉత్పత్తి వినియోగం తర్వాత వ్యర్థాలుగా మారుతున్నాయి. తెలంగాణలో తొలిసారిగా ఈ వేస్ట్ లక్ష మెట్రిక్ టన్నుల మార్క్‌ను దాటింది. 2024 -25లో 1.19.187 మెట్రిక్ టన్నుల ఈ వేస్ట్ విడుదలయ్యాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. అదే 2023-24లో 5.228 మెట్రిక్ టన్నుల ఈ వేస్ట్ విడుదలైంది. అంటే ఏడాది కాలంలో రాష్ట్రంలో అదనంగా 53,961 మెట్రిక్ టన్నులు ఈ వ్యర్థాలు విడుదలయ్యాయి. దేశంలో ఉత్తరప్రదేశ్ హరియాణా తర్వాత దేశంలో అత్యధిక ఈ వ్యర్థాలు విడుదలవుతున్నది. మన రాష్ట్రం లోనే తెలంగాణలో అధికంగా ఈ వేస్ట్ విడులయ్యేది హైదరాబాద్ నుంచే గత ఐదేళ్లలో నగరంలో ఉత్పత్తి అయ్యే ఎలక్ట్రానిక్ వ్యర్థాల పరిమాణం గణనీయంగా పెరుగుతుందని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2017 -18లో నగరంలో 33,425 మెట్రిక్ టన్నుల ఈ వ్యర్థాలు ఉత్పత్తికాగా ఇప్పుడది 50.835 మెట్రిక్ టన్నులు పెరిగాయి.

ఈ వేస్ట్ ప్రాసెసింగ్ దేశంలో ఈ వ్యర్థాల ప్రాసెసింగ్ సామర్థ్యం 13.97 మెట్రిక్ టన్నులు కాగా ఇందులో 8.5 శాతం ప్రాసెసింగ్ వృద్ధిలో ఉత్తరప్రదేశ్ తర్వాత తెలంగాణ రెండో స్థానం లో ఉంది. 2001-22 నుంచి ఈ వేస్ట్ ప్రాసెసింగా మూడు రెట్లు వృద్ధి చెందుతోంది. ఐటీ సంస్థల కార్యకలాపాలు పెరుగుతున్న ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం దుడుకైన ఈ వేస్ట్ నిర్వహణ విధానాలు ప్రాసెసింగ్ వృద్ధికి ప్రధాన కారణాలు 2021-22లో 42,297 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ప్రాసెసింగ్ కాగా గత ఆర్థిక సంవత్సరానికి 19 లక్ష మెట్రిక్ టన్నులకు పెరిగింది. అయితే రాష్ట్రంలో కేవలం 15 రీసైక్లింగ్ కేంద్రాలే ఉన్నప్పటికీ ప్రాసెసింగ్‌లో ఈ స్థాయిలో వృద్ధి నమోదు కావడం గమనార్హం. ఈ వ్యర్థాలు ప్రజారోగ్యం, పర్యావ రణంపై ప్రభావం చూపిస్తుందని పర్యావరణ నిపుణులు ఆందోళన. వ్యక్తం చేస్తున్నారు. ఎలక్ట్రానిక్ ఉపకరణాల్లో సీసం, పాదరసం, కాడ్మియం, క్రోమియం వంటి రసాయన పదార్థాలు ఉంటాయి. వీటిని సరిగా నిర్వీర్యం చేయ కుండా పారేస్తే, గాలి, నీరు,నేల కలుషితం అవుతాయి. ఈ కలుషితాలతో శ్వాస కోశ వ్యాధులు నాడీ సంబంధిత రుగ్మతలు దీర్ఘకాలిక వ్యాధులకు కారణవుతాయని వైద్యులు చెబుతున్నారు. పిల్లలు. వృద్ధులపై ఈ ప్రమాదం ఎక్కు గా ఉంటుందని వారు పేర్కొన్నారు. ఎలక్ట్రానికి వ్యర్థాల నిర్వహణ సక్రమంగా, కనీసంగా అమలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

దేశంలో అత్యధికంగా ఈ వేస్టు రీ సైక్లింగ్ కేంద్రాలు ఉన్న రాష్ట్రాలు వివరాలు ఇలా ఉన్నాయి.

| | |
|---|---|
| ఉత్తర ప్రదేశ్ | 82 |
| కర్నాటక | 45 |
| మహారాష్ట్ర | 43 |
| హర్యాన | 32 |
| గుజరాత్ | 29 |
| తెలంగాణ | 15 |
| తమిళనాడు | 13 |
| రాజస్థాన్ | 10 |

# తెలంగాణలో మినరల్స్ నిక్షేపాలు

## 5 జిల్లాల్లో గ్రానైట్, సున్నపురాయి తవ్వకాలకు సర్కార్‌కు ప్రతిపాదనలు

**హైదరాబాద్, అక్టోబరు 9 ప్రభాతవార్త:** ఇసుకతో పాటు, ఇతర మినరల్స్ తవ్వకాలను చేపట్టేందుకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ నిర్ణయించింది. ఖనిజ అభివృద్ధి సంస్థ ప్రస్తుతం ఒక్క ఇసుక విక్రయాలు మాత్రమే నిర్వహిస్తుండా, మిగిలిన ఖనిజాలను టెండర్ల పద్దతిలో ప్రైవేటు వ్యక్తులకు కేటాయింపులు చేస్తోంది. అయితే అనుమతి పొంది సంబంధిత ఖనిజ తవ్వకాలను చేస్తున్న సంబంధిత కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతూ రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నట్లు సంస్థ గుర్తించింది. దీంతో ఇసుకతో పాటు, ఇతర ఖనిజాలను కూడా సంస్థ ద్వారా చేపట్టాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఖనిజ అభివృద్ధి సంస్థ అధికారులు ప్రభుత్వానికి సమర్పించారు. రాష్ట్రంలో ఇసుకతో పాటు, డోలమైట్, గ్రానైట్, సున్నపురాయి, మార్బుల్, మైకా తదితర ఖనిజాల నిల్వలు ఉన్నాయి. ప్రభుత్వం నుండి అనుమతి వచ్చినట్లయితే వీటన్నింటినీ ఇక నుండి సొంతంగానే తవ్వకాలు జరిపాలని అధికారులు నిర్ణయించారు. కాగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీగా గ్రానైట్, సున్నపు రాయి నిల్వలు ఉన్నట్లు బయటపడింది. ఈ మేరకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షల్లో రాష్ట్రంలోని 5 జిల్లాల్లో గ్రానైట్, సున్నపు రాయి నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించింది. ప్రధానంగా కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో గ్రానైట్ నిల్వలు భారీగా ఉన్నట్లు తేల్చింది. కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు, ఖమ్మం జిల్లాలో కొత్తగట్టు, నమిలికొండ, వెంతడుప, తాళ్లపూసపల్లె తదితర ప్రాంతాల్లో 83.25 హెక్టార్ల విస్తీర్ణంలో 28,400 క్యూబిక్ మీటర్లలో తెలుపు, బ్రౌన్, నలుపు రకాలకు చెందిన గ్రానైట్ నిల్వలు ఉన్నాయి. అదేవిధంగా నల్లగొండ, సూర్యాబాద్, వికారాబాద్ జిల్లాల్లో సున్నపు రాయి నిక్షేపాలు ఉన్నట్లు కనుగొంది. ఆయా జిల్లాల్లోని సూర్యాపేట్ జిల్లాలోని మేళ్లచెర్వు, మఠంపల్లి, రఘునాధపాలెం, రామాపురం, దొండపాడు, నల్లగొండ జిల్లా



తామరచెర్ల, వికారాబాద్ జిల్లా మల్కాపూర్, జివాంగి ప్రాంతాల్లో 276.83 కిలోమీటర్ల విస్తీర్ణంలో సున్నపు రాయి నిల్వలు ఉన్నట్లు గుర్తించింది. ఈ మేరకు వీటికి సంబంధించిన తాజాగా నివేదికను ఖనిజాభివృద్ధి సంస్థ ప్రభుత్వానికి సమర్పించింది. ఇదే సమయంలో ఈ నిక్షేపాలను తవ్వేందుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరింది.

# సుంకాలు పెనుభారమే

## ఎపిలో మచిలీపట్నం పోర్ట్ దాకా 12 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే అమెరికా ప్రతినిధి బృందంతో తెలంగాణ సిఎం రేవంత్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు9:** అమెరికా నిర్ణయాలు, అనుసరించే విధానాలన్నీ సానుకూల దృక్పథంతో.. అమెరికా, భారత్ మధ్య సంబంధాలను మరింత పెంపొందించేలా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఇటీవల అమెరికా పెంచిన సుంకాలు, హెచ్ 1 బీ వీసాలపై విధించిన కఠిన నిబంధనలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థను ప్రభావం చేయటంతో పాటు అస్థిరతకు, అపార్థానికి దారి తీస్తాయన్నారు. రెండు దేశాల మధ్య ఆర్థిక వృద్ధికి దోహదపడే విధానాలు అనుసరిస్తే ప్రపంచానికి ఆదర్శవంతంగా ఉంటుందన్నారు. తెలంగాణకు వచ్చిన అమెరికా ప్రతినిధుల బృందంతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తన అభిప్రాయాలను పంచుకున్నారు. అమె రికా నుంచి వచ్చిన ప్రతినిధులు గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీ, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, టీజీఐఐసీ ఎండీ, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ కె.శశాంక, ఇండ స్ట్రీస్ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి ఈ సమావేశంలో పాల్గొన్నారు. అమెరికాలోని హడ్సన్ ఇన్స్టిట్యూట్ కు చెందిన ప్రతినిధులు 16 మంది ఈ సమావేశంలో పాల్గొన్నారు. వివిధ రంగాలకు చెందిన మేధావులు, బిజినెస్ లీడర్లు ఈ బృందంలో ఉన్నారు. ఇండియా ఫౌండేషన్ సారథ్యంలో ఈ ప్రతినిధి బృందం భారత్‌లో పలు రాష్ట్రాల్లో పర్యటిస్తోంది. భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యాపార వాణిజ్య వ్యవహారాలు, విధానాలపై ఈ బృందం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటించి అభిప్రాయాలు స్వీకరి స్తోంది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. పాలకులు మారితే విధానాలు మార్చుకోవాల్సిన అవసరం లేదని, రాష్ట్ర అభివృద్ధి విషయంలో ఉత్తమమైన విధానాలను ప్రభుత్వం ఇప్పటికీ కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికే ఐటీ, ఫార్మా రంగాల పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాద్ ప్రపంచ నగరంగా అందరినీ ఆకర్షిస్తోందని, దేశ విదేశాల నుంచి పెట్టుబడులు పెట్టేం దుకు ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇక్కడికి వస్తున్నాయన్నారు. హైదరాబాద్ ఇప్పుడు న్యూయార్క్, టోక్యో, దక్షిణ కొరియాతో పోటీ పడుతోందని, మన మౌలిక సదుపాయాలు, తయారీ సామర్థ్యాలను మెరుగుపరచడంలో ప్రపం చ ప్రమాణాలకు సవాలుగా ఉందని ఆయన అన్నారు. జీఎస్డీపీ, తలసరి ఆదాయంలో తెలంగాణ అనూహ్య పురోగతి సాధించిందని, 2034 నాటికి ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దుతామని అన్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి సాధించాలనేది ప్రభుత్వంలక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి అన్నారు. హైదరా బాద్‌లో గేమ్‌ఛేంజర్ ప్రాజెక్టులు చేపడుతున్నామని ముఖ్యమంత్రి వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీతో పాటు రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్, మాన్యుఫాక్చర్ జోన్లు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. డ్రై పోర్ట్ ఏర్పాటు చేసి పొరుగున ఉన్న ఏపీలో మచిలీపట్నం పోర్ట్ వరకు 12 లేన్ గ్రీన్ ఫీల్డ్ హైవే, రైల్ కనెక్టివిటీ ఉండేలా రవాణా సదుపాయాలు విస్తరిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ నుంచి అటు చైన్నై వరకు, ఇటు హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు బుల్లెట్ ట్రైన్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలున్నాయని అన్నారు. హైదరాబాద్‌లో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు అభివృద్ధి చేస్తామని, సిటీలో ఇప్పుడున్న మెట్రో రైలును అన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నట్లు చెప్పారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడానికి కొత్త మార్గాలను తెరుస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. 30 వేల ఎకరాల్లో హైదరాబాద్‌లో అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో అమెరికా పరిశ్రమల భాగస్వామ్యాన్ని, మద్దతును ఆహ్వానిస్తున్నామని అన్నారు. ఇప్పటికే ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో 50 కంపెనీలు హైదరాబాద్‌లో ఉన్నాయని, మొత్తం 500 కంపెనీలు పెట్టుబడులకు ముందుకు రావాలని, ఫ్యూచర్ సిటీలో పాలుపంచుకోవాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. 'చైనా+1' వ్యూహానికి తెలంగాణ అత్యుత్తమ ఎంపికగా నిలుస్తుందని, అటువంటి భవిష్యత్తు ప్రణాళికలను తమ ప్రభుత్వం అనుసరిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్‌లో ఏఐ సిటీతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసే ఆలోచనలున్నాయని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. ఏఐ రంగంలో రాష్ట్రాన్ని దేశానికే స్కిల్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దాలనే ప్రణాళికతో ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు.



# వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలకు రండి

**ఆత్రేయపురం, అక్టోబరు 9 (ప్రభాత వార్త):** ఈనెల 10 నుండి జరగనున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 13 వ వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయం, సహకార శాఖ, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖ, డెయిరీ డెవలప్మెంట్, మత్స్యశాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి అమ్మవారి ఆలయం ఈఓ సేనా నాయక్, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్ లాల్‌కి ఆహ్వాన పత్రికను ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు అందజేసి ఆహ్వానించారు.



# హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

## రూ.10 కోట్ల విలువైన ఎఫిడ్రిన్ స్వాధీనం

**హైదరాబాద్, అక్టోబరు 9 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మరోసారి భారీ డ్రగ్స్ పట్టుబడింది. అత్యంత పటిష్ట నిఘా ఉన్న అక్రమార్కులు మాదకద్రవ్యాలను సరఫరా చేస్తూనే ఉన్నారు. జీడిమెట్లలో 220 కిలోల ఎఫిడ్రిన్‌ను ఈగల్ టీం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.72 కోట్లు ఉంటుందని అధికారులు భావించారు. దేశ మార్కెట్‌లో రూ.10 కోట్లు ఉంటుందని తెలిపారు. జీడిమెట్ల పరిధిలోని సుచిత్రా క్రాస్ రోడ్స్ సమీపంలోని స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీలో సాయిదత్తా రెసిడెన్సీలో డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు ఈగల్ టీంకు విశ్వసనీయ సమాచారం అందడంతో దాడులు నిర్వహించి ఎఫిడ్రిన్ డ్రగ్స్ ను పట్టుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేయగా.. ఒకరు పరారీలో ఉన్నారని పోలీసులు పేర్కొన్నారు. ఎఫెడ్రిన్ తయారీకి బిగ్ స్కేల్ కెమికల్ యూనిట్ వినియోగించినట్లు గుర్తించారు. డ్రగ్ తయారీలో ప్రధాన నిందితుడు అయిన వాస్తవాయి శివరామకృష్ణ వర్మతో పాటు దంగేటి అనిల్, మద్దు వెంకటకృష్ణ, ఎం ప్రసాద్, ముసిని దొరబాబు ఉన్నారని తెలిపారు. వీరంతా ఏపీలోని కాకినాడ, తూర్పు గోదావరి, నెల్లూరు జిల్లాలకు చెందిన వారని పోలీసులు తేల్చారు. డ్రగ్ తయారీకి వాడిన ఫార్ములాను సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# రూ.136 కోట్లతో సాగునీటి ప్రాజెక్టులకు ఆమోదం

**విజయవాడ, అక్టోబరు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో మరో రెండు డ్యాంల మరమ్మత్తులకు పాలనామోదం ఇచ్చారు. మొత్తం రూ.136.29 కోట్లతో ఈ పనులు చేపట్టేందుకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. అనంతపురంలోని హంద్రీనీవా నుంచి ఉరవకొండ నియోజక వర్గంలో ఎత్తయిన ప్రాంతాల్లోని ఆయకట్టుకు నీటిని ఎత్తిపోసేందుకు, అక్కడ డిస్ట్రిబ్యూటరీల పనులు పూర్తి చేసేందుకు ఆమోదం తెలియచేశారు. వజ్రకరూరు మండలంలో నీటిని ఎత్తిపోసేందుకు రాగులపాడు గ్రామం వద్ద కొట్టాలపిల్ల ఎత్తిపోతలను నిర్మించనున్నారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగా స్లూయిస్‌ల నిర్మాణం,నూతన కట్టడాలతో పాటు వరద కట్ట, రోడ్డు నిర్మించాలని నిర్ణయించిన నేపథ్యంలో... నెల్లూరు లోని డివి సత్రం, సూళ్ళూరుపేట, తడ మండలాల్లోని కాళింగ వరద కట్టల నిర్మాణానికి గతంలో అప్పగించిన ప్యాకేజీకి సంబంధించిన రెండు పనులను ముందస్తుగా ముగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

# మోహన్‌బాబుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

**తిరుపతి విద్య, అక్టోబరు 9 ప్రభాతవార్త:** మోహన్ బాబు యూనివర్సిటీ గుర్తింపు రద్దు చేసి మంచు మోహన్ బాబు,మంచు విష్ణుల పైన క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ తిరుపతిలోని బాలాజీ కాలనీలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ ఎస్ యూ ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. మల్లికార్జున మీడియాతో మాట్లాడుతూ మోహన్ బాబు యూనివర్సిటీలో జరిగిన ఫీజుల అక్రమాలు,నిధుల దుర్వినియోగం పై విస్తృతంగా వ్యాఖ్యానించారు. గత మూడు సంవత్సరాలుగా మోహన్ బాబు యూనివర్సిటీలో,ఫీజుల వసూళ్లలో వివిధ రకాల అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు విద్యార్థులు, తల్లిదండ్రులు పలుమార్లు వినిపించారు. కానీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో ఈ అక్రమాలు మరింత విస్తరించి విద్యార్థులకు భారీ ఆర్థిక నష్టం కలిగించారు. తాజాగా ఉన్నత విద్యా మండలి మరియు ఆంధ్రప్రదేశ్ ఫీజు రెగ్యులేషన్ కమిటీ నిర్వహించిన విచారణలో మోహన్ బాబు యూనివర్సిటీలో విద్యార్థుల నుండి అదనపు ఫీజులు వసూలు చేసి,వాటిని అక్రమంగా మళ్లించారని స్పష్టమైంది. కమిటీ రూ. 15 లక్షల జరిమానా విధించి, విద్యార్థులకు రూ. 26 కోట్లు తిరిగి చెల్లించాలనే ఆదేశం ఇవ్వడం సరైన దిశలోని అడుగు అని ఎన్ఎస్‌యుఐ స్వాగతిస్తున్నప్పటికీ,ఇది సరిపోదని అక్రమల పైన సిట్ విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. ముఖ్యంగా మోహన్ బాబు యూనివర్సిటీకి అనుబంధంగా నడుస్తున్న హాస్టల్,మెస్ ఫీజులు తారుమారు చేసి దాదాపు రూ. 200 కోట్లకు పైగా నిధులను విద్యానికేతన్ ట్రస్ట్ నుంచి మంచు విష్ణు వ్యక్తిగత కంపెనీలకు మళ్లించారని ఆరోపించారు. దీని ఫలితంగా విద్యార్థులు చెల్లించిన మొత్తంలో సుమారు రూ. 230 కోట్లు విద్యా ప్రయోజనాలకు ఉపయోగించబడకుండా పక్కదారి పట్టాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వమే యూనివర్సిటీ నిర్వహణను స్వాధీనం చేసుకుని,ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎస్వీ యూనివర్సిటీ,స్విమ్స్ ఆధ్వర్యంలో కొనసాగించాలని,విద్యానికేతన్ ట్రస్ట్,సంబంధిత కంపెనీల ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక దర్యాప్తు బృందం నియమించి సమగ్ర విచారణ చేపట్టాలని, మంచు మోహన్ బాబు, మంచు విష్ణు,ట్రస్టు సభ్యులను అరెస్టు చేసి విదేశాలకు పారిపోకుండా వారి పాస్‌పోర్ట్‌లను రద్దు చేయాలి. యథాతథంగా కొనసాగుతున్న విద్యా ప్రక్రియలో విద్యార్థులు, అధ్యాపకులు రక్షించబడాలని చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం శివ బాలాజీ,మన్సూర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



10-10pg10exM 12 GNT_10-10pg10exM.qxd 10/9/2025 10:02 PM Page 1



షాంఘై టెన్నిస్ మాస్టర్స్‌లో..

# వరల్డ్ నంబర్ 11 హోల్గర్ ఓటమి




**న్యూఢిల్లీ:** షాంఘై మాస్టర్స్ 2025లో ప్రపంచ నెంబర్ 11 హోల్గర్ రూన్ అనూహ్యంగా ఓటమి పాలయ్యాడు. అతనిపై ప్రపంచ అత్యల్ప నెంబర్ 204 స్థానంలో ఉన్న వాలెంటిన్ వాచెరోట్ విజయం సాధించాడు. షాంఘై మాస్టర్స్ సెమీఫైనల్స్‌లో గురువారం జరిగిన మ్యాచ్‌లో హోల్గర్‌పై 2-6, 7-6 (7/4), 6-4 తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. 26 ఏళ్ల ఈ యువకుడితో జరిగిన తొలి సెట్‌ను సునాయాసంగా గెలుచుకునేందుకు రూన్ మూడవ, ఏడవ గేమ్‌లలో బ్రేక్ వేశాడు. డబుల్ ఫాల్ట్ తర్వాత రెండవ సెట్‌లోని నాల్గవ గేమ్‌లో ముందుకు వెళ్లే అవకాశాన్ని వాచెరోట్ ఉపయోగించుకున్నాడు, కానీ రూన్‌కు ఎదురుదెబ్బ తగిలింది. దీంతో వాచెరోట్ గట్టి పట్టుదలతో ట్రైబ్రేక్‌ను సాధించాడు. నియంత్రణ సాధించడంలో విఫలమైనందున రూన్ మరిన్ని ప్రయత్నాలు చేసి, ట్రైబ్రేక్‌లో రెండు ఏస్‌లు కొట్టినప్పటికీ, చివరికి రెండవ సెట్‌ను వదులుకున్నాడు. మూడవ సెట్ యొక్క ఏడవ గేమ్‌లో అతను సమయ ఉల్లంఘనకు గురై, వాచెరోట్‌కు బ్రేక్ ఇవ్వడానికి మూడు అనవసర తప్పిదాలు చేయడంతో అతని ఓటమి ఖాయమైంది. హోల్గర్ రూన్ చివరి ప్రయత్నం చేసినప్పటికీ వాచెరోట్ అనూహ్యంగా పాయింటు సాధించి అసంభవమైన విజయాన్ని సాధించాడు.

ఆసియా కప్ క్వాలిఫైయర్‌లో

# భారత్, సింగపూర్ మ్యాచ్ డ్రా



**న్యూఢిల్లీ:** ఎఎఫ్‌సి ఆసియా కప్ 2027 క్వాలిఫైయర్ మ్యాచ్‌లో సింగపూర్‌తో జరిగిన మ్యాచ్‌ను భారత్ 1-1తో డ్రాగా ముగించింది. గురువారం నేషనల్ స్టేడియంలో జరిగిన క్వాలిఫైయం మ్యాచ్‌లో రెండవ అర్ధభాగం ప్రారంభంలో సింగపూర్‌తో భారత్ జట్టు (బ్లూ టైగర్స్) హోరా హోరీగా పోరు సాగించింది. రహీమ్ అలీ చివరిలో నాటకీయ సమం చేయడం ద్వారా విలువైన పాయింట్‌ను కాపాడుకున్నాడు. ఆట ప్రారంభం నుంచే భారత్ పట్టుదల ప్రదర్శించి, దాడులను చేయడంతో ప్రారంభమైంది. కానీ మొదటి అర్ధభాగం ముగిసేసరికి సింగపూర్ మ్యాచ్‌లో మరింతగా పోరు సాగింది. లయన్స్ జట్టు గురుప్రీత్ సింగ్ సంధును గోల్ అవకాశాలను సృష్టించింది. కానీ భారత్ 0-0తో బ్రేక్ స్థాయికి చేరుకుంది. రెండవ అర్ధభాగం భారత్‌కు ప్రారంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. పునఃప్రారంభమైన ఒక నిమిషం తర్వాత సందేశ్ జింగాన్‌కు రెండవ పసుపు కార్డు వచ్చింది. దీనితో బ్లూ టైగర్స్ పది మందితో మిగిలిపోయింది. సింగపూర్ వెంటనే సంఖ్యాపరమైన ప్రయోజనాన్ని సద్వినియోగం చేసుకుంది, ఇఖ్సాన్ ఫాండి అహ్మద్ 46వ నిమిషంలో ప్రతిష్టంభనను ఛేదించాడు. ఎదురుదెబ్బ తగిలినప్పటికీ, భారతదేశం దృఢంగా నిలిచింది. గురుప్రీత్ సింగ్ సంధు అనేక కీలక సేవ్‌లను చేసి లోటును ఒకే చోట ఉంచాడు. చివరగా, 89వ నిమిషంలో, రహీమ్ అలీ డిఫెన్సివ్ లోపంతో పాటు, సింగపూర్ గోల్ కీపర్ ఇజ్వాన్ మహబుద్ స్లిప్ ను సద్వినియోగం చేసుకుని గోల్ చేసి స్కోరును సమం చేశాడు.

వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో

# భారత్‌కు తొలిసారి పతకం ఖాయం

## క్వార్టర్ ఫైనల్లో కొరియాపై విజయం

**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ మిశ్రమ జట్టు తొలిసారిగా పతకాన్ని ఖాయం చేసుకుంది. రెండు దశాబ్దాల కరువుకు ముగింపు పలికి ఆతిథ్య జట్టు క్వార్టర్ ఫైనల్స్‌లో కొరియాను ఓడించింది. గౌహతిలోని నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గురువారం జరిగిన చారిత్రాత్మక ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ ఛాంపియన్‌షిప్‌లో పతకాన్ని ఖరారు చేసుకుంది. దాదాపు మూడు గంటల పాటు జరిగిన ఉత్కంఠభరితమైన క్వార్టర్ ఫైనల్ పోరులో ఆతిథ్య జట్టు విజయం సాధించింది. తొలి సెట్‌లో కొరియాను 44-45, 45-30, 45-33 తేడాతో ఓడించి, ఆసియా అండర్ 19 మిక్స్‌డ్ టీమ్ ఛాంపియన్ ఇండోనేషియాతో సెమీఫైనల్ పోరుకు సిద్ధమైంది.



అలాగే ఇండోనేషియా 45-35, 45-35 తేడాతో చైనీస్ తైపీని ఓడించింది. సెమీఫైనల్‌కు చేరుకోవడం ద్వారా ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్ చరిత్రలో భారతదేశానికి తొలి మిశ్రమ జట్టు పతకం ఖాయమైంది. క్వార్టర్ ఫైనల్స్ తొలి బాలుర డబుల్స్‌లో భార్గవ్ రామ్ అరిగెల-విశ్వ తేజ్ గొబ్బూరు 5-9 తేడాతో చో హ్యోంగ్ వూ-లీ హ్యోంగ్ వూ చేతిలో ఓడిపోవడంతో మొదటి సెట్ అలాగే సాగింది. బాలికల డబుల్స్‌లో వెన్నల-రేషికా యు జంట 10-9 తేడాతో చియోన్ హ్యే ఇన్-మూన్ ఇన్ సియోలను ఓడించి ఒక పాయింట్ తేడాతో లోటును తగ్గించగలిగింది. ఆ తర్వాత రౌనక్ చౌహాన్ చోయ్ అహ్ సెయుంగ్‌ను 11-9 తేడాతో ఓడించి వారిని ఒక పాయింట్ దగ్గరకు తీసుకువచ్చారు.



మహిళల ప్రీమియర్ లీగ్:

# నవంబర్ 25న వేలం

## ఐదుగురిని మాత్రమే కొనసాగించే అవకాశం

**న్యూఢిల్లీ:** మహిళల క్రికెట్‌కు విశేష ఆదరణ కల్పించిన మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపిఎల్) మరో ఎడిషన్‌కు సిద్ధమవుతోంది. గత మూడు సీజన్లు అభిమానులను అలరించిన ఈ మెగా టోర్నీ నాలుగో సీజన్ రాబోతోంది. అంతకంటే ముందుగా వేలం నిర్వహణకు కసరత్తు జరుగుతోంది. నవంబర్ 25 లేదా 29న ఆక్షన్ జరిపేందుకు నిర్వాహకులు సన్నాహకాలు చేస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగానే ఎంతమందిని అట్టిపెట్టుకోవాలి? రైట్ టుమ్యాచ్? వంటివాటి గురించి ఫ్రాంచైజీలకు నిర్వాహకులు గురువారం ఈమెయిల్ ద్వారా కీలక సూచనలు చేశారు. ఈసారి ఐదుగురినిమాత్రమే అట్టిపెట్టు కునేందుకు ఫ్రాంచైజీలకు అనుమతిచ్చారు. ఇందులో గరిష్టంగా భారత క్రికెటర్లు ముగ్గురు, విదేశీయులు ఇద్దరు ఉండాలని సూచించారు. భారత క్రికెటర్లలో ఇద్దరు అన్‌క్యాప్డ్ ప్లేయర్లను రీటైన్ చేసుకునేందుకు ఓకే చెప్పారు. నవంబర్ 5వ తేదీలోపే అన్ని యాజమాన్యాలు తమ రీటైన్ ప్లేయర్ల జాబితాను వెల్లడించాలని తెలిపారు. పేర్ల నమోదుకు నవంబర్ 18 ఆఖరు తేదీ. నవంబర్ 20న వేలంలో నిలిచిన ప్లేయర్ల పేర్లను బీసీసీఐ విడుదల చేయనుందని సమాచారం. అలాగే రైట్ టు మ్యాచ్‌ను అనుమతిస్తూ నిర్వాహకులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఒక ఫ్రాంచైజీ ఐదు ఆర్టీఎమ్‌లో పాల్గొనవచ్చు. ఒకవేళ ఫ్రాంచైజీ నలుగురిని అట్టిపెట్టుకుంటే వాళ్లకు ఒకేఒక ఆర్‌టీఎమ్ ఛాన్స్ ఉంటుంది. అలానే ముగ్గురిని రీటైన్ చేసుకుంటే రెండు ఆర్‌టీఎమ్స్‌లోపాల్గొనవచ్చు. ఇద్దరిని రీటైన్‌చేసుకుంటేమూడు ఆర్‌టీఎమ్స్, ఒక్కరినే అట్టిపెట్టుకుంటే నాలుగు ఆర్‌టీఎమ్స్ లభిస్తాయి. ఇక ఈ వేలంలో ఫ్రాంచైజీలు రూ.15 కోట్లు ఖర్చు చేయనున్నాయి. ఒక క్రికెటర్‌కు మాత్రమే రూ.3.5 కోట్లు చెల్లించే అవకాశముంది. రెండో ప్లేయర్‌కు రూ.2.5 కోట్లు, మూడో ప్లేయర్‌కు రూ.1.75కోట్లు, నాలుగో బ్యాటర్‌కు రూ.1 కోటి..ఐదుగురు ప్లేయర్లకు రూ.50 లక్షలు వేలం పాట పాడాల్సి ఉంటుంది. ఒక ఫ్రాంచైజీ ఐదుగురిని అట్టిపెట్టుకుంటే వాళ్ల పర్స్ నుంచి రూ.9.75ను తొలగిస్తారు. ఒకవేళ నలుగురిని రీటైన్ చేసుకుంటే.. రూ.8.75 కోట్లు.. ముగ్గురికి రూ.7.75 కోట్లు, ఇద్దరిని రీటైన్ చేసుకుంటే రూ.6 కోట్లు కట్ చేస్తారు.

రంజీ ట్రోఫీలో

# హైదరాబాద్ కెప్టెన్‌గా తిలక్

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టును టీమిండియా స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ నడిపించనున్నాడు. ఢిల్లీతో ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే రంజీ మ్యాచ్ కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సెలెక్షన్ కమిటీ 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో దుమ్ము రేపుతున్న తిలక్ తిరిగి కెప్టెన్‌గా నియమించింది. అతనికి రాహుల్ సింగ్ డిప్యూటీగా వ్యవహరించనున్నాడు. ఈ రంజీ కి టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ దూరంగా ఉన్నాడు. ఆస్ట్రేలియా పర్యటన, సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌ల నేపథ్యంలో దేశవాళీ క్రికెట్ నుంచి సిరాజ్‌కు విశ్రాంతి కల్పించారు. హైదరాబాద్ జట్టులో సీవీమిలింద్, తన్మయ్అగర్వాల్, అభిరత్‌రెడ్డి, హిమతేజ, తనయ్ త్యాగరా



జన్, రోహిత్ రాయుడు, నిశాంత్, అనికేత్, కార్తికేయ, అలీ కాచి డైమండ్, రాహుల్ రాదేశ్ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. నితేష్, సాయి ప్రజ్ఞయ్, రక్షన్‌రెడ్డి, నితేష్ కనాలా, మిఖిల్ జైస్వాల్ స్టాండ్‌బైలుగా ఎన్నికయ్యారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఐదు టీ20ల సిరీస్‌కు తిలక్ వర్మ ఎంపికయ్యాడు. ఈ క్రమంలో అతను రెండో రంజీ మ్యాచ్‌కు దూరం కానున్నాడు. కాగా గత సీజన్‌లో ఎలైట్ గ్రూప్‌బీలో ఆడిన హైదరాబాద్ జట్టు7 మ్యాచ్‌లకు 2మాత్రమే గెలిచింది. మరో2 మ్యాచ్‌లను డ్రాచేసుకొని మూడింటిలో ఓడింది. లీగ్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది.

# టిసిఎస్ నికరలాభం రూ.12,075 కోట్లు

## గతేడాదికంటే 1.4% వృద్ధి

### వాటాదారులకు రెండో మధ్యంతర డివిడెండ్




**ముంబయి, అక్టోబరు 9:** భారతీయ ఐటీ సేవల రంగంలో అతిపెద్ద సంస్థగా ఉన్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ రెండో త్రైమాసికంలో కంపెనీ నికరలాభం రూ.12,075 కోట్లుగా వెల్లడించింది. గతేడాది ఇదే రెండో త్రైమాసికంలో నికరలాభం రూ.11,909 కోట్లతో పోలిస్తే ఈసారి 1.4 శాతం వృద్ధి చెందినట్లు వెల్లడించింది. అయితే, మార్కెట్ అంచనాలను అందుకోలేకపోయింది. మార్కెట్ అంచనాల ప్రకారం కంపెనీ నెట్ ప్రాఫిట్ రూ.12,573 కోట్లుగా ఉండగా ఫలితాల్లో రూ.12,075 కోట్లకు పరిమితమైంది. టాటా గ్రూప్ టెక్ దిగ్గజం ఆపరేషన్స్ రాబడులు రెండోత్రైమాసికంలో 2.4శాతం వృద్ధి చెంది రూ.64,259 కోట్ల నుంచి రూ.65,799 కోట్లకు చేరింది. వాటాదారులకు ఈ ఏడాది రెండో మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.11 చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లిస్తామని తెలిపింది. ఇందుకు సంబంధించిన రికార్డ్ తేదీని ఈనెల 15గా నిర్ణయించింది. అర్హులైన షేర్ హోల్డర్లకు డివిడెండ్ నవంబర్ 4న ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడించింది. ఇక ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం ఏప్రిల్ జూన్‌లో కంపెనీ ఆదాయం రూ.63,437 కోట్లతో పోలిస్తే ఈసారి రెవెన్యూ 3.7 శాతం పెరిగింది. స్థిరకరెన్సీలో 0.8 శాతం వృద్ధి సాధించింది. త్రైమాసికం వారీగా టిసిఎస్ ఇంటర్నేషనల్ రెవెన్యూ 0.6 శాతం పెరిగినట్లు తెలిపింది. ఇక కంపెనీ ఆపరేటింగ్ మార్జిన్ 25.2 శాతం వద్ద ఉంది. త్రైమాసికం వారీగాచూస్తేచూస్తే 70 బేసిస్ పాయింట్లు పెరిగింది. నెట్ మార్జిన్ 19.6 శాతంగా ఉన్న క్రమంలో కంపెనీ నెట్ ఇన్‌కమ్ 8.4 శాతం వృద్ధి నమోదు చేసినట్లు టిసిఎస్ తెలిపింది. రెండో త్రైమాసిక ఫలితాల ప్రకటన నేపథ్యంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ షేరు ధర లాభాల్లో ముగిసింది. గురువారం మార్కెట్లు ముగిసే సమయానికి కంపెనీ షేరు బిఎస్ఇలో రూ.3061.95 వద్ద ముగిసింది. క్రితం రోజు ముగింపుతో పోలిస్తే 1.16 శాతం లాభపడింది. ఈసారి ఫలితాల్లో రాణిస్తుందన్న అంచనాలతో ఇన్వెస్టర్లు ఈ షేర్లు కొనేందుకు మొగ్గు చూపడంతో షేర్లు లాభాల్లో ముగిసినట్లు తెలుస్తోంది.

# ఎస్ఎంఇలకోసం ఫోన్‌పే 'స్మార్ట్‌ప్యాడ్'

**ముంబయి, అక్టోబరు 9:** దేశంలోని చిన్న, మధ్య తరహా వ్యాపారుల డిజిటల్ చెల్లింపుల స్వీకరణలో విప్లవాత్మక మార్పు తీసుకువచ్చేందుకు ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే ముందుకొచ్చింది. యూపిఐ సౌండ్‌బాక్స్‌తో పాటు కార్డు చెల్లింపులను కూడా స్వీకరించేలా ఒకే పరికరంలో రెండు సదుపాయాలను అందిస్తూ 'ఫోన్‌పే స్మార్ట్‌పాడ్'ను ఆవిష్కరించింది. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025 వేదికగా ఈ సరికొత్త హైబ్రిడ్ డివైజ్‌ను కంపెనీ పరిచయం చేసింది. ప్రస్తుతం చాలామంది వ్యాపారులు యూపిఐ చెల్లింపుల కోసం స్మార్ట్‌స్పీకర్లను వాడుతున్నారు. అయితే, కార్డు ద్వారా చెల్లించాలనుకునే కస్టమర్లు వచ్చినప్పుడు, పిఓఎస్ మెషిన్ లేకపోవడంతో వ్యాపారాన్ని కోల్పోతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా ఫోన్‌పే ఈ స్మార్ట్‌పాడ్‌ను రూపొందించింది. ఇది స్మార్ట్‌స్పీకర్, పాయింట్ ఆఫ్ సేల్ (పిఓఎస్) పరికరాల కలయికగా పనిచేస్తుంది. తద్వారా వ్యాపారులు తక్కువ ఖర్చుతోనే అన్ని రకాల డిజిటల్ చెల్లింపులను సులభంగా స్వీకరించవచ్చు. పూర్తిగా భారత్‌లోనే తయారైన ఈ పరికరం, వ్యాపారుల అవసరాలకు తగ్గట్టుగా రూపొందించబడింది. ఈ స్మార్ట్‌పాడ్ మాస్టర్‌కార్డ్, వీసా, రూపే, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ వంటి అన్ని ప్రధాన నెట్‌వర్క్‌లకు చెందిన కార్డులను అంగీకరిస్తుంది. ఎన్ఎఫ్‌సి (ట్యాప్ అండ్ పే), ఇఎంవి చిప్ (డిప్ అండ్ పే) కార్డులతో చెల్లింపులు చేయవచ్చు. కస్టమర్లకు కనిపించేలా ఒక డిస్‌ప్లే, వ్యాపారి కోసం మరో డిస్‌ప్లే ఉండటం దీని ప్రత్యేకత. పిన్ ఎంటర్ చేయడానికి కీప్యాడ్, లావాదేవీల కోసం ఈరసీదుల వంటి అత్యాధునిక ఫీచర్లు కూడా ఇందులో ఉన్నాయి. ఈ ఆవిష్కరణపై ఫోన్‌పే చీఫ్ బిజినెస్ ఆఫీసర్ యువరాజ్ సింగ్ షెకావత్ మాట్లాడుతూ మా పాత స్మార్ట్‌స్పీకర్లు క్యూఆర్ కోడ్ చెల్లింపులను సులభతరం చేస్తే, ఈ స్మార్ట్‌పాడ్ ఒక అడుగు ముందుకేసి కార్డు చెల్లింపులను కూడా సాధ్యం చేస్తోంది. తక్కువ ఖర్చుతో అన్ని రకాల డిజిటల్ పేమెంట్స్‌ను స్వీకరించాలనుకునే చిన్న వ్యాపారులకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. దీనివల్ల వినియోగదారులు తమకు దగ్గర్లోని చిన్న దుకాణాల్లో కూడా కార్డులను వాడగలుగుతారని వివరించారు. స్మార్ట్‌స్పీకర్ 2.0లోని సెలబ్రిటీ వాయిస్ కన్ఫర్మేషన్, 4జి నెట్‌వర్క్, ఫాస్ట్ ఛార్జింగ్ వంటి ఫీచర్లు కూడా ఇందులో కొనసాగుతాయని ఆయన తెలిపారు.






నాలెడ్జ్

# ఫోర్బ్స్ బిలియనీర్ ముకేష్ అంబాని

**ముంబయి, అక్టోబరు 9:** రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ మరోసారి ఫోర్బ్స్ కుబేరుల జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. ఫోర్బ్స్ తాజాగా విడుదలచేసిన భారత్‌లోని 100 మంది సంపన్నుల జాబితాలో ముకేశ్ అంబానీ ఫస్ట్ ప్లేస్‌ను సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన సంపద 105 బిలియన్ డాలర్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే ముకేశ్ సంపద 12 శాతం క్షీణించింది. ఇక ముకేశ్ అంబానీ తర్వాత 92 బిలియన్ డాలర్లతో గౌతమ్ అదానీ రెండో స్థానంలో ఉన్నారు.

ఒపి జిందాల్‌కు చెందిన సావిత్రి జిందాల్ 40 బిలియన్ డాలర్లతో మూడోస్థానంలో, టెలికం దిగ్గజం సునీల్ మిట్టల్ 34 బిలియన్ డాలర్లతో నాలుగో స్థానంలో, టెక్ బిలియనీర్ శివ నాడార్ 33 బిలియన్ డాలర్లతో ఐదో స్థానంలో నిలిచారు. 2025 ఫోర్బ్స్ జాబితాలో 100 మంది దేశీయ కుబేరుల సంపద విలువ 9 శాతం (100 బిలియన్‌డాలర్లు) పడిపోయి 1ట్రిలియన్ డాలర్లకు చేరింది. ఇందుకు పలు కారణాలు ఉన్నట్లు ఫోర్బ్స్ నివేదించింది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14